

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-9-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 236 పేజీలు: 10+4 వెల: 6.50


స్థానిక ఎన్నికల్లో 69% రిజర్వేషన్లు ఇస్తాం: సిఎం రేవంత్ 2

జిఎస్టీ సవరణలపై ప్రతిపక్షాలు తప్పుదారి: పిఎం మోడీ 5

# సర్కార్ చేతికి 'మెట్రో'



హైదరాబాద్‌లో గురువారం సిఎం రేవంత్‌తో భేటీ అయిన ఎల్ అండ్ టి ప్రతినిధులు

## సిఎం రేవంత్, ఎల్ అండ్ టి సిఎండి మధ్య కుదిరిన అంగీకారం

### ఆ సంస్థకు ఉన్న రూ.13వేల కోట్ల అప్పు ప్రభుత్వం టేకోవర్

### రూ.2100 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైన ప్రభుత్వం

### రెండు నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయిన హైదరాబాద్ మెట్రో

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు25:** హైదరాబాద్ లో మెట్రో రైలు సేవలను విస్తరించేందుకు.. ఇప్పుడున్న మొదటి దశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు. గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఎల్ అండ్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎంఏయూడీ సెక్రెటరీ ఇలంబర్తి, హెచ్ఎంఆర్ఎల్ ఎండి సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం సెక్రెటరీ మాణిక్యరాజ్ పాల్గొన్నారు. ఎల్ అండ్ టీ గ్రూప్ సిఎండి ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్, సీఎండీ సలహాదారు డి.కె. సేన్, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (ఎల్‌టిఎంఆర్‌హెచ్ఎల్) ఎండీ, సిఈవో కె.వి.బి.రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల సందర్భంగా మెట్రో రైలు ఫేజ్ 1లో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇప్పుడు ఎల్ అండ్ టీ మెట్రో పై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ. 13,000 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించనుంది. దీంతో పాటు తమ కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ. 2,000 కోట్లు వన్-టైమ్ చెల్లింపు అందించాలని >>2



ఢిల్లీలో గురువారం సిడబ్ల్యుసి కార్యాలయంలో తెలంగాణ ఇంజినీర్లతో అధికారుల భేటీ దృశ్యం

## సమ్మక్క సాగర్‌కు సిడబ్ల్యుసి సమ్మతి

### ఛత్తీస్‌గఢ్ ఎన్‌ఓసి ఇవ్వగానే వచ్చే నెల క్లియరెన్స్

### ఢిల్లీలో తెలంగాణ ఇంజినీర్లతో జరిపిన చర్చలు సంతృప్తికరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం గోదావరినదిపై ములుగుజిల్లాలో నిర్మాణం చేయతలపెట్టిన సమ్మక్కసాగర్ ప్రతిపాదనలపై సి డబ్ల్యు సి సంతృప్తి తెలిపింది. ఢిల్లీలోని కేంద్రజలసంఘం అధికారులతో గురువారం సమ్మక్కసాగర్ క్లియరెన్స్‌పై సమావేశం >>2

## సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ డి.రాజా

### తెలంగాణ నుంచి జాతీయ కార్యదర్శిగా పల్లా వెంకటరెడ్డి

### జాతీయ కార్యవర్గంలోకి ఎమ్మెల్యే కూనంనేని

### సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మెన్‌గా నారాయణ



**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 25:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డి రాజా తిరిగి ఎన్నికయ్యారు. చండీగడ్‌లో జరిగిన పార్టీ 25వ జాతీయ మహాసభల్లో రాజాను మరోసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. జాతీయ >>2

## నిరంతరం అప్రమత్తం



### భారీ వర్షాలున్నాయి.. అలర్ట్‌గా ఉండండి

### లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి

### హైదరాబాద్‌లో జిహెచ్ఎంసి, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అలర్ట్‌గా ఉండాలి: అధికారులకు సూచించిన సిఎం రేవంత్

### రానున్న రెండు రోజులు మళ్లీ కుండపోత హెచ్చరికలు చేసిన వాతావరణ శాఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ నివేదికపై అన్ని శాఖలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని నిరంతరం >>2

## కాళేశ్వరంపై సిబిఐ ప్రాథమిక విచారణ మొదలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు25:** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సిబిఐ అధికారులు గురువారం ప్రాథమిక విచారణ ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై సిబిఐ అధికారులు గురువారం ప్రాథమిక పరిశీలన చేసినట్టు అధికారవర్గాల సమాచారం. ఎన్‌డిఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) >>2






గురువారం రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో పిఎం కుసుమ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# ఆర్టీసీ బస్సెక్కితే బహుమతుల పండుగే..

## లక్కీడ్రాలో రూ.5.50 లక్షల విలువగల ప్రైజ్‌మనీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 25:** తెలంగాణలో పెద్ద పండుగగా జరుపుకునే దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణీలకు ఆర్‌టిసి బంపర్ ఆఫర్ ఇవ్వనుంది. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించేవారికి లక్కీ డ్రా నిర్వహించి, లక్షల రూపాయలను బహుమతులుగా ఇవ్వాలని టిజిఎస్‌ఆర్‌టిసి నిర్ణయించింది. లక్కీ డ్రాలో రీజియన్‌కి ముగ్గురు చొప్పున 33 మందికి రూ.5.50 లక్షల విలువగల బహుమతులను సంస్థ అందజేయనుంది. ఒక్కో రీజియన్‌కు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలను సంస్థ ప్రకటించింది. లక్కీ డ్రాలో పాల్గొనాలంటే ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు టిజిఎస్‌ఆర్‌టిసికి చెందిన హైఎండ్ బస్సులైన సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతో పాటు అన్ని రకాల ఏసీ బస్సుల్లో ప్రయాణించిన వారు అర్హులు. ఈ సర్వీసుల్లో ఎక్కిన ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్‌పై తమ పూర్తి పేరు, ఫోన్ నెంబరు రాసి బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌ల్లో వేయాల్సి ఉంటుంది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు చేసిన ప్రయాణాలను మాత్రమే లక్కీ డ్రాకి సంస్థ పరిగణనలోకి తీసుకుంటుంది. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు కూడా ఈ లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. లక్కీ డ్రా అనంతరం డ్రాప్‌బాక్స్‌లను సంబంధిత ఆర్‌ఎం కార్యాలయాలకు చేర్చి.. ప్రతిరీజియన్ పరిధిలో లక్కీ డ్రా నిర్వహించి ముగ్గురి చొప్పున విజేతలను అక్టోబర్8న అధికారులు ఎంపికచేస్తారు. లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేసి సంస్థ ఘనంగా సన్మానించనుంది. దసరా లక్కీ డ్రాలో ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆర్‌టిసి ఎండీ విసి సజ్జనార్ కోరారు. లక్కీ డ్రాకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 తోపాటు స్థానిక డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బందులు కలగకుండా ఆర్‌టిసి పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని, ప్రయా ణికుల సౌకర్యార్థం 7754 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని తెలిపారు.

# స్థానిక ఎన్నికల్లో 69% రిజర్వేషన్లు ఇస్తాం

## వచ్చే ఏడాది నుంచి తెలంగాణలో సిఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం

## దక్షిణాది రాష్ట్రాలకు తమిళనాడు విద్యావిధానం ఆదర్శం

### తమిళనాడు సిఎం స్టాలిన్‌తో కలిసి సిఎం రేవంత్ ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు25:** తమిళనాడు అవలంభిస్తున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం హృదయాన్ని తాకింది, బ్రేక్‌ఫాస్ట్‌తో పేద విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది, తెలంగాణలోనూ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తాం అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గురువారం తమిళనాడులోని చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో 'విద్యలో ముందంజలో తమిళనాడు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రసంగించారు. నాన్ ముదలవన్ (స్కిల్ డవెలప్‌మెంట్) రూ.10 వేల ఉపకార వేతనం ప్రభుత్వ కళాశాలలకు వెళ్లే బాలురు, బాలికలకు ఇచ్చే ఈ స్కీమ్‌లు ఉండడం అదృష్టం.. తమిళనాడు పేదలకు అండగా మంచి సీఎం స్టాలిన్ ఉన్నారు అని పేర్కొన్నారు. ఎన్నో శతాబ్దాల నుంచి తమిళ, తెలుగు రాష్ట్రాలు, ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రకపరమైన బలమైన సంబంధం ఉందన్నారు. 1991 సరళీకరణ తర్వాత సరళీకృత ఆర్థిక విధానాలతో తమిళనాడులో మ్యాన్యుఫ్యాక్చరింగ్



గురువారం చెన్నైలో తమిళ సిఎం స్టాలిన్‌తో కలిసి అర్హులకు చెక్కులను అందజేస్తున్న సిఎం రేవంత్

రంగం అభివృద్ధి చెందింది..తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాలు అభివృద్ధి చెందాయి.సామాజిక న్యాయం అమలులో తమిళనాడు-తెలంగాణ మధ్య సారూప్యతలున్నాయన్నారు. మేం కరుణానిధిని స్ఫూర్తిగా తీసుకున్నాం.మా రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం, 27 శాతం ఎస్సీ,ఎస్టీలకు, మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నాం అని స్పష్టం చేశారు. అన్నాదొరై, కరుణానిధి, కామరాజ్ నాడార్ వంటి గొప్ప యోధుల జన్మస్థలం తమిళనాడు.... కరుణానిధి విజన్‌ను అమలు చేస్తున్న స్టాలిన్, ఉదయనిధిలను అభినందిస్తున్నట్లు తెలిపారు ఇందిరాగాంధీ కామరాజ్ ప్లాన్‌ను అనుసరించారు..కామరాజ్ తమిళనాడులో తీసుకువచ్చిన విద్యా విధానాన్ని దేశం అనుసరిస్తోందని,. ఈభారతీయులంతా తమిళనాడు విద్యా విధానంతో స్ఫూర్తి పొందారని చెప్పారు. దేశంలో మొట్టమొదటగా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించింది తమిళనాడు రాష్ట్రమే.తమిళనాడు అమలు చేస్తున్న విద్యా విధానం మాకు ప్రేరణ కలిగించిందన్నారు. దక్షిణాదికి చెందిన కేరళ, కర్ణాటక, ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాలకు తమిళనాడు విద్యా విధానం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇటీవలే మేం నూతన విద్యా విధానం తీసుకువచ్చాం, అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి నర్సరీప్రారంభిస్తున్నాం,తమిళనాడులో మాదిరే తెలంగాణలో కూడా అనేక ఉన్నత విద్యా సంస్థలున్నాయని పేర్కొన్నారు. తమిళనాడు... తెలంగాణ దేశానికి రోడ్‌మ్యాప్ ఇవ్వనున్నాయి,నాలెడ్జ్ హాబ్ కానున్నాయి,తమిళనాడు మాదిరే తెలంగాణ కూడా విద్యపై చేసే వ్యయాన్ని భవిష్యత్ తరాలపై పెట్టుబడిగా భావిస్తుందన్నారు. కేవలం విద్య మాత్రమే దేశంలో సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి సాధనకు మార్గమని భావిస్తున్నాం, విద్యను విప్లవంగా మేం భావిస్తున్నామన్నారు.

# అప్పులకు వడ్డీల చెల్లింపులో 9వ స్థానంలో తెలంగాణ

## -కాగ్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అప్పులకు సంబంధించి వడ్డీల కింద ఖర్చు చేయడంలో దేశంలో తెలంగాణది 9వ స్థానంగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మొత్తం ఖర్చుల్లో 11.33 శాతం నిధులను వడ్డీల కింద సర్కార్ చెల్లించింది. 2013-14 నుండి 2022-23 ఆర్థిక సంవత్సరం వరకూ పదేళ్ల కాలంలో రాష్ట్రాలు చేసిన ఖర్చును కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదించింది. దేశంలోని మెజార్టీ రాష్ట్రాల్లో ప్రధానంగా వ్యవసాయం, ఇంధనం, సాంఘిక సంక్షేమం, క్రీడలు తదితర తొమ్మిది రంగాలపైనే ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించింది. 2022-23లో ఉద్యోగుల జీతాల కోసం తెలంగాణ ఖజానా నుండి 13.38 శాతం ఖర్చు చేసింది. కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులను తెలంగాణలో ఎక్కువగా జీతాలు, ఇతర ఖర్చుల కోసం వినియోగిస్తున్నారు. సబ్సిడీల నిమిత్తం రాష్ట్రంలో 5 శాతం నిధులను వ్యయం చేసింది. షేర్లు, ఈక్విటీలు, సెక్యూరిటీలు, టర్మ్ డిపాజిట్లు, ఇతర పెట్టుబడుల కోసం ఆ ఏడాది చేసిన ఖర్చు మొత్తంలో తెలంగాణ కేవలం 0.09 శాతం మాత్రమే వ్యయం చేసింది.

# స్మితా సబర్వాల్‌పై చర్యలు వద్దు: హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు25:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో ఐఎఎస్ అధికారి స్మితా సభర్వాల్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం విదితమే. ఈ నివేదికలో ఐఎఎస్ స్మితా సబర్వాల్ పేరును కూడా కమిషన్ పేర్కొంది. దీనిపై స్మితా సబర్వాల్ హైకోర్టును ఆశ్రయించారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని ఆమె న్యాయస్థానంలో సవాల్ చేశారు. కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఇప్పటికే దాఖలైన పిటిషన్లతో కలిపి దీనిని విచారిస్తామని పేర్కొంది.

## వారం - వర్జ్యం

26-09-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చవితి ఉ.9.33
విశాఖ రా.10.09
వర్జ్యం : రా.2.38-4.26
దు.ఉ.8.23-9.11, మ.12.24-1.12
శుభసమయం : ఉ.6.30-7.15, సా.6.30-7.15
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** సుదూర ప్రాంతాలలోని మీ ఆత్మీయుల సహాయసహకారాలు అందుకుంటారు.

**వృషభం:** కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు పథకాలపై దృష్టి సారిస్తారు.

**మిథునం:** విమర్శలను లెక్క చేయక మీ ఆలోచనలకు రూపకల్పన చేస్తారు.

**కర్కాటకం:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించడం వలన లాభ పడుతారు. ఫలితాలు కూడా లాభసాటిగానే ఉంటాయి.

**సింహం:** చేపట్టిన వ్యవహారాలలో నిదానం అవసరం. రుణాలు కొంతవరకు తీరుస్తారు.

**కన్య :** పెద్దలతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

**తుల :** ఉద్యోగులు అదనపు బాధ్యతలు మోయాల్సి ఉంటుంది. వాహనసౌఖ్యం పొందుతారు.

**వృశ్చికం:** కుటుంబసభ్యులతో కలిసి శుభకార్యాలలో పాల్గొంటారు. వస్తు, వస్త్రాల లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** దూరపు బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. కళలు, రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మకరం:** నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి.

**కుంభం:** పాత మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మీనం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సమ్మక్క సాగర్‌కు సిడబ్ల్యుసి సమ్మతి

>> రెండున్నరగంటలపాటు జరిగింది. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సాగునీటి సలహాదారు ఆధిత్యనాథ్‌దాస్ ఇఎన్‌సి అమ్‌జద్‌హుస్సేన్,ఇంటర్‌స్టేట్ వాటర్ రీసోర్స్ గోదావరి బేసిన్ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్ ములుగు సిఇ కుమారస్వామి, సమ్మక్కసాగర్ ఇఇ శంకరయ్య,డిఇ ప్రవీణ్,సాయిరాంలు పాల్గొని సిడబ్ల్యుసి అభ్యంతరాలన్నింటిని నివృత్తిచేశారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి నిరభ్యంతర పత్రం మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన విషయం సిడబ్ల్యుసి దృష్టికి తీసుకొచ్చారు. చత్తీస్గడ్ అక్టోబర్ రెండోవారం లోగా ఎన్‌వోసి ఇవ్వగానే అక్టోబర్ చివరి వారం వరకు అంతర్రాష్ట్ర క్లియరెన్స్ కూడా ఇచ్చేస్తామని సిడబ్ల్యుసి తెలంగాణ అధికారులకు హామి ఇచ్చింది. సమ్మక్కసాగర్ ప్రాజెక్టు నల్గొండ, వరంగల్‌కే కాకుండా తెలంగాణలోని విస్తారమైన ప్రాంతాల్లో సాగునీటిని స్థిరపరచడానికి కూడా అత్యంతముఖ్యమైనది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపురిలో సోమవారం కలిసిన తెలంగాణ నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఆరాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి నిరభ్యంతర పత్రం మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. ఇదే అంశాన్ని సిడబ్ల్యుసికి తెలుపడంతో వారు సమ్మక్క సాగర్‌కు సంతృప్తిని వ్యక్తంచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాస బాధ్యతను పూర్తిగా తెలంగాణ తీసుకుంటుందని ఉత్తమ్ కుమార్ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కీ హామి ఇచ్చారని అది ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా సమ్మతి తెలిపారని సిడబ్ల్యుసికి మన అధికారులు వివరించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి న్.ఒ.సి పొందడం కేంద్ర జల సంఘం ఆమోదం పొందడానికి అత్యవసరమైన అంతర్రాష్ట్ర అనుమతి లేకుండా ప్రాజెక్టు ముందుకు సాగలేమని ఇన్నాళ్లు నెలకొన్న ఆందోళనలు తొలిగాయి. ములుగు జిల్లాలోని తుపాకులగూడెంలో నిర్మాణం ఉన్న సమ్మక్కసాగర్ బ్యారేజ్ విశిష్టతను ఛత్తీస్‌గఢ్ సీఎంను ఉద్దేశించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. సమ్మక్కసాగర్ బ్యారేజ్ +83 మీటర్ల పూర్తి రిజర్వాయర్ లెవల్ వద్ద 6.7 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రూపకల్పన చేయబడింది .తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా బీడు భూములకు సాగునీరు,ఫ్లోరైడ్ ప్రభావిత జిల్లాలైన నల్గొండ, వరంగల్‌లో తాగు నీటి అత్యవసర అవసరాలను తీర్చనున్నది. ప్రాజెక్టు ప్రణాళికల ప్రకారం, సమ్మక్కసాగర్ ప్రాజెక్టు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్-II కింద 1.78 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరపరుస్తుంది. రామప్ప-పాకాల లింక్ కెనాల్ కింద 12,146 హెక్టార్ల కొత్త ఆయకట్టును సృష్టిస్తుంది. ఈ అదనపు సాగునీటి సామర్థ్యం వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ ఖమ్మం నల్గొండ జిల్లాలు కూడా లాభపడుతాయి. సమ్మక్క బ్యారేజ్‌తో పాటు ప్రాజెక్టులో ఆయకట్టు కు నీరు తరలించేందుకు విస్తృత మౌలిక వసతులు నిర్మాణం చేయిస్తున్నారు భారీ పరిమాణంలో నీటి ప్రవాహాన్ని నిర్వహించడానికి మూడు పంప్ హౌస్‌లు, డెలివరీ సిస్టమ్స్ కూడా ఉన్నాయి. దాదాపు 90 కిలోమీటర్ల టన్నెల్ నెట్‌వర్క్ ఉంటుంది. ఇది నాలుగు టన్నెల్‌లుగా విభజించబడింది. ఒక్కోటి 8 మీటర్ల వ్యాసంతో, 182 క్యూమెక్స్ ప్రవాహ సామర్థ్యాన్ని సరఫరా చేస్తుంది. ఈ టన్నెల్‌లు, క్రాస్ డ్రైనేజ్ పనులు, నియంత్రణలు, కాలువలపై రోడ్డు వంతెనలు ప్రాజెక్టు ఇంజనీరింగ్ రూపకల్పనకు వెన్నెముకగా నిలుస్తాయి.తెలంగాణ విస్తృతంగా లాభపడినా కూడా ప్రాజెక్టు బ్యాక్ వాటర్స్ ఛత్తీస్‌గఢ్‌లోని బబీజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం తహసీల్‌లోకి విస్తరించి ముంపు ఉండటంతో ఇన్నాళ్లు ఛత్తీస్గఢ్ నిరభ్యంతర పత్రం ఇవ్వడానికి సంకోచించడం జరిగింది. నది శిఖం ఆవల ఉన్న సుమారు 13.06 హెక్టార్ల భూమి, 54.03 హెక్టార్ల నది ప్రాంతం, 6.35 హెక్టార్ల నాళా భూమి ఈ ప్రాజెక్టు కారణంగా ముంపు ప్రభావితమవుతుండటంతో ఛత్తీస్గఢ్ కు ఉత్తమ్ రాయభేరం నడిపి విజయవంతమైనారు. ముంపునకు సంబంధించిన అన్ని ఖర్చులను, ఛత్తీస్‌గఢ్ పరిధిలోని భూసేకరణ మరియు పునరావాసాన్ని తెలంగాణ ఇప్పటికే భరించడానికి ఉత్తమ్ అంగీకరించారు .పరిహారం , పునరావాసం యొక్క అంచనా ఖర్చుల వివరాలను పొందడానికి రాష్ట్రం అనేక సందర్భాల్లో ఛత్తీస్‌గఢ్‌తో జరిపిన సంప్రదింపులు అమలు చేయడమే కాకుండా ముంపును అధ్యయనం చేయడానికి ఛత్తీస్‌గఢ్ నియమించిన ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయన ఫలితాలను అంగీకరిస్తామనీ తెలంగాణ మంత్రి హామి ఇవ్వడంతో ఛత్తీస్గఢ్ నిరభ్యంతర ధృవీకరణ ఇవ్వడానికి సమ్మతి తెలిపింది.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ సూచనలను పాటించి, ప్రస్తుత చట్టాల ప్రకారం ప్రభావిత భూస్వాములకు పరిహారం చెల్లించడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. భూసేకరణ నిబంధనల ఆధారంగా లెక్కించి ఈ ముందస్తు చెల్లింపు, ఎన్‌ఓసీ కోసం ఉద్దేశపూర్వక పత్రాన్ని జారీ చేసే సమయంలో చెల్లించబడుతుందని ఉత్తమ్ ఆరాష్ట్ర ముఖ్యమంత్రికి నమ్మబలికారు.

# నిరంతరం అప్రమత్తం

>> జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు.అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలను తరలించాలని సూచించారు. అన్ని కాజ్‌వేలను పరిశీలించాలని, రోడ్లపైకి వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా ట్రాఫిక్ ను నిలిపివేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు.దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షం కురిసే సమయంలో అవసరమైతేనే జనం రోడ్లపైకి రావాలని సూచించారు. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, హైడ్రాతో పాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రానున్న రెండు రోజుల పాటు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు చెప్పింది.గురువారం ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అతి భారీ వర్షాలు కురిశాయి.ఈ మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాగల 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాయుగుండం ఈ నెల 27న దక్షిణ ఒడిశా,ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలను దాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అల్పపీడన ప్రభావంతో గురువారం తెల్లవారుజాము నుంచే ఆకాశం మేఘావృతమై ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లి సింగరేణి డివిజన్‌లోని కాకతీయ ఖని2,3 ఉపరితల గనుల్లో ఒక షిఫ్ట్ కూడా నడిచే పరిస్థితి లేకపోవడంతో బొగ్గును తరలించే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపుతోపాటు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. అదే విధంగా 16 వేల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తికి గండి పడింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి మీద ఉన్న బ్యారేజీల్లో, ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలకళను సంతరించుకున్నాయి.

# కాళేశ్వరంపై సిబిఐ ప్రాథమిక విచారణ మొదలు

>> నివేదిక ఆధారంగా సిబిఐ అధికారులు ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నారు. సిబిఐ విచారణలో భాగంగా మాజీ సిఎం కెసిఆర్‌తో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇరిగేషన్, ఫైనాన్స్ మంత్రులుగా పని చేసిన తన్నీరు హరీశ్‌రావు, ఈటల రాజేందర్ ను సిబిఐ అధికారులు విచారించే అవకాశాలు ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది.ఈ క్రమం లో ఈ కేసుకు సంబంధించిన ప్రాథమిక వివరాలను సిబిఐ సేకరిస్తోంది. కేసుకు విచారణ అర్హత ఉందో, లేదో తేల్చేందుకు సిబిఐ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ప్రాథమిక విచారణ అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో సిబిఐ విచారణ ప్రారంభించడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠత నెలకొంది.




గురువారం తిరుమలలో కాటేజీలను ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ఎపి సిఎం చంద్రబాబు

# ప్రధాన కార్యదర్శిగా మళ్లీ డి.రాజా

>> మహాసభలు ఈ నెల 21 నుంచి 25 వరకు చండిగడ్‌లో జరిగాయి. మహాసభల్లో 11 మంది జాతీయ కార్యదర్శులు, 31 మంది ఎగ్జిక్యూటీవ్ కమిటీని ఎన్నుకున్నారు. సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా డాక్టర్ కె నారాయణను ఎన్నుకున్నారు. జాతీయ కార్యదర్శిగా పల్లా వెంకట్డ్డిని ఎన్నుకోగా.. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నారు. సిపిఐ జాతీయ సమితిలో తెలంగాణ రాష్ట్రానికి సముచిత స్థానం లభించింది. సిపిఐ జాతీయ కార్యదర్శిగా పల్లా వెంకట్ రెడ్డి తొలిసారిగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు జాతీయ కార్యదర్శివర్గంలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా తప్పుకున్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన పల్లా వెంకట్ రెడ్డి ఎఐఎస్‌ఎఫ్ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి జాతీయ కార్యదర్శిగా ఎదిగారు. ఆయన సిపిఐ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన గతంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా, 2004లో మునుగోడు నియోజకవర్గం నుంచి శాసనసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కూడా వ్యవహరించారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ జాతీయ కార్యవర్గంలోకి ఎన్నికయ్యారు. అలాగే కంట్రోల్ కమిషన్ సభ్యులుగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఎం.డి.యూసుఫ్ ఎన్నికయ్యారు. కంట్రోల్ కమిషన్ సభ్యులుగా ఆయన జాతీయ సమితికి శాశ్వతాహ్వానితులుగా ఉంటారు. రాష్ట్రం నుంచి సిపిఐ జాతీయ సమితికి పది మంది సభ్యులు ఎన్నికయ్యారు. కూనంనేని సాంబశివరావు,పశ్య పద్మ,పల్లా వెంకట్ రెడ్డి, తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహా, ఎస్.కె.సాబీర్ పాషా ఉన్నారు. క్యాండిడేట్ సభ్యుడుగా పాల్మాకుల జంగయ్య ఎన్నికయ్యారు. వారిలో ఎస్.కె.సాబీర్ పాషా, పాల్మాకుల జంగయ్య తొలిసారిగా ఎన్నికయ్యారు.

**సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా డాక్టర్ కె.నారాయణ..**

సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా డాక్టర్ కె.నారాయణ ఎన్నికయ్యారు. చండీగఢ్‌లో జరిగిన సిపిఐ జాతీయ 25వ మహాసభ చివరి రోజున ప్రతినిధులు సెంట్రల్ కంట్రోట్ కమిటీ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు. వారిలో డాక్టర్ కె.నారాయణ, హర్ సింగ్ ఆర్శీ (పంజాబ్), ఎం.డి.యూసుఫ్(తెలంగాణ), కల్యాణ్ బెనర్జీ (పశ్చిమ బెంగాల్), పి.దుర్గా భవాని (ఆంధ్రప్రదేశ్), ఆర్.ముత్తురాసన్ (తమిళనాడు), రామ్ బహేతి(మహారాష్ట్ర), ఇంతియాజ్ అహ్మద్ (ఉత్తర్ ప్రదేశ్), సత్యన్ మొకెరి(కేరళ), సి.హెచ్.వెంకటాచలం, రామ్ రతన్ సింగ్ (బిహార్)లు ఉన్నారు. అనంతరం కమిటీ సమావేశమై సెంట్రల్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కె.నారాయణను, కార్యదర్శిగా రామ్ బహేతిని ఎన్నుకుంది.

# సర్కార్ చేతికి 'మెట్రో'

>> ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతిపాదించింది. ఈ చెల్లింపు పూర్తి చేసిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వస్తుంది. 2014లో దేశంలో మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం తొమ్మిదవ స్థానానికి పడిపోయింది. హైదరాబాద్ గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫేజ్ 2ఎ, 2బి విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త మెట్రో లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన మెట్రో విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న ఫేజ్ 1 మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫేజ్ 2 విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవసరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం (డెఫినేటీవ్ అగ్రిమెంట్) కావాలని కేంద్రం స్పష్టం చేసింది. ఫేజ్ 2లో కూడా ఎల్ అండ్ టీ భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్ఠంభనను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మెట్రో ఫేజ్ 2లోనూ ఎల్ అండ్ టీ భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు ఖచ్చితమైన ఒప్పందం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఒప్పందం కుదిరితేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ వ్యయాల భాగస్వామ్యంలో స్పష్టత ఉంటుందని సీఎం అన్నారు. రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందువల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టీ సీఎండీ అన్నారు. 2002 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ. 3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2100 కోట్లు బకాయి ఉందని గుర్తు చేశారు. ఈ మేరకు ఎల్ అండ్ టికి రూ.2100 కోట్లు నగదు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 1 మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంతమవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మెట్రో 69 కి.మీ. మొదటి దశని ప్రభుత్వ,ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.22వేల కోట్లతో నిర్మించిన విషయం తెలిసిందే. ఈ మొదటి దశ నిత్యం 4లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోంది.

# బతుకమ్మ వేడుకలపై మంత్రుల సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబర్ 25,ప్రభాతవార్త:** ఈ నెల 29న గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించ తల పెట్టిన బతుకమ్మ వేడుకలను విజయ వంతం చేయాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క అధికారులను ఆదేశించారు. డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రులు మాట్లాడుతూ... ఈ నెల 27న ట్యాంక్ బండ్ పై బతుకమ్మ కార్నివాల్, 28న బైక్, సైకిల్ ర్యాలీలు, 29న సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో బతుకమ్మ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, 30న ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ కార్యక్రమాలు ఉంటాయని, దీనికి అనుగుణంగా ప్రతిష్ఠాత్మకంగా సన్నాహాలు జరగాలన్నారు. ట్యాంక్ బండ్ తో పాటు పీవీ మార్గ్, సచివాలయం, సరూర్ నగర్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించాలి. బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. మహిళలకు సౌకర్యాలు కల్పించాలని దిశానిర్ధేశం చేశారు. పండగ ప్రాశస్త్యానికి అద్దం పట్టేలా హైదరాబాద్ లో చారిత్రక ప్రదేశాలతో పాటు ప్రధాన జంక్షన్లను అందమైన ఆకృతులతో, విద్యుత్ దీపాలతో అలంకరించాలి, వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యాటక, సాంస్కృతిక, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పోలీస్, ట్రాన్స్‌కో, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.సరూర్ నగరం స్టేడియంలో ఈ నెల 29న 10 వేల మంది బతుకమ్మ వేడుకలు, 63 అడుగుల ఎత్తైన బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నిస్ బుక్ రికార్డుల్లో చేర్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను తరలించే బాధ్యతను సెర్ప్ అధికారులు తీసుకోవాలని, దీనికి తోడు మిగిలిన వారిని తీసుకువచ్చేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జానపద, గిరిజన కళాకారుల మధ్య వేలాదిమంది మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి జీవితకాలం జైలుశిక్ష

**ఆసిఫాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** బాలికను ప్రేమపేరుతో వేధించి గర్భవతిని చేసిన వివాహితుడికి, పోక్సో కేసులో ఎస్సీ, ఎస్టీ కేసు కింద జీవితకాలం జైలుశిక్ష, రూ. 70 వేల జరిమానా విధిస్తూ బుధవారం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేశ్ తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని ఓ మండలానికి చెందిన బాధిత బాలిక(17) 8వ తరగతి వరకు చదువుకొని, తర్వాత చదువు మానేసి ఇంటి దగ్గర వ్యవసాయ పనులు చేసుకుం టుంది. ఈ తరుణంలో ఇద్దరి పిల్లలకు తండ్రి అయిన ఓ వివాహితుడు తిరుపతి (26) అనే వ్యక్తి ఆ బాలికను ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి శారీరకంగా వాడుకుని గర్భవతిని చేసాడు. 2020 మే 20న బాలిక మెడలో తాళి కట్టాడు. బాలిక తల్లిదండ్రులు తన మెడలో తాళి గురించి ప్రశ్నించగా, ప్రేమపేరుతో వేధింపులు, గర్భవతి అయిన విషయాలు తెలిపింది. ఇట్టి వివ రాలతో బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌటాల పోలీస్ స్టేషన్‌లో 23 మే 2020న ఫిర్యాదు చేయగా అప్పటి కౌటాల ఎస్.ఐ ఎ.ఆంజనేయులు కేసు నమోదు చేసి, బిఎల్ఎన్ స్వామి, మూడవ ఐవో వైవిఎస్ సుధీంద్ర అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆసిఫాబాద్ ఇంచార్జ్ నాలుగవ ఐవో బి.బాలస్వామి ఐపీఎస్, ఏ.ఎస్.పి, ఐదో ఐఓ ఏ కరుణాకర్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కాగజ్ నగం దర్యాప్తు చేసి కోర్టులో హాజరు పరచగా పి.పీ జగన్మోహన్ రావు, సీ.డీ.ఓ అండ్ లైజనింగ్ ఆఫీసర్ పి.రాం సింగ్ ఏ.ఎస్.ఐ సాక్షులను హాజరుపరచగా జడ్జి సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో నిందితుడు తిరుపతికి జీవిత కాలం జైలుశిక్ష, రూ. 70 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

## మద్యం దుకాణలకు నేటి నుంచి దరఖాస్తులు

**టెండర్ ఫీజు రూ.3 లక్షలకు పెంపు**
**నోటిఫికేషన్ విడుదల చేసిన ఎక్సైజ్ శాఖ**

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలకు నోటిఫి కేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్ ప్రకారం శుక్రవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొ న్నారు. అక్టోబరు 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సారి టెండర్ ఫీజును భారీగా పెంచారు. గతంలో రూ.2 లక్షల వరకు ఉన్న ఫీజు ఈసారి రూ.లక్ష పెంచుతూ రూ.3 లక్షలుగా ఫిక్స్ చేశారు. అయితే లైసెన్స్ ఫీజును ఆరు విడతలుగా చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. మొత్తం 2670 మద్యం దుకా ణాలు ఉండగా.. వీటిలో గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వ్ చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలం గాణ ప్రభుత్వం తాజాగా మద్యం దుకాణాల కేటాయింపుకు సంబంధించి కీలక నిర్ణ యం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖా స్తుల స్వీకరణ శుక్రవారం (సెప్టెంబరు 26) నుండి అక్టోబర్ 18వ తేదీ వరకు కొనసాగుతుందని నోటిఫి కేషన్‌లో పేర్కొ న్నారు. అనంతరం అక్టోబరు 23న డ్రా విధానంలో లైసెన్స్‌లు కేటాయించ నున్నారు. ఈ అనుమతులు 2025 డిసెంబర్ 1 నుండి 2027 నవంబర్ 30 వరకు అమలులో ఉంటాయి.ప్రభుత్వం ఈసారి టెండర్ ఫీజులో కూడా మార్పులు చేసింది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ఫీజును రూ.3 లక్షలకు పెంచి నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. దాంతో కొత్త దరఖాస్తుల ప్రక్రియ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ లైసెన్స్ పొందడంలో కొన్ని అర్హతా నిబంధనలను కూడా ప్రభుత్వం స్పష్టంగా తెలిపింది. 1968 ఎక్సైజ్ చట్టం ప్రకారం శిక్షించబడిన వ్యక్తులు అర్హులు కారని నిబంధనలలో పేర్కొంది.

అలాగే సామాజిక న్యాయం దృష్ట్యా రిజర్వేషన్లు కొనసాగుతాయి. రాష్ట్రంలోని 2,620 మద్యం దుకాణాల్లో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు అమలులో ఉంటాయి. ఈ కేటాయింపు ద్వారా వెనుకబడిన వర్గాలకు వ్యాపారావకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మద్యం దుకాణాల లైసెన్సులపై స్పష్టమైన శ్లాబ్ విధానం అమలు చేసింది. మొత్తం ఆరు వర్గాలుగా ఫీజులను విభజించి.. 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంది.

చిన్న గ్రామాల నుండి పెద్ద నగరాల వరకు జనాభా పరంగా వేర్వేరు రేట్లు అమల్లోకి వస్తాయి. జనాభా ఆధారిత లైసెన్స్ ఫీజులు.. 5,000 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో వార్షిక ఎక్సైజ్ పన్ను రూ.50 లక్షలు.. 5,000 – 50,000 మధ్య జనాభా ఉన్న ప్రదేశాల్లో రూ. 55 లక్షలు.. 50,000 – 1,00,000 జనాభా కలిగిన ప్రాంతాలకు రూ.60 లక్షలు.. 1 లక్ష – 5 లక్షల జనాభా గల పట్టణాల్లో రూ.65 లక్షలు.. 5 లక్షల – 20 లక్షల మధ్య జనాభా ఉన్న నగరాల్లో రూ.85 లక్షలు.. 20 లక్షలకు పైగా జనాభా గల మెట్రో నగరాల్లో రూ.1.10 కోట్లుగా ఉన్నాయి. ఈ విధంగా వర్గీకరణ చేయడం ద్వారా చిన్న ప్రాంతాల్లో వ్యాపారులకు సౌకర్యం కలగగా, పెద్ద పట్టణాల్లో ప్రభుత్వ ఆదాయం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

లాటరీలో ఎంపికైన వారు వార్షిక లైసెన్స్ ఫీజును ఆరు విడతలుగా చెల్లించాలి. అలాగే.. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను మొత్తం ఫీజు 25 శాతం విలువైన బ్యాంక్ గ్యారంటీని సమర్పించడం తప్పనిసరి. దుకాణాల పని వేళలు కూడా వేర్వేరుగా నిర్ణయించారు. జీహెచ్ఎంసీ.. నగర పంచాయతీ పరిధిలో ఉదయం 10 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయానికి అనుమతి ఉంటుంది.

## టిక్కెట్ ధరల విషయంలో ఓజికి హైకోర్టులో స్వల్పఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** రాష్ట్రంలో టిక్కెట్ ధరల విషయంలో ఓజీ చిత్ర యూనిట్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఓజీ టిక్కెట్ ధరలపై హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ రేపటి వరకు స్టే విధించింది.

ఓజీ టిక్కెట్ రేట్ల పెంపు జీవోను సస్పెండ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ నిన్న తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. ఓజీ సినిమా విడుదల నేపథ్యంలో సినీ నిర్మాతల విజ్ఞప్తి మేరకు టిక్కెట్ ధరలను పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ టిక్కెట్ ధరల పెంపు మెమోపై హైకోర్టు బుధవారం స్టే విధించింది. బెనిఫిట్ షో టిక్కెట్ ధరలను పెంచవద్దని హైకోర్టు పేర్కొంది.

## డప్పు విన్యాసాలతో బతుకమ్మ సంబురాలు



రవీంద్రభారతిలో ఐదోరోజు బతుకమ్మ సంబురాల్లోని దృశ్యాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీల సహకారంతో భక్తిశ్రద్ధలు, ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో నేత్ర పర్వంగా జరుగుతున్న బతుకమ్మ సంబరాల ఐదో రోజు గురువారం రాత్రి తెలంగాణ సాంస్కృతిక వైభవం ఉట్టిపడింది. ఒకపక్క వరుణదేవుడు ఆశీస్సులు వెంట రాగా పెద్దసంఖ్యలో మహిళలు, చిన్నారులు సంప్రదాయ వేషధారణలతో పూల అందాలు వెల్లివిరుస్తుండగా జానపద, సంప్రదాయ నృత్యాలు, ఆధ్యాత్మిక గీతాలు బృందాలు పూల మరిమళాలు కళాసోయగాలు రంగురంగుల దీపాలంకరణలు మిరుమిట్లుగొల్పుతుండగా ఆలపిస్తూ ఆటపాటలో రవీంద్రభారతి ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. మహిళల ఐక్యతకు ప్రతీకగా ప్రకృతిని దైవంగా ఆరాధించే సగుణ సంప్రదాయ సాంస్కృతిక విలువలను ఈ సంబరాలు చాటుతూ అంబరాన్నంటాయి.

ఈ సందర్భంగా భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై సంబురాల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులను అభినందిస్తూ బతుకమ్మ పండుగ స్త్రీశక్తిని ప్రతిబింబిస్తుందని, తెలంగాణ సంప్రదాయ సాంస్కృతిక వారసత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ అధికారులు పి.నర్సింహులు, కె.ప్రసాద్ బాబు, జె.శ్రీనివాస్, హేమలత, స్రవంతి, ఆకుల రవి, సరోజిని, గోవింద్, బసవరాజు, శ్రీనివాస్, వేణు లతోపాటు సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, తిరుప్పాల్, సంగీత నాటక అకాడమీ సిబ్బంది పూర్తి సహకారం అందించారు.

## కొత్త సినిమాలకు రేట్లు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వం

### సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 25,ప్రభాతవార్త:** కొత్త సినిమాలు ఎలాంటి వాటికైనా టికెట్ల ధరలను పెంచుకునేలా అనుమతులు ఇవ్వబోమని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచేది లేదని తాను గతంలోనే అసెంబ్లీలో చెప్పానని, పక్క రాష్ట్రం జిఒ ఇవ్వడంతో ఇక్కడ కూడా కొన్ని సినిమాలకు వెసులుబాటు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. ఇకపై సినిమాలకైనా టికెట్ ధరలను, సినిమా టికెట్ ధరల పెంపు కారణంగా సామాన్యుడు చాలా నష్టపోతున్నాడన్నారు. ఇకపై సినిమా టికెట్ రేట్ల పెంపుపై జిఒలు ఉండవని తెలిపారు. సినీఇండస్ట్రీని హైదరాబాద్ హబ్‌గా మారుస్తామని, ఇందు కోసం ప్రభుత్వం తరఫున ఎలాంటి రాయితీలకైనా సిద్ధంగా ఉన్నామని, అభిమానులపై మాత్రం భారం వేయకూడదని చెప్పారు. ఓజీ సినిమా టికెట్ ధరలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా దానిని సవాల్ చేస్తూ మహేశ్‌యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కొత్త సినిమాల టికెట్ల ధరలను పెంచడాన్ని సస్పెండ్ చేసింది. తాజాగా హైకోర్టు జారీ చేసిన ఈ ఉత్తర్వులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. సినిమా టికెట్ ధరలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని తెలిపారు.

## హాస్టల్ బిల్డింగ్ నుంచి విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆ ఘటన బుధవారం అర్ధరాత్రి బీహార్ రాష్ట్రంలో పట్నాలో చాంది ఇంజనీరింగ్ కళశాల్లో జరిగింది. ప్రిన్సిపాల్ వేధింపులకు పాల్పడడంతో దారుణానికి ఒడిగట్టిందని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీంతో కాలేజీ క్యాంపస్‌లో ఆందోళనకు దిగి పోలీస్ వాహనాలకు నిప్పుపెట్టారు. ముంగేర్ జిల్లాలోని బరియార్‌పూర్ బ్లాక్‌కు చెందిన 20 ఏళ్ల సోనమ్ కుమారి సివిల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వృద్ధ తల్లిదండ్రులను పట్టించుకోకపోతే ఆస్తి అనుభవించే హక్కు లేదు

### సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** వృద్ధాప్యంలో ఉన్న తల్లి దండ్రులను పట్టించుకోని పిల్లలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని సుప్రీం కోర్టు మరోసారి స్పష్టం చేసింది. అలా ప్రవర్తించే సంతానాన్ని బయటకు వెళ్లగొట్టొచ్చని తేల్చి చెప్పింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లిదండ్రుల వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం అండగా నిలుస్తుం దని వ్యాఖ్యానించింది. కుమారుడు తమ సంరక్షణ బాధ్యతలు చూసుకోవడం లేదంటూ మహారాష్ట్రకు చెందిన 80 యేళ్ల వృద్ధ దంపతులు సుప్రీంకోర్టును ఆశ్రయిం చగా, ఈ తీర్పు వెలువరించింది. తల్లి దండ్రుల సంరక్షణ, పోషణ చట్టం ప్రకారం.. ఏర్పాటైన ట్రైబ్యునళ్లు, కన్న వారిని పట్టించుకోని బిడ్డల విషయంలో సత్వరవిచారణ జరుపుతాయని తెలిపింది. ఇలాంటి వివా దాల్లో తల్లి దండ్రులు తమ పిల్లలకు బదలీ చేసిన ఆస్తిపై యాజమాన్యహక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రైబ్యునళ్లకు ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం తగదు

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం చేయొద్దని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ వెంకట్ ప్రతిపక్షాలను ముఖ్యంగా బిఆర్ఎస్‌ను వేడుకొన్నారు. సిఎల్పీ మీడియా సెంటర్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ బిఆర్ఎస్ సోషల్ మీడియాలో విష ప్రచారం చేయిస్తున్నారు,ఈ విష ప్రచారంలో నిరుద్యోగులు భాగం కావొద్దు,నమ్మొద్దు అని హితవు చెప్పారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ కాలెండర్ ప్రకారం వేయబోతున్న నోటిఫికేసన్ల కు నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రూప్ 1 పరీక్షల్లో పదేళ్లలో ఎన్నో అవకతవకలు జరిగాయని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అన్ని తప్పులను సరిదిద్ది గ్రూప్ 1 పరీక్ష నిర్వహించామని తెలిపారు. గ్రూప్ 1 పరీక్ష నిర్వహించకుండా మొదటి నుంచి బిఆర్ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతో విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్‌తో పాటు కనీస అవగహన లేని పాడి కౌశిక్ రెడ్డి గ్రూప్ 1 పైన ఇష్టానుసారంగా మాట్లాడారని ఆవేదన చెందారు. గతంలో గ్రూప్ 1 పేపర్ల లీకేజీ విషయంలో కేటీఆర్ పీఎ పైన కూడా ఆరోపణలు వచ్చాయని ఆయన వివరించారు.దీనిపైన కెటిఆర్ ఏనాడు స్పందించలేదని అంగట్లో సరుకులు అమ్మినట్లుగా గ్రూప్స్ పేపర్స్ లీక్ అయ్యాయని గతంను గుర్తుచేసుకొన్నారు. అప్పుడు అరెస్టులు కూడా జరిగాయని చెప్పారు. గ్రూప్ పరీక్షల నిర్వహణలో వైఫల్యంపైన ఏనాడు కెసిఆర్ ప్రభుత్వం కనీసం క్షమాపణ చెప్పలేదని అన్నారు. మా ముఖ్యమంత్రి టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేశారని తెలిపారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో మా సిఎం ప్రయత్నం చేశారని అన్నారు.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో నటుడు జగపతిబాబుపై ఇడి విచారణ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** సాహితీ ఇన్‌ఫ్రా కేసులో నటుడు జగపతిబాబును గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికా రులు విచారించారు. నాలుగు గంటలపాటు జగపతి బాబును ప్రశ్నించినట్లు తెలుస్తుంది.



సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ అక్రమాలకు పాల్ప డిందన్న ఆరో పణల నేపథ్యంలో సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ ప్రకటనల్లో జగపతి బాబు నటించడంపై ఇడి అధికారులు ఆయనను విచారించారు.అదేవిధంగా ప్రకటనల్లో నటించినందుకు ఆయనకు అందిన పారితోషికం, చెల్లింపుల మార్గాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరా తీశారు. సాహితీ లక్ష్మీ నారాయణ ఖాతా నుంచి నగదు బదలీ అయినట్లు గుర్తించారు. అయితే ఆ లావాదేవీల గురించి ఆరా తీసిన అధికారులు ఆ సంస్థ ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో కస్టమర్లను ఆకర్షించి సుమారు 700 మంది నుంచి రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.అదేవిధంగా నిధులను షెల్ కంపెనీలకు మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారని ఈడీ దర్యాప్తులో తేలింది. ప్రకటనల్లో నటించినందుకే ఈ కేసులో ఆయనను సాక్షి గా విచారించినట్లు తెలిసింది.

## అంగన్‌వాడీ కేంద్రాలకు దసరా సెలవులు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాలకు దసరా సెలవులు ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు 8 రోజుల పాటు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్ల విజ్ఞప్తి మేరకు దసరా సెలవులు మంజూరు చేయాలని అధికారులకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందజేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠ శాలల మాదిరిగానే దసరా, బతుకమ్మ పండగలు జరుపుకునే విధంగా దసరా సెలవులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కను ప్రత్యేకంగా ఐఎన్టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్ వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి అన్నపూర్ణ, ఇతర ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. అంగన్‌వాడీ టీచర్లు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్టీఎం సర్వీసుల ఛార్జింగ్ కోసం కొత్త పాలసీ

### దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** ఎల్టీఎమ్ సర్వీసుల ఛార్జింగ్ కోసం ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా నిలిపివేయకుండా ఉండేందుకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ఫరూఖీ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నూతన సర్వీస్ కనెక్షన్ల కోసం పెండింగ్ లో వున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. దీని కోసం ఈ నెల 26న ఇస్తున్న లైన్ క్లియరెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 593 ఎల్టీఎమ్ (అపార్ట్మెంట్/ లే అవుట్) దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. గతంలో నూతన లిగిలీ సర్వీసుల ఛార్జింగ్ కోసం ఫీడర్ ను నిలిపివేసేవారని, దాని వలన సరఫరా లో ఇబ్బందులు ఏర్పడేవన్నారు. దాన్ని నియంత్రించేందుకే ఇప్పుడు నూతన విధానం అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

## కెటిఆర్ అరెస్ట్ తప్పదు.. కవితది ఆస్తుల పంచాయితీ

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఫార్ములా ఇ–కారు రేసు కేసులో కెటిఆర్ అరెస్ట్ తప్పదు. క్లియర్ ఆధారాలు ఉన్నాయనీ టిపిసిసి ప్రసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఢిల్లీలో మహేష్ కుమార్ గౌడ్ మీడియా చిట్‌చాట్‌లో మాట్లా డుతూ ఫోన్ ట్యాపింగ్ చేసి కెసిఆర్, కెటిఆర్ ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విషయం ఎఐసిసి పరిధిలో ఉందని సరైన సమయంలో సరైన నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీదే విజయమని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సర్వేలో ఎవరు ముందుంటే వారికే సీటు అని స్పష్టంచేశారు. కల్వ కుంట్ల కవితది ఆస్తుల పంచాయితీ అనీ, ఆమెకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉందని ప్రశ్నిం చారు. తెలం గాణలో యేడాది కాలంలో ఎంతో పనిచేశాం. గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం బాగా జరుగుతోంది. సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నాం. జూబ్లీ హిల్స్‌లో సామాజికవర్గం తదితర అంశాలు పరిగణనలోకి తీసుకోకుండా నియోజక వర్గంలో సర్వేలు జరుగుతున్నాయి. సర్వేల్లో ఎవరు ముందుంటే వారికే టికెట్ దక్కుతుంది. అక్టోబరు 4న 22 మంది పరిశీలకులు తెలంగాణలో పర్యటిస్తారు. బిసి రిజర్వే షన్లపై బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఒక్క రోజులో బిసి బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపొచ్చన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపైన సిబిఐ విచారణ జరిపితే బాగుంటుంది.కవితది ఆస్తుల పంచాయతీ, కాంగ్రెస్తో కవితకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. కవితకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉంది? అని అడిగారు. దోపిడీ చేసిన వారిని ప్రజలు ఎందుకు ఆదరిస్తారు. ఫోన్ ట్యాపింగ్ పెద్ద కేసు, అందరి వాయిస్లు రికార్డు చేశారు. నాది, రేవంత్ రెడ్డిది రెండున్నర ఏళ్ల నుంచి గత ప్రభుత్వం రికార్డు చేసింది. నేను వాడిన జియో సిమ్‌కార్డు నంబర్ జియో సంస్థకు గత ప్రభుత్వం ఇచ్చింది. జియో సంస్థకు రాసిన లేఖ కూడా దొరికింది. ఫోన్ ట్యాపింగ్ చేసి గత ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలిచిందన్నారు.

## ఇ-కార్ రేసు కేసులో ఇద్దరు ఐఎఎస్‌లపై ఎసిబి విచారణ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలమైన ఫార్ములా ఈ కార్ రేస్ కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు అరవింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలపై ప్రాసిక్యూషన్ అనుమతికి విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేసింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ అనుమతించాలని ఇప్పటికే ఏసిబి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈనివేదికపై విచారణ జరిపిన విజిలెన్స్ కమిషన్ ఇద్దరు అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతిచ్చింది. ఈ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ విచారణకు గవర్నర్ అనుమతి కోరింది. ఈ విషయంపై గవర్నర్ ఇంకా ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు. ఈ రేసు నిర్వహణలో విదేశీ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించారని దీంతో ప్రభుత్వానికి రూ. 54.88 కోట్ల నష్టం వాటిల్లిందంటూ ఏసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇప్పటికే కెటిఆర్, పలువురు ఉన్నతాధికారులపై నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఉన్నాయి. కాగా, గవర్నర్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే చార్జిషీట్ దాఖలు చేసేందుకు ఎసిబి అధికారులు సిద్ధమవుతు న్నారు. క్విడ్ ప్రోకో విధానంలో బిఆర్ఎస్ రూ. 44కోట్ల ఎలక్టోరల్ బాండ్స్, హెచ్ ఎండిఎ నిధుల దుర్వినియోగం, ఇ కార్ రేసింగ్ నిర్వహణ ఖర్చు రూ. 600 కోట్లకు సంబంధించి పూర్తిఆధారాలతో ఎసిబి ఛార్జిషీట్ సిద్దం చేస్తున్నట్లు తెలుస్తుంది.


**AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)**
(CIN Number: U93000AP2015SGC105535), Email: ccdmc.amaravati@gmail.com, Website: https://adcl.in
54-15-1, Venkateswara Nagar, Ring Road, Vijayawada, NTR Dist, Andhra Pradesh-520008.

**E-PROCUREMENT TENDER NOTICE**
No.09/HOD/UG&F/ADCL/2025-26, Dt. 22.09.2025

| S.No | Name of the work | ECV |
|---|---|---|
| 1. | Greenery on the Central median of NH-16 - Kanaka Durgamma Varadhi – Peddakakani (20 kms) and one year maintenance. | Rs. 648.35 Lakh |

The above bid from Sl.No. 1 can be downloaded on "ap e-procurement" portal from 26.09.2025 to 10.10.2025, 3.00 PM and due date for submission of Bid on 10.10.2025 up to 3.30 PM, bid opening is on 10.10.2025 @ 4.00 PM. Please refer to www.apeprocurement.gov.in for details. For any further clarifications contact Joint Director (i/c), ADCL Limited, Vijayawada, Mobile Number: 7095599512.
Sd/- Chairperson & Managing Director
ADCL, Vijayawada



**నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా**
**న్యూఢిల్లీ-110001**
(భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ యొక్క స్వతంత్ర సంస్థ)
MINISTRY OF CULTURE

**ఎంట్రీలకు పిలుపు**

**25వ భారత్ రంగ్ మహోత్సవ్, 2026**
**(భారత దేశం యొక్క అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్)**

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, 25వ భారత్ రంగ్ మహోత్సవ్ 2026-భారత దేశం యొక్క అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్ (ప్రపంచం యొక్క అతిపెద్ద థియేటర్ ఫెస్టివల్) న్యూఢిల్లీలో మరియు దేశంలోని ఇతర నగరాలలో మరియు విదేశాలలో 2026 జనవరి మరియు ఫిబ్రవరిలో నిర్వహిస్తోంది. ఈ ఉత్సవంలో పాల్గొనటానికి ప్రతిపాదనలు ఆహ్వానిస్తోంది.

ఆసక్తి గల థియేటర్ గ్రూప్‌లు, డ్రామా సంస్థలు, థియేటర్ కంపెనీలు మరియు థియేటర్ డైరెక్టర్‌లు ఇండియా మరియు విదేశాల రెండింటి నుంచీ ఆన్‌లైన్ మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

**సవివర సమాచారానికి మరియు దరఖాస్తు ఫారానికి దయచేసి NSD వెబ్‌సైట్** www.nsd.gov.in వీక్షించండి. (26 సెప్టెంబర్, 2025 నుండి లింక్ యాక్టివేటెడ్ చేయబడుతుంది).

**దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 25వ అక్టోబర్, 2025**

- **దరఖాస్తు ఫీజు:-**
  INR 250/- ఇండియా మరియు SAARC దేశాలకు
  INR 500/- ఇతరుల కొరకు.

**విచారణ:-** ఫోన్: 011-23073647, 011-23031116
**వెబ్‌సైట్:** www.nsd.gov.in

CBC 09130/12/0010/2526



**ZUARI FARMHUB LTD.**
Regd. Office: Jai Kisaan Bhawan, Zuarinagar, Goa - 403726, INDIA

**100% నీటిలో కరిగే ఎరువుల మిశ్రమాల నిలువ మరియు అమ్మకం గురించి సూచన**

సాధారణ ప్రజానికానికి మేము సంతోషిస్తూ తెలుపుతున్నదేమనగా, వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా 24 అక్టోబర్ 2015 నాడు జారీచేసిన ఆర్డర్ నం.2900 (E) ప్రకారం మరియు దాని సవరణను రెఫర్ చేస్తూ జువారి ఫామ్ హబ్ (ZFL) వారు 100 శాతం నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాల నిలువ ఇంకా అమ్మకం తెలంగాణలో ప్రారంభిస్తున్నారు.

FarmHUB

| | Grades | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | Specification / Composition | NPKSMg with Micronutrients 20:10:10:02:02 | NPK with Micronutrients 10:0:40 | NPKSMg with Micronutrients 16:08:16:02:02 | NPK 18:46:0 | NPK 05:55:17 | NPKS with Micronutrients 18:12:15:02 | NPKS with Micronutrients 12:06:28:05 | PK 00:40:40 | PK 00:48:47 | PK 00:42:47 with Micronutrients | NPK 0:09:46 | NPK with Micronutrients 10:09:16 | NPK 10:15:35 | NPK 7.5:32:32 |
| 1 | Moisture per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen per cent by weight, minimum | 20.0 | 10.0 | 16.0 | 18.0 | 5.0 | 18.0 | 12.0 | - | - | - | - | 10.0 | 10.0 | 7.5 |
| 3 | Water soluble Phosphorous (as P2O5) per cent by weight, minimum | 10.0 | 0.0 | 8.0 | 46.0 | 55.0 | 12.0 | 6.0 | 40.0 | 48.0 | 42.0 | 9.0 | 9.0 | 15.0 | 32.0 |
| 4 | Water soluble Potassium (as K2O) per cent by weight, minimum | 10.0 | 40.0 | 16.0 | - | 17.0 | 15.0 | 28.0 | 40.0 | 47.0 | 47.0 | 46.0 | 16.0 | 35.0 | 32.0 |
| 5 | Sodium (as Nacl) per cent by weight on dry basis, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 6 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 7 | Sulphur (as S) per cent by weight, minimum | 2.0 | - | 2.0 | - | - | 2.0 | 5.0 | - | - | - | - | 2.0 | - | - |
| 8 | Magnesium (as MgO) per cent by weight, minimum | 2.0 | - | 2.0 | - | - | - | - | - | - | - | - | 2.0 | - | - |
| 9 | Calcium (as CaO) per cent by weight, minimum | - | - | - | - | - | - | - | - | - | - | - | 2.0 | - | - |
| 10 | Zinc (as Zn) per cent by weight, minimum | 0.0 | - | - | - | - | 1.0 | - | - | - | - | - | - | - | - |
| 11 | Iron (as Fe) per cent by weight, minimum | - | - | - | - | - | - | - | - | - | 2.8 | - | - | - | - |
| 12 | Boron (as B) per cent by weight, minimum | 0.1 | 0.5 | 0.5 | - | - | 0.2 | 0.1 | - | - | - | - | 0.003 | - | - |
| 13 | Molybdenum (as Mo) per cent by weight, minimum | - | - | - | - | - | - | - | - | - | - | - | 0.001 | - | - |
| 14 | Total chloride (as Cl) per cent by weight on dry basis, max | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 15 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 16 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.025 | 0.025 | 0.025 | 0.025 | 0.025 | 0.025 | 0.025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 17 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

వార్త

ఎవరు మహాబలశాలి అయినప్పటికీ, కోమల హృదయం కలిగి ఉంటాడో అతడే నిజమయిన మానవుడు, ధీరుడు.

- స్వామి వివేకానంద

# మిస్టరీగానే మిస్సింగ్ కేసులు!

దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న మిస్సింగ్ కేసుల పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ కేసుల దర్యాప్తులో పోలీసులు అంతగా శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై పటిష్టమైన చట్టం లేకపోవడం కూడా మరో కారణంగా చెబుతున్నారు. అదృశ్యమైనవారిలో అధిక సంఖ్యలో పిల్లలు, మహిళలు ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. గత మూడేళ్లలో పది లక్షలకుపైగా మహిళలు అదృశ్యమయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఇటీవల రాజ్యసభలో వెల్లడించారు. జాతీయ నేరరికార్డుల బ్యూరో గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా మూడేళ్ల కాలంలో రెండు లక్షల అరవైఒక్కవేల మంది బాలికలు, మహిళలు అదృశ్యం కాగా తెలంగాణలో ముప్పైనాలుగు వేల నాలుగు వందల మహిళలు, ఎనిమిదివేల మంది బాలికలు అదృశ్యమైనట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇరవైరెండువేల రెండువందల మందికి పైగా మహిళలు, ఏడువేలతొమ్మిది వందల మంది బాలికలు అదృశ్యమయ్యారు. యేడాది యేడాదికి ఈ అదృశ్యాల సంఖ్య పెరిగిపోతున్నది. అయితే అదృశ్యమవుతున్నవారిలో అధికశాతం మంది తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారని, ఈ విషయం సంబంధిత వ్యక్తులు పోలీసులకు తెలియచేయకపోవడంతో రికార్డుల పరంగా అదృశ్యాలు అలాగే మిగిలిపోతున్నాయని పోలీసు ఉన్నత వర్గాలు భావిస్తున్నాయి. అదృశ్యమైనవారిలో కొందరు చిన్నారులు అక్రమ రవాణా ముఠాకు చిక్కుతుండగా మరికొందరు వ్యభిచార కూపంలో మగ్గిపోతున్నారు. మధ్యప్రదేశ్‌లో అన్నిరాష్ట్రాల కంటే ఎక్కువగా మహిళలు అదృశ్యమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2021నుంచి 2024వరకు ముప్పైఒక్క వేల మంది బాలికలు అదృశ్యమైనట్లు అధికారవర్గాలే వెల్లడించాయి. సగటున ఇరవైఎనిమిది మంది మహిళలు, ముగ్గురు బాలికలు రోజుకు అదృశ్యమవుతున్నట్లు ఆ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అదృశ్యమైన కేసులను ఛేదించడంలో పోలీసులు అంత శ్రద్ధచూపడం లేదనే వాదనలకు జరుగుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న దేశంలోని అనేక న్యాయస్థానాలు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. కోర్టులు జోక్యంచేసుకున్నప్పుడు పోలీసులు ఆగమేఘాలపై ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయించి తప్పిపోయిన వారిని న్యాయస్థానాల్లో హాజరుపరిచిన సంఘటనలు కూడా ఉన్నాయి. గత యేడాది కాకినాడ జిల్లాలో ఒక బాలిక అదృశ్యమైంది. ఆమె కుటుంబ సభ్యులు ఎందరి చుట్టూ తిరిగినా, ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ విషయం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి రావడంతో ఆయన సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో హుటాహుటిన ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దర్యాప్తు చేయడంతో ఆ అమాయక బాలిక జమ్మూలోఉన్నట్లు పోలీసులు గుర్తించి తీసుకువచ్చారు. దీంతో న్యాయస్థానాలైనా, లేక అధికారంలో ఉన్న పెద్దలైనా పట్టించుకుంటే తప్ప ఫలితం ఉండదనే విశ్వాసం సామాన్యుల్లో రానురాను పెరిగిపోతున్నది. అయితే పోలీసులు ఇటీవల తీసుకుంటున్న చర్యలుసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అదృశ్యమైన కొన్ని గంటల్లోనే నిందితులను అదుపులోకి తీసుకొని బాలబాలికలను విడిపిస్తున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. అపహరిస్తున్న నిందితులపై పటిష్టమైన చర్యలు తీసుకొని మళ్లీమళ్లీ అలాంటి కిడ్నాప్‌లకు పాల్పడకుండా చర్యలు తీసుకోలేకపోతున్నారు. కోటి ఆశలతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న చిన్నారులు ఆకస్మికంగా అదృశ్యమైతే కన్నవారికి క్షోభ మాటలకు అందదు. అలాగే ఇంటి ఇల్లాలు మిస్స్ అయితే ఆ కుటుంబంఅంతా ఎంతటి దుఃఖ సముద్రంలో మునిగిపోతుందో వేరే చెప్పక్కర్లేదు. తమ బిడ్డలు,కుటుంబ సభ్యులు ఎక్కడ ఎటువంటి అవస్థలు పడుతున్నారనే ఆందోళన వారిని నిరంతరం కలచివేస్తున్నది. దేశవ్యాప్తంగా ఎన్ని లక్షల కుటుంబాలు కళ్లల్లో ఒత్తులు పెట్టుకొని ఎదురుచూస్తున్నాయో చెప్పలేం. అనారోగ్యంతోనో, ప్రమాదంలోనో ఇతర కారణాలతో మరణిస్తే బాధ ఉంటుంది. కాలం గడిచేకొద్దీ ఆ వ్యక్తిలేని లోటును పూర్తిగా మరిచిపోతారని చెప్పలేం కానీ ఇతర పనుల ఒత్తిడితో క్రమేపీ ఆ బాధను కొంతవరకు మరిచిపోతారు. మృతిచెందిన వ్యక్తులకు సంబంధించిన జ్ఞాపకాలను అప్పుడప్పుడు నెమరవేసుకుంటూనే ఉంటారు. కొన్నివర్గాలు అయితే చనిపోయిన తిథిని, తేదీని గుర్తుంచుకొని పిండప్రదానం లాంటి కార్యక్రమాలు చేస్తుంటారు. మరికొందరు ప్రముఖులు, రాజకీయ నాయకులకైతే వర్థంతి పేరున సభలు, సమావేశాలుపెట్టి వారి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటారు. కానీ ఆకస్మికంగా అదృశ్యమైతే నెలల తరబడి ఏళ్లతరబడి ఆచూకీ తెలియకపోతే ఆ కుటుంబం అనుభవిస్తున్న నరకయాతను మాటల్లో వర్ణించలేం. చనిపోయారో బతికిఉన్నారో తెలియదు. బతికి ఉంటే ఎలా ఉన్నారో, తిరిగి వస్తారా? రారా? తదితర ఆలోచనలతో కుటుంబం అనుభవించే మానసిక క్షోభ వర్ణనాతీతం. తెలంగాణలో ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో అడిషనల్ కమిషనర్‌గా పదవీ విరమణ చేసిన ఉన్నతాధికారి ఇంటి నుండి వెళ్లి అదృశ్యమైపోయారు. రెండు దశాబ్దాలు దాటిపోయినా నేటికీ ఆయన ఆచూకీ కన్పించలేదు. కరీంనగర్ జిల్లాలో ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆయనకుమారుడు అదృశ్యమైనారు. ఇప్పటికీ ఆచూకీ లేదు. ఇలా ఎందరో మిస్స్ అయ్యారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధచూపాలి. అవసరమైతేచట్టంలో మార్పులు చేసి మరింత పదును పెట్టాలి. పోలీసు శాఖలో దీనికో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలి.

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దాని మీద మరక పడితే మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజమెన్ ఫ్రాంక్లిన్

పొగిడేవారు లేనప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

# ప్రపంచ దేశాల మధ్య అమెరికా వెనుకడుగు తప్పదా!

**రష్యా అమెరికాతో సఖ్యతచాలుఅన్నట్లు ఈమధ్యకాలంలో క్రమేపీదూరం జరుగుతుండడంతో ఇతర దేశాలు కూడా ఆలోచనల్లో పడ్డాయి. పాకిస్థాన్, భారత్‌తో ఘర్షణలకు దిగకుండా కొంత కాలం విదేశీ వ్యవహారాలల్లో స్తబ్దుగా ఉండే అవకాశాన్ని కూడా కాదనలేం. బలహీనపడుతున్న బంగ్లాదేశ్, నేపాల్, అఫ్ఘానిస్థాన్ లాంటి దేశాలూ, అరబ్ దేశాలతోసహా రష్యా, చైనా,భారత్ నాయకత్వంలో అమెరికాకు దూరంగా జరగటమే కాకుండా, తమ అవసరాలకోసం తలపడే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలివి తక్కువగా అనవసరంగా ప్రపంచ రాజకీయాలను చిన్నాభిన్నంచేసి అనుభవరాహిత్యాన్ని చాటుకోవటంతో ఈ పరిస్థితులు దాపురించాయి. అన్నిదేశాలనూ, తమప్రయోజనాల కోసం ఆర్థికంగా దెబ్బకొట్టాలని అమెరికా భావిస్తే ఇతర దేశాలు చూస్తూ ఊరుకుంటాయా? రాజకీయాల్లో స్వలాభమే వ్యక్తికైనా దేశానికైనా పరిగణనలో ఉంటుంది. అందుకనే భవిష్యత్తు యు.యస్ బలహీనపడిన ఈ తరుణంలో ఏ విధంగా మల్చబడుతుందో కాకలు తీరిన నిపుణులు కూడా అంచనాలు వేయలేకుండా ఉన్నారు. అమెరికాకు మాత్రం తన మాట నెగ్గించుకొనే పరిస్థితి లేదని నిపుణులు ఖండితంగా చెప్తున్నారు.**



రావులపాటి సీతారాం రావు

నవ్వుకొనే విషయమే అయినా, ట్రంప్ దెబ్బకు అమెరికా వరుల గిరాకీ ఇండియాలో తగ్గిందన్న వార్త చేదునిజంగానే ఉంటుంది. షేర్ మార్కెట్ లాభాలూ నష్టాలతో మానవ సంబంధాలను ముడిపడేట్లు చేసిన డొనాల్డ్ ట్రంప్ చరిత్రలో చాలాకాలం మననంలో ఉంటారు. ఉరుము ఉరిమి మంగలం మీదపడ్డట్లు ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ భారత్ ఆర్థిక స్థితిగతులను శాసించే చర్యగా ఉందని కొందరు ఆర్థిక నిపుణులు అంటున్నా, భారత ప్రధాని మాత్రం మన కాళ్లమీద మనం నిలబడే శక్తి కనీసం ఇప్పుడైనా తెచ్చుకోవాలని జ్ఞాపకం చేయటం అర్థవంతంగా ఆచరించే విధంగానే ఉంది. అంత మాత్రాన ప్రధాని మోడీతోసహా అంతకు మునుపు అధికారంలో ఉన్న నాయకులు భారత్ ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకోలేదని విమర్శించటం హేతుబద్ధంగా ఉండదేమో! ఏ దేశ విధానాలైనా ఆదేశ అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటాయి. వలసవాదుల నుంచి విముక్తి పొందిన యు.యస్.ఏ (యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా) బహు తక్కువ జనాభాతో స్వతంత్ర దేశంగా అవతరించింది. అయినా ఎక్కువ విస్తీర్ణం గల భూభాగాన్ని ఆర్థికవనరులను ఉత్పత్తి చేసేవిధంగా కాలక్రమేణా మార్చుకుంది. అంతేగాదు మానవ వనరులు అభివృద్ధికి ముఖ్యమని భావించి, తమ దేశంలోకి అందరూ ఆహ్వానితులేఅన్న దార్శనికతో ఇతర దేశస్థులను నిండు మనసుతోఆహ్వానించి, తద్వారా దేశాభివృద్ధిని అన్ని విధాలా సాధించుకోగలిగింది. ముఖ్యంగా డాలర్‌ను సంపదకు ట్రేడ్ మార్కెట్‌గా గుర్తింపు తెచ్చుకొని ఇతర దేశాలు సహాయ సహకారాలతో అభివృద్ధి చెంది,సరైన నాయకత్వంతో శ్రమించి అగ్రరాజ్యంగా ప్రత్యేక స్థానాన్ని కొన్ని సంవత్సరాలలోనే సాధించుకోగలిగింది. అందుకు ఆ దేశ ప్రజలూ, నాయకులూ అందరూ అభినందనీయులే. అంతవరకు బాగానే ఉంది. అటు తర్వాతతమతో సమంగా కమ్యూనిస్టు దేశాలు మొదలు యుయస్‌యస్‌ఆర్, తర్వాత చైనా అగ్రరాజ్యాలుగా దాదాపు సమస్థాయిలో అభివృద్ధి చెందిన తర్వాత ప్రపంచ రాజ్యాధినేతగా అన్ని దేశాలనూ చెప్పుచేతల్లో ఉంచుకోవాలనే కాంక్షతో ఈ దేశాల మధ్య పోటీ ద్విగుణీకృతమైంది. అప్పుడే అలీన విధానంతో భారత్, జవహర్‌లాల్ నాయకత్వంతో కొన్ని ఆసియా,అరబ్ దేశాలతో జమకట్టి కోల్డ్‌వార్‌కు అడ్డుకట్ట వేయగలిగింది. ఎప్పుడైతే సోవియెట్ యూనియన్ చిన్నాభిన్నమైందో, అమెరికా పైచేయి సాధించటానికి అర్రులు చాచింది. చైనా కూడా ఆర్థికంగా బలపడి అటు అమెరికాకు, ఇటు బలహీనపడిన రష్యాకూ సవాలు విసిరే స్థాయికి ఎదిగింది. డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎంపిక అయ్యేంతవరకు విభిన్న దేశాల మధ్య ఉన్న ఘర్షణలూ, పొరపొచ్చాలు (ఉదాహరణకు ఇజ్రాయిల్-పాలస్తీనా, ఇండియా-పాకిస్థాన్‌ల మధ్య ఘర్షణలు) అగ్రదేశాల మధ్య రాజకీయ పోరుకు దారి తీయలేదు. రష్యాతో విడిపోయిన ఉక్రెయిన్ అమెరికా పంచన చేరగానే అమెరికాకు ఉక్రెయిన్ గనుల మీద కన్ను పడింది. రష్యాతో ఘర్షణలతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌ను అమెరికా దగ్గరకుతీసి అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి దారి తీసింది. ఇజ్రాయిల్ కూడా అమెరికా అండ చూసుకొని గాజా భూభాగాన్ని ఆక్రమించుకొని పాలస్తీన్‌లను దెబ్బ తీసే ప్రయత్నంలో పడింది. ట్రంప్ చట్టాలను లెక్క చేయకుండానే కాంగ్రెస్‌ను ప్రత్యేకంగా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటీవ్స్‌ను తన విధానాలకు అనుకూలంగా మార్చుకొనే ప్రయత్నాలు చేసుకోవటంలో కొంత విజయం సాధించారు. స్పీకర్ ఆఫ్ ది హౌస్ కూడా అడుగులకు మడుగులొత్తే ధోరణి కనపరుస్తున్నట్లు అమెరికాలోని రాజకీయ వర్గాల భావన. అమెరికా దేశంలోని ప్రజలు ఇంకా ట్రంప్ నిష్ప్రయోజకత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నట్లు లేదు. ప్రపంచ అవనిక కొంచెం కొత్తగా, గజిబిజిగా కనపడుతున్న మాట నిజం. నిన్నమొన్నటి దాకా చైనా, పాకిస్థాన్‌కు అండగా ఉంటూ భారత్‌ను శత్రుదేశంగా దూరంచేసుకుంది. రష్యా, ఉక్రెయిన్‌తో తల మున్కలయి, పాత స్నేహితుల ఇబ్బందులు పట్టించుకోలేని పరిస్థితిలో పడింది. అమెరికా ట్రంప్ అడ్డగోలు వ్యవహారాలతో మొదటిసారి అమెరికా విదేశాంగ విధానాన్ని ఎవరికీ అర్థంకాని రీతిలో తలకిందులు చేసి చిన్న పిల్లవాడు గెంతులేసినట్లు నేనే ఎన్నో యుద్ధాలను ఆపాను! నావల్లే చాలా మంది మరణావస్థ నుంచి తప్పించుకున్నారు. అందుకని నోబెల్ బహుమతి నాకు లభించినా ఎవరూ ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని బింకాలుపోతున్నాడు. రష్యా, చైనాలు ప్రపంచపరిస్థితుల్లో సమతుల్యత కోల్పోయిన విధానాన్ని ఇప్పుడు గమనించినట్లయింది. అందుకే ఆసియాలో గట్టిపట్టుతో అన్నివిధాలా అభివృద్ధి సాధిస్తున్న భారత్‌ను తమతో చేర్చుకొని అమెరికా అహంభావానికి అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నది. అందుకు అనుగుణంగా రష్యా, చైనా,భారత్‌ల మీద ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లు అర్థం లేనివని, తగు మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరికలు చేస్తున్నది. ట్రంప్ యధావిధిగా ఎంతో సహాయకారిగా ఉన్న తనను కాదని భారత్, రష్యా, చైనాల పంచన చేరి మోసానికి పాల్పడుతున్నదని యూరప్ దేశాల సహాయ సానుభూతులకోసం ప్రయత్నిస్తున్నారు. ఇజ్రాయెల్ గాజాతో యుద్ధాన్ని ఆపకుండా వెస్ట్‌బాంక్‌లో సెటిల్‌మెంట్స్ సంపాదించుకోనేందుకు ముందు ముందుకుపోతే, యూరప్ దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధాలు ఆపేసే అవకాశం ఉంది. వెస్ట్‌బ్యాంక్‌ను ఆక్యుపై చేసుకోకుండా 'రెడ్‌లైన్'ను యూరప్ దేశాలు ప్రకటించొచ్చు కూడా. నెతన్యాహు, ఇజ్రాయెల్ అధినేత గోడ మీద రాతను చూడటం లేదు. అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ ఒంటరి అయ్యే ప్రమాదం, అమెరికా బలహీనపడుతున్న ఈ తరుణంలో సంభవించే అవకాశం ఉంది. యుద్ధాలలో గెలుపు వాకిటనే ఓటమి కూడా ఉంటుంది. ఇజ్రాయెల్ ఎన్నో సాహసోపేతమైన ఘర్షణలను ఎదుర్కొని విజయాలను సాధించింది కానీ ఎల్లకాలమూ విజయం దక్కటం కష్టమే. గతంలో యూరప్, అమెరికాతో సహ ఇజ్రాయెల్‌కు అండగా నిల్చాయి. ఇప్పుడు ఆ పరిస్థితులు కనపడటంలేదు. ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒంటెద్దుపోకడలను సహించే స్థితి కనుమరుగవుతున్నది. ఆసియా దేశాలలో భారత్, చైనా ఒకటిగా ముందడుగు వేసే పరిస్థితులు తాత్కాలికమే అయినా, కనపడుతున్నాయి. రష్యా అమెరికాతో సఖ్యత చాలుఅన్నట్లు ఈ మధ్యకాలంలో క్రమేపీదూరం జరుగుతుండడంతో ఇతర దేశాలు కూడా ఆలోచనల్లో పడ్డాయి. పాకిస్థాన్, భారత్‌తో ఘర్షణలకు దిగకుండా కొంతకాలం విదేశీ వ్యవహారాలల్లో స్తబ్దుగా ఉండే అవకాశాన్నికూడా కాదనలేం. బలహీనపడుతున్న బంగ్లాదేశ్, నేపాల్, అఫ్ఘానిస్థాన్ లాంటి దేశాలూ, అరబ్ దేశాలతోసహా రష్యా, చైనా, భారత్ నాయకత్వంలో అమెరికాకు దూరంగా జరగటమే కాకుండా, తమ అవసరాల కోసం తలపడే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలివి తక్కువగా అనవసరంగా ప్రపంచ రాజకీయాలను చిన్నాభిన్నం చేసి అనుభవరాహిత్యాన్ని చాటుకోవటంతో ఈ పరిస్థితులు దాపురించాయి. అన్ని దేశాలనూ, తమ ప్రయోజనాల కోసం ఆర్థికంగా దెబ్బకొట్టాలని అమెరికా భావిస్తే ఇతర దేశాలు చూస్తూ ఊరుకుంటాయా? రాజకీయాల్లో స్వలాభమే వ్యక్తికైనా దేశానికైనా పరిగణనలో ఉంటుంది. అందుకనే భవిష్యత్తు యు.యస్ బలహీనపడిన ఈ తరుణంలో ఏ విధంగా మల్చబడుతుందో కాకలు తీరిన నిపుణులు కూడా అంచనాలు వేయలేకుండా ఉన్నారు. అమెరికాకు మాత్రం తన మాట నెగ్గించుకొనే పరిస్థితి లేదని నిపుణులు ఖండితంగా చెప్తున్నారు. ●



# గర్భ నిరోధకతపై అవగాహన అవసరం

ఆర్. కిష్టయ్య

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, యువత శక్తి, సమాజ అభివృద్ధి గురించి అవగాహన పెంపొందించే ప్రధాన దినంగా గుర్తించబడింది. ఈ దినోత్సవం ప్రధానంగా గర్భనిరోధక పద్ధతుల సురక్షిత, సమర్థవంతమైన వినియోగం, వ్యక్తిగత జంట హక్కులపై దృష్టిసారించడం కోసం ఏర్పాటు చేయబడింది. గర్భనిరోధక పద్ధతుల అవగాహన కేవలం వ్యక్తిగత సమస్యలకు పరిమితం కాకుండా సమాజం, దేశ స్థిరత్వానికి కూడా కీలకంగా ఉంది. భారతదేశంలో కుటుంబ నియంత్రణకు సంబంధించిన అవగాహన ప్రాచీనకాలం నుంచే ఉంది. ఆయుర్వేద గ్రంథాలలో ఫర్టిలిటీ నియంత్రణ, మూలికల ఆధారిత గర్భనిరోధక పద్ధతులు వివరంగా వర్ణించబడ్డాయి. మహాభారత, రామాయణ వంటి ప్రాచీన కాలంలో కూడా కుటుంబ పరిమాణాన్ని నియంత్రించడంలో వ్యక్తిగత బాధ్యత, సమాజ పరిమితుల ప్రాధాన్యం ప్రస్తావించబడింది. 20వ శతాబ్దంలో, జనాభా విస్తరణ, మహిళాఆరోగ్యం, కుటుంబ సంక్షేమం ప్రధాన సమస్యలుగా మారడంతో, అంతర్జాతీయంగా గర్భనిరోధక అవగాహనపై ప్రత్యేక దృష్టిసారించడం ప్రారంభమైంది. 2007లో సెప్టెంబర్ 26ని ప్రపంచ గర్భనిరోధక దినోత్సవంగా ప్రకటించింది. గర్భ నిరోధక పద్ధతులు మూడు ప్రధాన వర్గాల్లో విభజించవచ్చు. హార్మోనల్ పద్ధతులలో గర్భనిరోధక పిల్‌లు, ఇంజెక్షన్‌లు, ఇంప్లాంట్‌లు ముఖ్యమైనవి, ఇవి హార్మోన్ల మార్పుల ద్వారా గర్భసాధ్యాన్ని నిరోధిస్తాయి. ప్రకృతి ఆధారిత పద్ధతులలో ఫర్టిలిటీ అవేర్‌నెస్, చక్రగణన, శరీర ఉష్ణోగ్రత పద్ధతులు ఉన్నాయి, వీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తే గర్భనిరోధకత సాధ్యమవుతుంది. గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలలో సుమారు 60 శాతం మంది సురక్షి త గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తారు. అయితే అభివృద్ధి చెందని కొన్ని దేశాల్లో ఈసంఖ్య 30శాతం కన్నాతక్కువ. భారత్‌లో స్త్రీలలో సుమారు 58 శాతం మంది మాత్రమే సురక్షిత గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. 2015లో ఇది 50 శాతం మాత్రమే ఉండటం, క్రమంగా మార్పు జరుగుతున్నదని సూచిస్తుంది. గర్భనిరోధక పద్ధతులవినియోగం మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, యువత ప్రగతికి కీలకంగా మారింది. అసురక్షిత గర్భనిరోధకత, అనూహ్య గర్భస్రావాలు,గర్భపాతం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. పిల్లల సంఖ్యను నియంత్రించడం ద్వారా ప్రతి పిల్లకు సరైన పోషణ, విద్య, వైద్య సౌకర్యం లభిస్తుంది. అలాగే, కుటుంబ వ్యయం, వైద్య ఖర్చులు సమర్థవంతంగా విభజించవచ్చు. సురక్షిత గర్భనిరోధక పద్ధతులు యువతకు చదువు, కెరీర్ అవకాశాలను తగ్గకుండా పెంపొందిస్తాయి. భారతదేశంలో కుటుంబ సంక్షేమ, గర్భనిరోధక అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఇంప్లాంట్, శిక్షణా వర్క్‌షాప్‌లు అందించడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్, వైద్య పాఠశాలలు ద్వారా మహిళలు, యువతకు అవగాహన కల్పించబడుతుంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల లోపలి విద్య, సాంప్రదాయ పరిమితుల కారణంగా అవగాహన ఇంకా తక్కువగా ఉంది. ఈ కారణంగా, తల్లితనం రేటు, బాలికల ఆరోగ్యం, మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్‌లు, సదస్సులు, సామాజిక మీడియా ప్రచారాలు, పబ్లిక్ క్యాంపెయిన్‌లు జరుగుతాయి. యువత, మహిళలు, కుటుంబాలు, వృద్ధులు, సర్వసాధారణ ప్రజలకు సులభంగా, స్పష్టంగా సమాచారం అందించడానికి కృషి జరుగుతుంది. ఈ దినోత్సవం ద్వారా ప్రతి వ్యక్తికి అందించే ముఖ్య సందేశం, ప్రతి వ్యక్తి, ప్రతి జంట గర్భనిరోధక పద్ధతుల గురించి అవగాహన కలిగి, వాటిని సురక్షితంగా ఉపయోగించడం అనేది వారి హక్కు. ఇది మహిళా శక్తి, కుటుంబ సంక్షేమం, సమాజ అభివృద్ధికి మూలాధారం. ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం కేవలం గుర్తింపు మాత్రమే కాదు. సురక్షి త, సమర్థవంతమైన, సులభంగా అందుబాటులో ఉండే గర్భనిరోధక పద్ధతులు సమాజానికి ప్రగతి, ఆరోగ్యం, మహిళా శక్తి, ఆర్థిక స్వావలంబన తీసుకొస్తాయి. ●

# పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించాలి

వి. వరదరాజు

ఆర్థిక సంస్కరణలు 1990లో ప్రవేశపెట్టాక విదేశీ పెట్టుబడులు వచ్చాయి. పారిశ్రామిక రంగం కొత్త చిగురు తొడిగింది. పరిశ్రమల ఆధునీకరణకు, సాంకేతిక సృజనలకు ద్వారాలు తెరుచుకొన్నాయి. దేశాన్ని ప్రపంచ విపణితో కలిపాయి. ఈ కామర్స్, కంప్యూటర్ హార్డవేర్, సాఫ్ట్‌వేర్ రంగాలకు విదేశీ పెట్టుబడులు భారీగా తరలివచ్చాక, ఈ రంగాలు బాగా విస్తరించాయి. అధిక స్థాయిలో నాణ్యమైన ఉద్యోగాల కల్పన జరిగింది. 2023 నాటికి నేరుగా 54 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. పరోక్షంగా మరెన్నో అందించాయి. కానీ ఇటీవల విదేశీ పెట్టుబడుల ధోరణి మారింది. వాటి రాకకూడా తగ్గింది. ఇప్పటికీ ఇండియా పెట్టుబడులను ఆకర్షించగలుగుతోంది. కానీ వాటిలో అధిక భాగం తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించే రంగాల వైపు మరలుతున్నాయి. పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు దూరంగా జరిగాయి. దేశీయ పారిశ్రామిక వేత్తలు కూడా విదేశాల్లో పెట్టుబడి పెట్టడానికి మొగ్గు చూపిస్తున్నారు. ఈ ధోరణి దేశ పెట్టుబడి వాతావరణ ఆరోగ్యం క్షీ నింప చేస్తోంది. ఇటీవల పెట్టుబడుల రాక ప్రోత్సహాకరంగానే వుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 81 బిలియన్ డాలర్లు వచ్చాయి. 2011 సంవత్సరంలో 46 బిలియన్లు వస్తే, అవి 2021 నాటికి 84.8 బిలియనల్లకు పెరిగాయి. ఇదే అత్యధిక పెట్టుబడిగా చెప్పవచ్చు. అప్పటి నుండి వీటి రాక మెల్లగా మందగించింది. 2023-24లో 71 బిలియన్లకు తగ్గింది. కోవిడ్ తరువాతి నాలుగేళ్ల కాలంలో స్థూల పెట్టుబడి సగటున 0.3 శాతం పెరుగుతూ వచ్చాయి. కానీ అదే కాలంలో డిజిన్వెస్ట్మెంట్, పెట్టుబడి తరలింపు బాగా పెరిగింది. సగటు తరలింపు 18 శాతం. పెట్టుబడుల రాకపోకల మధ్య అంతరం చాలా ఎక్కువగా వుంది. కరోనా తరువాతి కాలంలో ఇండియాకు 308 పైచిలుకు బిలయన్ డాలర్స్ వచ్చాయి. వచ్చిన దాంట్లో సగానికిపైగా మూలధనం వెనక్కి మరలిపోయింది. చాలా వేగంగా పెట్టుబడులు వెనుదిరుగుతుండడం వలన దీర్ఘకాల అభివృద్ధికి అవరోధమైంది. టాక్స్ ఆర్బిట్రేజ్, ట్రేడ్ బేస్డ్ మార్గాల్లో పెట్టుబడులు ఎక్కువగా మరలుతున్నాయి. ఆర్థిక సంస్కరణల తొలినాళ్లలో వచ్చిన మూలధనం ఎక్కువ కాలం నిలిచి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాడ్డాయి. ప్రస్తుతం వచ్చిన పెట్టుబడుల్లో ఆ కోవకు చెందినవి కేవలం 12 శాతంగా వున్నాయి. విదేశీ పెట్టుబడులు వేగంగా తరలిపోతున్నందున అర్థవంతమైన దేశభివృద్ధికి బాటలు పడటం లేదు. పారిశ్రామీకరణ, మౌలిక సదుపాయాలు, సృజనలకు నిరంతర పెట్టుబడులు అందుబాటులో లేనందున దేశ అభివృద్ధికి అవరోధంకలుగుతోంది. అలాగే దేశీయ పెట్టుబడులు బయటకు తరలిపోవడంకూడా మరో పెద్ద అడ్డంకి. 2011-12లో 13 బిలియన్ డాలర్లు వెనక్కు మరలితే, 2024-25లో 30 బిలియన్లు వెనుదిరి



గాయి. ఇక్కడి రెగ్యులేటరీ అసమర్థతలు, మౌలిక వసతుల కొరత, అనూహ్యమైన విధానం వలనే మేం సరిహద్దులు దాటిపోవలసి వస్తుందని పారిశ్రామిక వేత్తల ముక్త కంఠ ఫిర్యాదు. మూలధనం బయటకు తరలిపోవడం వలన దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతోంది. ఉద్యోగ కల్పన బలహీనంగా ఉందని 2024 ఐయల్ఒ నివేదిక పేర్కొంది. 2020 జులై నుండి 2024 జులై మధ్యకాలంలో 49 వేలకు పైగా ఎంఎస్‌ఎంఇలు మూటపడ్డాయి. 3లక్షల 18వేల మంది ఉపాధిపోయింది. ఆవిష్కరణలు మొగ్గ తొడగడం లేదు. అభివృద్ధికి ఇంజనైన పారిశ్రామికాభివృద్ధి కుంటుపడుతోన్నది. ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాక స్వేచ్ఛావ్యాపార రేటింగ్ మెరుగైంది. ఐనప్పటికి అస్పష్ట నియంత్రణ, న్యాయపరమైన చిక్కులు, పాలనా లోపాలు వంటి నిర్మాణాత్మక అడ్డంకుల వలన పెట్టుబడుల అస్థిరత పెరుగుదలకు కారణాలఔతున్నాయి. దేశ, విదేశీ పారిశ్రామికవేత్తల మధ్య పెరుగుతున్న ప్రవర్తన గమనిస్తే, ప్రభుత్వ విధానంలోలోతైన క్రమానుగుణ శూన్యత పొడసూపుతోంది. ఈ ధోరణిని ప్రభుత్వం త్రిప్పి కోట్టాలని భావిస్తే విధాన లోపాలను వేగంగా సరిదిద్దాలి. కేంద్రం దీర్ఘకాల పెట్టుబడులను ఆకర్షించేలా సంస్కరణలు చేయాలి. నియంత్రణలు సులభతరంకావింపు, సుస్థిర విధాన అవలంభన, మౌలికవనరులపై దృష్టి సారించాలి. ఇవే కాకుండా ఆధునిక పారిశ్రామిక అవరాలను తీర్చేలా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. దేశ పారిశ్రామిక అభివృద్ధికి మేలిమి మానవ వనరుల అభివృద్ధి అత్యంత ముఖ్యమని నిపుణులు గత కొంత కాలంగా చెబుతున్నారు. డిజిన్వెస్ట్మెంట్ పెరుగుదల, పారిశ్రామికవేత్తల ప్రాధాన్యతల మార్పు, మూలధనం దేశ ఎల్లలు దాటిపోవడం అంటే దేశ ఆర్థిక దృక్పథంపై పెట్టుబడిదారులకు నమ్మకం సడలడమే కాదా ! సింగపూర్, మరిషస్‌లు అధిక పెట్టుబడులు ఎలా రాబట్టగలుగుతున్నాయి? ఆ దేశాలు పన్ను వ్యూహంద్వారానే అవి ఆర్థిక ఆధిపత్య కేంద్రాలుగా ఏదిగాయి. దేశ పారిశ్రామిక రంగానికి స్థిరంగా మూలధనం అందించే అమెరికా, జర్మనీ, యుకెలు నేడు ముఖం చాటేస్తున్నాయి. ఆర్థిక సేవలు, ఎనర్జీ పంపిణీ, హాస్పిటాలిటి రంగాలకు మాత్రమే పెట్టుబడులు వస్తున్నాయి. ఈ రంగాలు కూడా జీడీపీ పెరుగుదలకు తోడ్పాడతాయి. కానీ పరిశ్రమలు, మౌలిక వసతులు, ఆధునిక సాంకేతికతలు అత్యంత ముఖ్య రంగాలు. ఇవి బహుళ ప్రయోజనకారులు. ఇవి సుస్థిరాభివృద్ధి కావిస్తాయి. నేడు దేశ స్థూల ఆర్థిక వ్యవస్థ సుస్థిరత ఫ్.డి.ఐతో పెనవేసుకుంది. విదేశీ పెట్టుబడులు పలు ప్రయోజనాలు చేకూర్చుతాయి. ఇవి మూలధన వనరుగా నిలుస్తాయి, చెల్లింపుల సమతుల్యతా మద్దతు, ద్రవ్య పరిపూష్టి కలిగిస్తాయి. నికర విదేశీ పెట్టుబడులు క్షీణిస్తే ఆ ఖాతా నిర్వహణకు సంబంధించిన చిక్కులు, ద్రవ్య యాజమాన్య ఇబ్బందులు తలెత్తుతాయని రిజర్వ్‌బ్యాంకు హెచ్చరించింది. దేశానికి రావాల్సిన పెట్టుబడులు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు ఎగరేసుకుపోతున్నాయి. కారణాలు ఉన్నత స్థాయి పాలక, ఉద్యోగ వర్గాలకు తెలిసినవే. ఆయాదేశాల పన్నుల విధానం, మార్కెట్ సుస్థిరత, నైపుణ్య మానవ వనరులను కలిగి ఉండటమే. దశాభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను ఆకార్షించే సుస్థిర విధానం అవసరం. ●

# ప్రజావాక్కు



## టీ.ఇ.టి.పై పునఃసమీక్ష పిటిషన్

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీ.ఇ.టి.) గురించి సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్రంలో కొత్త చర్చ మొదలైంది. ఈ తీర్పు వల్లఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అనిశ్చితి ఏర్పడుతుందన్న భయంతో ప్రభుత్వంపునఃసమీక్ష పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకోవడం సమంజసం. టీ.ఇ.టి. అనేది విద్యా నాణ్యతకు కీలకమైన పరీక్ష. అయితే అర్హత ప్రమాణాలు, రిజర్వేషన్ విధానం, మూల్యాంకనంపై ఎప్పటికప్పుడు వివాదాలు వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితంగా మారింది. రాష్ట్రం పిటిషన్ దాఖలు చేయడం ద్వారా స్థానిక పరిస్థితులు, సామాజిక న్యాయం, విద్యా అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రయత్నిస్తోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ట్రంప్ నోబెల్ శాంతికెలా అర్హుడు?

రెండో ప్రపంచ యుద్ధాన్ని అడ్డుకోవడంలో నానాజాతి సమితి చేతులెత్తేసినసమయంలో ఐక్యరాజ్య సమితిని ఏర్పాటుచేసారు. ప్రపంచ దేశాలమధ్య ఘర్షణాత్మక వాతావరణంతలెత్తకుండా చూడటం, ప్రపంచశాంతి భద్రతలను పరిరక్షి ంచడం, స్నేహ సౌహార్ద్రాలతో మానవాళి యావత్తూసమిష్టిగాపురోగమించేలా చేయడంవంటివి ఐక్యరాజ్య సమితి లక్ష్యాలు. వాటిని సాధించడంకోసం నిర్దేశించుకున్న అంతర్జాతీయ కట్టుబాట్లను అమెరికా కాలదన్నిన ఉదంతాలు అనేకం. అలాంటి అమానవీయ అగ్రరాజ్యాధిపతి అంతర్జాతీయ శాంతినోబెల్‌బహుమతికి అర్హుడననడం ట్రంపు మానసిక అంధత్వానికి ప్రబల నిదర్శనం.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

## స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్ కల్పించాలి

అతి త్వరలో తెలంగాణ రాష్ట్రంలో స్థానికసంస్థలలో ఎన్నికలు జరగనున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ ఎస్సీ ఎస్టీబీసీ మహిళలకు జనరల్ స్థానాలలో ఆయా నియోజకవర్గాలను జనాభా నిష్పత్తి ప్రకారం ఓటర్ల సంఖ్యనుబట్టి రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లుగానే వికలాంగులకుకూడా 5శాతంరిజర్వేషన్ కల్పించాలి. వికలాంగులు ఓటువేసే యంత్రాలు గానే కాకుండా ఎన్నికలలో పోటీ చేసి ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక అయ్యే అవకాశాలు కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## అమెరికాకు భారత్ దూరమవుతుందా?

నరేంద్రమోడీ తనకు ప్రియ స్నేహితుడిని అంటాడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. అసలు స్నేహంలో గల లక్షణాలు ఆయనకు తెలిసినట్టు లేదు. తాను బాధపడుతున్నా స్నేహితుడికి కష్టాన్ని కలిగించకూడదనే ప్రాథమిక సూత్రం ఏ మాత్రం తెలియదు. తెలుసుకోవాలని లేదు. కొన్నిజీవితాలు అంతే. వారు బాగా బ్రతికేస్తారు. తెలియని మంచి విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస ఈ షన్మాత్రం కలుగదు. ట్రంప్ ఓ చిత్రమైన మనస్తత్వం గల వ్యక్తి. బహుశ ఇటువంటి చపలచిత్తుడైన అధ్యక్షుణ్ణి అమెరికా ఇంతవరకు చూసిఉండదేమో. సుంకాల మోత మోగుతూనే ఉంది. దీనికికారణం రష్యానుండి క్రూడ్‌ఆయిల్ భారత్ దిగుమతి చేసుకోవడం ట్రంప్‌కు ఇష్టంలేదు. భారత్ అమెరికా విదేశాంగమంత్రుల సమావేశంలో భారత్‌నువదులుకోబోమని మరోకసారి తెలియ జేయడం జరిగింది. ట్రంప్ వైఖరిలో మార్పు రాకపోతే భారత్‌ను దూరం చేసుకుంటున్నట్టే అనుకోవాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## వందేభారత్‌లో స్లీపర్ క్లాస్

భారతీయ రైల్వేశాఖ కొత్తగా రెండు స్లీపర్ క్లాస్‌తో వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ శాఖ మంత్రివర్యులు ప్రకటించారు. వందే భారత్‌లో ఉన్న రెండు తరగతుల ధరను సామాన్యులే కాకుండా, అత్యవసరం కానిచో జీతగాళ్లు కూడా భరించే అవకాశం లేదు. ఐతే విమాన ప్రయాణం కన్నా ఈ ధర చాలా తక్కువ. ఈనేపథ్యంలో స్లీపర్ తరగతితో ఉన్న వందేభారత్ రైలు టికెట్ ఛార్జీ , ప్రయాణం చాలా ఉపయోగపడుతుంది. అత్యంత సాంకేతికతతో, సత్వరం గమ్యం చేరే సదుపాయం హెచ్చు ప్రయాణీకులకు సాధ్యమవుతూ రాబడి పెంచే బహుళ ప్రయోజనం. తొలి దశలో అటువంటి రైలు నడిచిన తర్వాత అన్నివిధాల అనుకూలమైతే ఇతర రాష్ట్రాలకు సాధ్యమైన మార్గాలకు విస్తరించవచ్చు.

- బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## మెడిసిన్‌లను కనిపెట్టాలి

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన వ్యాధులైన క్యాన్సర్, బ్లడ్ ప్లెజర్, డయాబెటిస్, న్యుమోనియా, టైఫాయిడ్, థైరాయిడ్, డెంగీ , మలేరియా, తదితర దీర్ఘ కాలిక వ్యాధులకు తాత్కాలిక మెడిసిన్‌లకు బదులు ఆ వ్యాధుల పూర్తి నివారణకు మెడిసిన్‌లను ఫార్మాకంపెనీలు, శాస్త్రవేత్తలు కనిపెట్టాలి. తక్కువ సమయంలో పూర్తిగా నివారించే విధంగా మెడిసిన్‌లను కనిపెట్టాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరే రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జిఎస్టీ సవరణలపై ప్రతిపక్షాల తప్పుదారి

## పన్నుల దోపిడీ అంతా కాంగ్రెస్ హయాంలోనే

## లక్నో అంతర్జాతీయ ట్రేడ్ ఎక్స్‌పోలో ప్రధానిమోడీ



**లక్నో, సెప్టెంబరు 25:** జిఎస్టీ రేట్ల తగ్గింపు అంశంపై కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించాయని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. టూత్‌పేస్ట్ నుంచి ట్రాక్టర్ల వరకు ప్రతి వస్తువు ధరలపై పన్నుభారం తగ్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో పన్ను దోపిడీ జరిగిందన్న ఆయన భారీ పన్నులతో ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనను ప్రారంభించిన మోడీ మాట్లాడుతూ మూడురోజుల కిందట జిఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయని, ఇది నిర్మాణాత్మక మార్పుగా పేర్కొన్నారు. ఇవి భారతదేశ వృద్ధి కథకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సంస్కరణలు జిఎస్టీ నమోదును సులభతరం చేస్తాయని.. పన్ను వివాదాలను తగ్గిస్తాయన్నారు. ఎంఎస్ఎంఇలకు రిటర్న్‌ను వేగవంతం చేస్తాయని ప్రతి రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తాయన్నారు.

2014కి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్, మిత్రపక్షాలు తమ ప్రభుత్వ వైఫల్యాలను దాచడానికి ప్రజలకు అబద్ధాలు చెబుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పన్నుల ద్వారా భారీ దోపిడీ జరిగిందని దోచుకున్న డబ్బును మరింత దోచుకున్నారని, దేశంలోని సామాన్య పౌరుడు పన్ను భారంతో ఇబ్బందిపడ్డాడని ప్రధాని పేర్కొన్నారు. తన ప్రభుత్వం పన్నులను గణనీయంగా తగ్గించిందని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టిందని, ప్రజల ఆదాయంతో పాటు పొదుపును పెంచిందన్నారు. రూ.12లక్షల వరకు ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయించడం ద్వారా కొత్త జీఎస్టీ సంస్కరణలను అమలు చేయడం ద్వారా పౌరులు ఈ ఏడాది రూ.2.5లక్షల కోట్లు ఆదా చేస్తారన్నారు. దేశం జీఎస్టీతో పొదు పండుగ జరుపుకుంటోందన్నారు.

2014కి ముందు అధిక పన్ను భారం వ్యాపార ఖర్చులు, గృహ బడ్జెట్‌ను నిర్వహించడం కష్టతరం చేసిందని.. 2014కి ముందు రూ.1000 రేటున్న చొక్కాపై రూ.170 పన్ను విధించారన్నారు. 2017లో జిఎస్టీ అమలులోకి వచ్చాక ఈ పన్ను రూ.50కి తగ్గిందన్నారు. సెప్టెంబర్ 22న అమలులోకి వచ్చిన సంస్కరణలతో అదే రూ.1000 విలువైన షర్ట్‌పై జిఎస్టీ రూ.35 మాత్రమేచెల్లించాల్సి ఉంటుందన్నారు.

2014లో టూత్‌పేస్ట్, షాంపూ, హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్ వంటి ముఖ్యమైన వస్తువులపై రూ.100 ఖర్చు చేస్తే రూ.31 పన్ను విధించారని, బిల్లు రూ.131 పెరిగిందని ఆరోపించారు. 2017లో జిఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రూ.100 విలువైన వస్తువు ధర రూ.118కి తగ్గిందని, అంటే రూ.13 ఆదా అవుతుందని.. ఇటీవలి జిఎస్టీ సంస్కరణల తర్వాత ఈ ఖర్చు రూ.105కి తగ్గిందని, ఫలితంగా 2014 ముందు రేట్లతో పోలిస్తే ప్రజలకు మొత్తం రూ.26 ఆదా అవుతుందన్నారు.

2014లో నిత్యావసరాల కోసం ఏడాదికి రూ.లక్ష ఖర్చు చేసే కుటుంబం రూ.20వేల నుంచి రూ.25వేలవరకు పన్నులు చెల్లించాల్సి ఉంటుందని జిఎస్టీ సంస్కరణల తర్వాత రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే చెల్లిస్తుందన్నారు. 2014కి ముందు ట్రాక్టర్ కొనుగోలు చేసేందుకు రూ.70వేల కంటే ఎక్కువగా పన్ను చెల్లించేదని ఇప్పుడు అదే ట్రాక్టర్‌పై రూ.30వేల మాత్రమే ఖర్చు అవుతుందని రూ.40వేల కంటే ఎక్కువగానే ఆదా అవుతుందని ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన నాటి రోజుల పోలిస్తే ప్రస్తుతం స్కూటర్ల ధరలు రూ.8వేల నుంచి రూ.9వేలు తగ్గుతాయన్నారు. సంస్కరణల పేద, మధ్య తరగతుల వారందరికీ జిఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని వివరించారు.

# అగ్ని ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** భారత రక్షణ పరిశోధన సంస్థ(డిఆర్‌డిఒ) ఆధ్వర్యంలో నూతనంగా అభివృద్ధి చేసిన మధ్యశ్రేణి రేంజ్ 'అగ్ని ప్రైమ్ క్షిపణి' పరీక్ష విజయవంతమైంది. ఈమేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' ఖాతాలో వీడియోను షేర్ చేశారు. డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలను అభినందించారు. ముఖ్యంగా భారత్‌వంటిదేశాలకు స్వల్ప, మధ్యస్థ, దీర్ఘశ్రేణి క్షిపణుల పరీక్ష అనేది సాధారణమే. అయితే ఇది సాధారణ క్షిపణి పరీక్ష కాదు. 2 వేల కి.మీ పరిధి కల్గిన అణ్వాయుధ సామర్థ్యం. గత అగ్ని ప్రైమ్‌ను భారతీయ రైల్వే లోకోమోటివ్ లాగిన్ లాంచ్ బెడ్ నుండి ప్రయోగించారు. ఈ ప్రయోగంతో రష్యా, అమెరికా, చైనా వంటి ఎలైట్ జాబితాలో భారత్ చేరింది. రైల్‌కార్ ఆధారిత ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు లేదా ఐసీబీఎంలను ప్రయోగించగల సామర్థ్యం కలిగి ఉంది. "ఈ రకమైన మొట్టమొదటి ప్రయోగం ప్రత్యేకంగా రూపొందించిన, రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుండి నిర్వహించబడింది" అని రక్షణ మంత్రి అన్నారు. ముందస్తు షరతులు లేకుండా రైలు నెట్‌వర్క్‌లో కదలగల సామర్థ్యం ఉంది. ఇది తక్కువ ప్రతిచర్య సమయం, క్రాస్-కంట్రీ మొబిలిటీని అనుమతిస్తుంది అని రాజ్‌నాథ్ సింగ్ తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ఈ విజయవంతమైన పరీక్ష భారత్‌ను ఆన్-ది-మూవ్ రైలు నెట్‌వర్క్‌ల నుండి క్యానిస్టరైజ్డ్ లాంచ్ సిస్టమ్‌లను అభివృద్ధి చేసిన ఎంపిక చేసిన దేశాల సమూహంలో చేర్చింది అని రక్షణ మంత్రి పేర్కొన్నారు.

# బీహార్ ఎన్నికల బిజెపి ఇన్‌చార్జిగా ధర్మేంద్ర ప్రధాన్




## బెంగాల్‌కు భూపేందర్ యాదవ్, తమిళనాడుకు బైజయంత్ పాండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు బిజెపి ఎన్నికల ఇన్‌చార్జీలను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్ షా బీహార్‌లో విస్తృతంగా పర్యటిస్తూ అనధికారికంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారం నిలబెట్టుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే బిజెపి అగ్రనాయకత్వం ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించింది. ప్రధాన్‌తోపాటు కేంద్ర జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్, ఉత్తర్ ప్రదేశ్ మంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యలను సహ ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు. మరో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను పశ్చిమబెంగాల్‌కు ఇన్‌చార్జిగా ప్రకటించింది. ఆయనకు తోడుగా, త్రిపుర మాజీ సిఎం బిప్లబ్ కుమార్ దేబ్‌ను నియమించింది. ఢిల్లీకి చెందిన బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండాకు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహుల్ పాండాకు సహాయకారి పనిచేయనున్నాడు.

# సౌదీ గ్రాండ్ ముఫ్తీ కన్నుమూత

**దుబాయి, సెప్టెంబరు 25:** సౌదీ సామ్రాజ్యానికి ఇస్లామిక్ వ్యవహారాల సలహాదారుగా సుమారు రెండు దశాబ్దాలకుపైబడి పనిచేసిన గ్రాండ్‌ముఫ్తీ షేక్ అబ్దుల్ అజజ్ బిన్ అబ్దుల్లా బిన్ మొహ్మద్ ఆల్‌షేక్ కన్నుమూసారు. సౌదీ సామాజిక సరళీకరణకు కృషిచేసిన ఇస్లామిక్ పండితునిగా ఆయనకు పేరు ప్రఖ్యాతులు లభించాయి. గ్రాండ్ ముఫ్తీగా ఆయన సున్నీ ముస్లిం ప్రపంచంలో కీలక పాత్రపోషించారు. మహిళలడ్రైవింగ్‌కుఅనుమతించడాన్ని సినిమా థియేటర్ల ప్రారంభాన్ని, సామాజిక సరళీకరణను సమర్థించారు. ఉగ్రవాదసంస్థల కార్యకలాపాలు తీవ్రంగా వ్యతిరేకించారు. ముఫ్తీ మరణంతో సౌదీ అరేబియా ఒకగొప్ప విజ్ఞాన నిపుణుడిని కోల్పోయిందని సౌదీ రాజాస్థానం ప్రకటన విడుదలచేసింది.

# వితంతువు ఆస్తులు పిల్లలు లేకుంటే భర్త వారసులకే

## సుప్రీం కోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** హిందూ వారసత్వ చట్టంపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఒక హిందూ మహిళ వీలునామా రాయకుండా భర్త, పిల్లలు లేకుండానే చనిపోతే, ఆమె ఆస్తి పుట్టింటి కుటుంబానికి కాకుండా భర్త వారసులకే చెందుతుందని కోర్టు పేర్కొంది. ఈ విషయంలో హిందూ సంప్రదాయాలు, వివాహ వ్యవస్థను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. హిందూ వారసత్వ చట్టం 1956లోని సెక్షన్ 15(1)(బి)ని సవాల్‌చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ.. పిటిషనర్ల వాదనలకు ముందు కొన్ని ముఖ్య విషయాలను గుర్తు చేసింది. "ఇది హిందూ వారసత్వ చట్టం. హిందూ అంటే ఏమిటి, హిందూ సమాజం ఎలా నియంత్రించబడుతుంది, దాని అర్థం ఏమిటో దయచేసి గుర్తుంచుకోండి. మీరు ఆ పదాలను ఉపయోగించడానికి ఇష్టపడకపోవచ్చు కానీ కన్యాదానం జరిగినప్పుడు ఒక మహిళకు గోత్రం మారుతుంది, పేరు మారుతుంది. ఆమెభర్తనుంచి జీవన భృతిని కోరగలదు" అని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ నాగరత్న దక్షిణ భారతదేశంలోని కొన్ని సంప్రదాయాలనుకూడా ప్రస్తావించారు. "దక్షిణ భారత దేశంలో జరిగే వివాహాలలో.. ఒకగోత్రం నుంచి మరొక గోత్రంలోకి మారుతున్నట్లు ఆచారబద్ధంగా ప్రకటిస్తారు. మీరు ఈ వాస్తవాలన్నింటినీ విస్మరించలేరు" అని ఆమె అన్నారు. ఒక మహిళ వివాహం చేసుకున్న తర్వాత చట్టం ప్రకారం ఆమె బాధ్యత భర్త, అతని కుటుంబంపై ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆమె తన తల్లిదండ్రుల లేదా తోబుట్టువుల నుంచి జీవన భృతిని కోరలేదని గుర్తు చేసింది. ఒకమహిళ వివాహం చేసుకుంటే..చట్ట ప్రకారం ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. అలాగే భర్త, అత్తమామలు, పిల్లలు, భర్త కుటుంబమే ఉంటుందని కోర్టే సమాధానం కూడాచెప్పింది. ఆమె తన సోదరుడిపై జీవన భృతి పిటిషన్ దాఖలు చేయలేదని కూడా వ్యాఖ్యా నించింది. ఒకమహిళకు పిల్లలు లేనట్లయితే.. ఆమె ఎప్పుడైనా వీలునామా రాసుకోవచ్చని జస్టిస్ నాగరత్న తెలిపారు. ఈ చట్టం అన్యాయం, వివక్షతో కూడుకున్నదని సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదించారు. "ఒక పురుషుడు వీలునామా లేకుండా మరణిస్తే.. అతని ఆస్తి అతని కుటుంబానికి చెందుతుంది. మరి ఒకమహిళ పిల్లలులేనప్పుడు ఆమె ఆస్తి కేవలం ఆమె భర్త కుటుంబానికి మాత్రమే ఎందుకు చెందాలని ఆయన ప్రశ్నించారు. ఈ వాదనపై ధర్మాసనం స్పందిస్తూ న్యాయనిర్ణయాల ద్వారా వేల సంవత్సరాలుగా ఉన్న సంప్రదాయాలను మార్చడం సరికాదని హెచ్చరించింది.

# పెళ్లికోసమే మతమార్పిడి అయితే చెల్లదు!

## అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు



**అలహాబాద్, సెప్టెంబరు 25:** వివాహం కోసం జరిపే మతమార్పిడి చట్టవిరుద్ధమని తేలితే, ఆ వివాహానికి ఎలాంటి చట్టబద్ధత ఉండదని అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అలాంటి పెళ్లి దానంతట అదే రద్దయిపోతుందని, చట్టం దృష్టిలో వారు భార్యాభర్తలుగా పరిగణించబడరని స్పష్టం చేసింది. ఒక జంట వివాహానికి సంబంధించిన కేసులో ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. హిందూ మతానికి చెందిన చంద్రకాంత, ముస్లిం మతానికి చెందిన మహమ్మద్ బిన్ కాసీం అలియాస్ అక్బర్ ప్రేమించుకున్నారు.

పెళ్లి చేసుకోవడం కోసం చంద్రకాంత ఇస్లాం మతంలోకి మారినట్లుగా ఓ సర్టిఫికెట్‌ను సృష్టించారు. ఖాన్‌కారే ఆలియా అరిఫీయా అనే సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఈ ధ్రువపత్రం జారీ చేసినట్టుగా ఉంది. దాని ఆధారంగా మే 26న ఖాజీ వారికి ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు. అయితే, తమ కుమార్తెను మభ్యపెట్టి, నకిలీ సర్టిఫికెట్‌తో మతం మార్చి పెళ్లి చేసుకున్నారని చంద్రకాంత తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు, తమ వివాహంలో ఎవరూ జోక్యం చేసుకోకుండా ఆదేశాలుఇవ్వాలని కాసీంకూడా పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం అసలు నిజాన్ని రాబట్టింది. విచారణలో భాగంగా ఖాన్‌కారే ఆలియా అరిఫీయా సంస్థను కోర్టు వివరణ కోరగా, తాము చంద్రకాంతకు ఎలాంటి మతమార్పిడి సర్టిఫికెట్‌ను జారీ చేయలేదని ఆ సంస్థ కార్యదర్శి స్పష్టం చేశారు.

దీంతో సమర్పించిన ధ్రువపత్రం నకిలీదని నిర్ధారణ అయింది. దీని ఆధారంగా మతమార్పిడే చట్టవిరుద్ధమైనప్పుడు, దానిపై ఆధారపడి జరిగిన వివాహం కూడా చెల్లదని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అయితే, ఆ జంట కలిసి జీవించాలనుకుంటే మరో మార్గం ఉందని కోర్టు సూచించింది. మతమార్పిడి అవసరం లేని ప్రత్యేక వివాహ చట్టం కింద వారు తమ పెళ్లిని రిజిస్టర్ చేసుకోవచ్చని, దాని ద్వారా తమ బంధానికి చట్టబద్ధత కల్పించుకోవచ్చని న్యాయస్థానం మార్గం చూపింది.

# ఐరాసలో నాకు అవమానం..

## దర్యాప్తుకోసం సీక్రెట్ సర్వీస్‌కు ట్రంప్ ఆదేశం



**న్యూయార్క్, సెప్టెంబరు 25:** ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు వెళ్లే క్రమంలో ఎదురైన చేదు అనుభవాలపై ట్రంప్ సీరియర్‌గా స్పందించారు. సీక్రెట్ సర్వీస్ దానిపై దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు చేశారు. ఈ విషయాన్ని ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'ఐరాసలో నిన్న నాకు అవమానం జరిగింది. ఒక్కసారి, రెండుసార్లు కాదు.. ఏకంగా మూడు దురదృష్టకర ఘటనలు జరిగాయి. తొలుత పైకి వెళుతున్న ఎస్కలేటర్ ఆగిపోయింది. ఆ తర్వాత టెలిప్రాంప్టర్ పని చేయలేదు. అది దాదాపు 15 నిమిషాలు ఆగిపోయింది. కానీ, నా ప్రసంగానికి అద్భుతమైన రివ్యూలు వచ్చాయి' అని పేర్కొన్నారు. ఇక ఆడిటోరియంలోని సౌండ్ సిస్టమ్ ఘోరంగా ఉందని ఎద్దేవాచేశారు. తాను మాట్లాడిన తర్వాత భార్య మెలానియా వైపు చూడగా.. ఆమె ఒక్క ముక్క కూడా వినిపించలేదని పేర్కొన్నారు. ఇది ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఈ మూడూ ఉద్దేశపూర్వకంగా చేసినవే అని పేర్కొన్నారు. ఈలోపాలపై దర్యాప్తు చేపట్టాలని ఐరాస సెక్రటరీ జనరల్‌కు లేఖ రాస్తానని చెప్పారు. దీనిలో సీక్రెట్ సర్వీస్‌ను భాగస్వామి చేయాలన్నారు. అయితే దీనిపై ఐరాస ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ స్పందిస్తూ.. అమెరికా అధ్యక్షుడి బృందంలోని ఓ విడియోగ్రాఫర్ ట్రంప్-మెలానియాను ఎదుటినుంచి చిత్రీకరిస్తూ ఎస్కలేటర్ సేఫ్టీ వ్యవస్థను పొరబాటున నొక్కి ఉండొచ్చని తమ దర్యాప్తులో భావిస్తున్నామన్నారు. భార్య మెలానియాతో కలిసి సర్వప్రతినిధి సభకు వచ్చిన ఆయన.. సమావేశ ప్రాంగణానికి చేరుకునేందుకు ఎస్కలేటర్ ఎక్కారు.

వారిద్దరూ అలా అడుగుపెట్టారో, లేదో ఆ యంత్రం హఠాత్తుగా ఆగిపోయింది. వారు కాస్త తూలినట్లయ్యారు. దీంతో ఒక్క క్షణం అంతా బిత్తరబోయారు. మెలానియా కాస్త చొరవగా మెట్లెక్కి వెళ్లారు. ఆమె వెంటే ట్రంప్ అడుగులు వేశారు. ఈ విషయాలను ఆయన సమావేశంలో ప్రస్తావించారు. 'ఈ రోజు రెండు విషయాలు ప్రతికూలంగా జరిగాయి. ఒకటి చెత్త ఎస్కలేటర్.. రెండోది పనిచేయని టెలిప్రాంప్టర్. థాంక్యూ వెరీమచ్' అంటూ వ్యంగ్యంగా ప్రసంగాన్ని ప్రారంభించారు.

## జుబిన్‌గార్గ్ మృతిపై సమగ్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు: అసోం సిఎం మహంత

**గువాహతి, సెప్టెంబరు 25:** అస్సామీ గాయకుడు జుబిన్‌గార్గ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించేందుకు అస్సాం ప్రభుత్వం 10 మంది సభ్యులతో సిట్ ఏర్పాటుచేసింది. సిఐడి స్పెషల్ డైరెక్టర్ జనరల్ ఎంపి గుప్తా ఈ సిట్‌కు నేతృత్వం వహిస్తారు. నిర్దిష్టమైన వ్యవధిలోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ ఆదేశాలు జారీచేసారు. గార్గ్ మృతికి సంబంధించి ఎవరి ప్రమేయం ఉన్నప్పటికీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. గార్గ్ మృతదేహంనుంచి సేకరించిన నమూనాలను సిఎఫ్ఎస్ఎల్‌కు పంపించామని సమగ్ర పరీక్షల నివేదిక వచ్చినతర్వాత మరింత వేగం పుంజుకుంటుందన్నారు. సిట్‌కు దర్యాప్తులో పూర్తిస్వేచ్ఛనిస్తున్నట్లు తెలిపారు. గార్గ్ తన స్నేహితులు, సహచరులతో ఈత కొడతుండగానే సముద్రంలో మునిగి చనిపోయారని చెపుతున్నారు. ఇందుకు సంబంధించి అస్సాంరాష్ట్రం మొత్తంగా కనీసం 54 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీనితో సిఎం గార్గ్ మృతిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. గాయకుడు, గీతరచయిత, నటుడు, చిత్రనిర్మాత అయిన 52 ఏళ్ల జుబిన్‌గార్గ్ ఈనెల 19 నుంచి 22వరకూ ఈశాన్య ఉత్సవాలు నిర్వహించేందుకు సింగపూర్‌కు వెళ్లారు. అస్సాం పారిశ్రామికవేత్త శ్యాంకను మహంతా ఈ వేడుకలను నిర్వహించారు. ఆరోగ్యం సజావుగా లేకున్నా గార్గ్‌ను ఈతకొట్టేందుకు ఎవరు అనుమతించారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సిట్‌దర్యాప్తుపై గార్గ్ సతీమణి, ఫ్యాషన్ డిజైనర్ గరిమా సైకియా గార్గ్ స్పందించారు. అస్సాం ప్రభుత్వం, దర్యాప్తుపైనా తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు.

# సంక్షిప్తంగా..

## ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడికి ఐదేళ్లు జైలు, లక్ష యూరోల జరిమానా



**పారిస్, సెప్టెంబరు 25:** ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అంతర్జాతీయ వేదికపై లిబియా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి బదులుగా అక్రమ నిధులు పొందడానికి గడాఫీతో ఒప్పందం కుదుర్చుకున్నారని సర్కోజీపై ఆరోపణలొచ్చాయి. చట్టవిరుద్ధమైన నిధులపై లిబియాతో నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు పారిస్ కోర్టుగా దోషిగా తేల్చింది. ఐదేళ్ల జైలు విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది.లక్ష యూరోల జరిమానా విధించింది. అవినీతితో సహ ఇతర ఆరోపణల నుంచి సర్కోజీని నిర్దోషిగా ప్రకటించారు. గడాఫీతో అలాంటి ఒప్పందం కుదుర్చుకున్నారని లేదా లిబియా పంపిన డబ్బు సర్కోజీ ప్రచార ఖజానాకు చేరుకుందని అనడానికి ఎటువంటి రుజువు లేదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. నికోలస్ సర్కోజీకి శిక్ష విధించడంఅంటే, అతను అప్పీలు దాఖలు చేయాలావద్దా అనే దానితో సంబంధం లేకుండా సర్కోజీ జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. కోర్టు తీర్పు అనంతరం నికోలస్ సర్కోజీ మీడియాతో మాట్లాడుతూ, తాను నిర్దోషినని, కోర్టు తనకు ఐదేళ్ల జైలు శిక్ష విధించిన తీర్పుపై అప్పీలు చేస్తానని అన్నారు.

## ఇండియాకు పెద్ద అభిమానినే కానీ..: అమెరికా మంత్రి క్రిస్‌రైట్

**న్యూయార్క్, సెప్టెంబరు 25:** తమ అద్భుత మిత్ర దేశమైన భారత్‌తో అమె రికా ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకుంటున్నట్లు అగ్రరాజ్య ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ తెలిపారు. ఉభయ దేశాల మధ్య ఇంధన, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసే అంశంపై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో చర్చించినట్లు వెల్లడించారు. న్యూయార్క్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్రిస్ రైట్ ఈ వ్యాఖ్యలుచేశారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. 'నేను భారత్‌కు పెద్ద అభిమానిని. ఆ దేశమంటే మాకు చాలా ఇష్టం. ప్రపంచం లోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింత పెంచుకునేందుకు మేం ఎదురుచూస్తున్నాం. అయితే, ప్రస్తుతం ఆ దేశం మరో విషయంలో (రష్యా చమురు కొనుగోలును ఉద్దేశిస్తూ) చిక్కుకుంది' అని క్రిస్ రైట్ అన్నారు.

## మిగ్ - 21 వీడ్కోలులో స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** వాయుసేన తన ఒకప్పటి తురుపుముక్క మిగ్-21 ఫైటర్ జెట్లకు ఘనంగా తుది వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ పేరు వార్తల్లో నిలిచింది. వాయుసేన చీఫ్ ఎపి సింగ్‌తో పాటు చివరి సార్టిలో పాల్గొనే పైలట్లలో ఈమె కూడా ఒకరు. సెర్మోనియల్ ఫ్లైపాస్ట్‌కు నిర్వహించిన రిహార్సల్స్‌లో ప్రియాశర్మ పాల్గొన్నారు. పాంథర్స్‌గా పిలిచే 23వ స్క్వాడ్రన్‌కు చెందిన మిగ్-21లు దీనిలో పాల్గొననున్నాయి. రాజస్థాన్‌లోని ఝున్‌ఝున్‌ను జిల్లాకు చెందిన ప్రియ ఇంజనీరింగ్ తర్వాత తండ్రి అడుగుజాడల్లోనే నడిచి వాయుసేనలో చేరారు. తన బ్యాచ్‌లో ఆమె ఒక్కరే మహిళ కావడం విశేషం. 2018లో 2018లో దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ప్రియాశర్మ గ్రాడ్యుయేషన్ చేశారు.

## పదిరోజుల్లో కేజివాల్‌కు ఇంటిని కేటాయిస్తాం: కేంద్రం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు పది రోజుల్లోగా ప్రభుత్వ నివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు తెలియజేశారు. గురువారం వర్చువల్‌గా కోర్టు విచారణకు హాజరైన ఆయన జస్టిస్ సచిన్ దత్తాకు హామీ ఇచ్చారు. 'ఈరోజు నుంచి పది రోజుల్లోగా ఆయనకు (కేజ్రీవాల్) తగిన వసతి కేటాయిస్తాం. మీరు నా స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయవచ్చు' అని అన్నారు. కాగా, 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవినుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీచేశారు. నాటినుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీసభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు.

## హాస్టల్ భవనంపైనుంచి దూకి ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**పాట్నా, సెప్టెంబరు 25:** ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రిన్సిపాల్ వేధిస్తున్నట్లు విద్యార్థులుఆరోపించారు. బీహార్ రాజధాని పాట్నా సమీపంలోని చాంది ఇంజినీరింగ్ కాలేజీలో ఈ సంఘటనజరిగింది. ముంగేర్ జిల్లాలోని బరియార్‌పూర్ బ్లాక్‌కు చెందిన ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని 20 ఏళ్ల సోనమ్ కుమారి సివిల్ ఇంజనీరింగ్ చదువుతోంది. బుధవారంరాత్రి హాస్టల్ బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ నందన్, స్టూడెంట్లను వేధించడంతోపాటు బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. సోనమ్ రక్తం మడుగుల్లో అరగంట పడి ఉన్నప్పటికీ కాలేజీవాహనంలో ఆమెను హాస్పిటల్‌కుతరలించేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించినట్లు విమర్శించారు.తర్వాత స్థానికఆసుపత్రికి తరలించగా అప్పటికేఆమెమరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు.

# సింధుజలాలు ఉత్తరాదికి మళ్లించే భారీ ప్రాజెక్టుకు శ్రీకారం



## డిపిఆర్ తయారీ ఎల్‌అండ్‌టికి అప్పగింత

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ఉత్తరాది రాష్ట్రాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింధూ నదీ వ్యవస్థలో భారీ మార్పులకు కేంద్రంలో మోడీ సర్కారు సిద్ధమైంది. సింధూ నదిపై భారీ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి 2029 ఎన్నిలకు ముందే సిద్ధం చేసే దిశగా అడుగులు వేస్తోంది. సింధూ నది వ్యవస్థలో భాగమైన సింధు, దాని ఉపనది బియాస్‌ను కలుపుతూ 14 కి.మీ పొడవైన సొరంగం నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధమవుతోంది. ప్రాజెక్ట్ సమగ్రనివేదిక తయారీ బాధ్యతలను ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ లార్సెస్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి)కి అప్పగించారు. మొత్తం 113 కి.మీ. పొడవైన కాల్వ ద్వారా సింధూ నది జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించే అంశాన్ని కూడా సమీక్షించినట్టు తెలుస్తోంది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య 1960లో సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి తర్వాత 'నీళ్లు, రక్తం కలిసి ప్రవహించలేవు' అని పేర్కొంటూ ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా భారత్ నిలిపివేసింది. అప్పటి నుంచి సింధూ నదీ జలాల వాటాను పూర్తిగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇవి కార్యరూపం దాల్చేలా ఇంటర్ బేసిన్ సింధు జలాల బదిలీ పథకం కింద ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ అత్యున్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో అత్యంత సవాల్‌గా నిలిచేది 14 కిలోమీటర్ల సొరంగం నిర్మాణం అని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాంటి సొరంగానికి పర్వత రాళ్లపై సవివరంగా అధ్యయనం అవసరం ఉంటుంది. రాళ్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో సొరంగాన్ని పైపుల ద్వారా వేయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వానికి డీపీఆర్ నివేదిక అందిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. త్వరగా, సురక్షితంగా సొరంగ తవ్వకానికి బోరింగ్ మెషీన్లు, రాక్ షీల్డ్ టెక్నాలజీని వినియోగించాలని ప్రతిపాదించారు. జమ్మూ కశ్మీర్ కథువా జిల్లాలోని ఉఝా బహుళార్థకసాధక ప్రాజెక్ట్‌కు ఈ సొరంగాన్ని అనుసంధానం చేసి, రావి ఉపనది ఉఝా నదినుంచి నీటిని బియాస్ బేసిన్‌లోకి తరలిస్తారు. ఈ సొరంగంతో రావిబియాస్ సుట్లెజ్ వ్యవస్థ సింధు బేసిన్‌తో అనుసంధానమవుతుంది. దీని ద్వారా సింధూ నది జలాల్లో భారత్ తన వాటాను గరిష్టంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. అధికార వర్గాల అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి మూడు నుంచి నాలుగేళ్లు పడుతుందని, 2028 నాటికి సిద్ధం కావచ్చని అంటున్నారు. దీనికి రూ.నాలుగునుంచి ఐదువేల కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా.



# బతుకమ్మకుంట పునరుద్ధరణ శభాష్

### మంత్రి కొండా సురేఖతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో గురు వారం సచివా లయంలోని అటవీ శాఖ మంత్రి ఛాంబర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ అయ్యారు. బతుకమ్మ కుంట పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంత్రి సురేఖ అభినందించారు. బతుకమ్మకుంట పునరుద్ధరణకు శభాష్ అంటూ కితాబు ఇచ్చారు. అయితే, తన పరిధిలో ఉన్న ఎండోమెంట్సు శాఖలోని భూముల పరిరక్షణకు హైడ్రా సాయం అవసర మని మంత్రి గుర్తు చేయగా... సీఎం అనుమతితో చర్యలు తీసుకుంటామని రంగనాథ్, మంత్రి సురేఖకు వివరణ ఇచ్చారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిక్షించేందుకు ఇప్పటికే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. అందు కోసం ప్రభుత్వ పరంగా... శాఖ పరంగా కావాల్సిన సాంకేతిక అంశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. హైడ్రా వచ్చాక చేపట్టిన పనుల వివరాలను రంగనాథ్... మంత్రికి సమ గ్రంగా వివరించారు. అయితే, మంచి పనులు చేసే సందర్భంగా కొన్ని ఇబ్బందులు ఎదురవు తాయని... కానీ, సామాజిక ప్రయోజనంలో భాగంగా చేశారని మంత్రి సురేఖ కొనియాడారు. హైడ్రా చేస్తున్న పనులు రానున్న కాలంలో అందరికీ తెలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వరంగల్ నాలాల ఆక్రమణలను కూడా రంగనాథ్‌తో చర్చించారు. వాటిని పరిష్కరించేందుకు తమకు సహకరించాలని అన్నారు. అందుకు ఆయన సుముఖత తెలిపారు. కాగా, బతుకమ్మ కుంట వేడుకలకు మంత్రి సురేఖను, రంగనాథ్ ఆహ్వానించారు.

# సీడ్‌బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా దేశంలోనే తెలంగాణ గుర్తింపు పొందిందని వ్యవ సాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భవిష్యత్తులో గ్లోబల్ సీడ్ క్యాపిటల్‌గా నిలుస్తుంద న్నారు. హైదరాబాద్‌లో గురువారం మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల తయారీలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రతి ఏటా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న కోటి క్వింటాళ్ల విత్తనాల్లో 75 లక్షల క్వింటాళ్లు వరి, 10 లక్షల క్వింటాళ్లు మొక్కజొన్న, మరో 10 లక్షల క్వింటాళ్లు జొన్నలు, చిరుధాన్యాలుగా ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం దాదాపు 8 లక్షల ఎకరాల్లో విత్తన ఉత్పత్తి సాగుతో పాటు, 3.5 లక్షల మంది రైతులు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం రూ.2 వేల కోట్ల విలువైన లక్ష టన్నుల విత్తనం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతుందని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాల వలన అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యమైన తెలంగాణ విత్తనాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో 1.30 లక్షల ఎకరాల్లో సాగుతున్న ఆయిల్ ఫామ్, మరింత విస్తరించి రాష్ట్ర అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనుందని వివరించారు. నిజాయితీగా పనిచేసే విత్తన కంపెనీలను ప్రోత్సాహించడం, నకిలీ విత్తనాలనుంచి రైతులను రక్షించడం రెండూ ముఖ్యమన్నారు. ఈ లక్ష్యాల సాధనకు విత్తన చట్ట సవరణలు తీసుకొస్తున్నామని, ప్రస్తుతం అవి ముసాయిదా దశలో ఉన్నాయని వెల్లడించారు. విత్తన పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామన్నారు. వాతావరణ మార్పులకు తట్టుకునే కొత్త హైబ్రిడ్ అభివృద్ధికి పరిశోధనలో పెట్టుబడులు పెంచాలని, ఆహార ధాన్యాలే కాకుండా ఉద్యానపంటలకు ముఖ్యంగా అధిక దిగుబడి ఇచ్చే కూరగాయ విత్తనాలను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో గురువారం మాట్లాడు తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# విద్యుత్ శాఖలో మూడు వేల పోస్టుల భర్తీ

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనుంది. ఇప్పటి వరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో సంబంధం లేకుండా ఆయా సంస్థల నుంచి వేరువేరుగా జాబ్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. అయితే, ప్రస్తుతం విద్యార్థుల ప్రయోజనార్థం కామన్ నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మొత్తం మూడు వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం నాలుగు విద్యుత్ సంస్థల్లో 934 ఖాళీలు న్నాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్)లో 394, ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ (టీజీ ట్రాన్స్‌కో)లో 122 పోస్టులు తెలంగాణ స్టేట్ పవర్ జెనరేషన్ కార్పొరేషన్ (టీజీ జెన్‌కో)లో 283, దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎస్పీడీసీఎల్)లో 135 ఉన్నాయి. ఇవే కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం చివరి దశకు వస్తుండటం, రామగుండంలో థర్మల్, ఇతర ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ కేంద్రాల నిర్మాణ ప్రతిపాదనలు ఉండటంతో భారీగా ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొన్నేళ్లుగా కిందిస్థాయి సిబ్బంది నియామకాలను చేపట్టడంలేదు. ముఖ్యంగా వానాకాలంలో సరిపడా సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. ప్రస్తుతం నాలుగు విద్యుత్ సంస్థల్లో 934 ఖాళీలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు అన్ని స్థాయిల కలిపితే రాష్ట్రంలో విద్యుత్ సంస్థల పరిధిలో 3 వేలకుపైగా పోస్టులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# అంతరాల తొలగింపునకు బిఎస్‌కెతో ఎంతో ఉపయోగం

### సిసిఐ ఇండియా డైరెక్టర్ జనరల్ మునీంద్రకుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** సమాజంలో అంతరాలను తొలగించేందుకు భారత్ సేవా కేంద్ర (బిఎస్‌కె)ఎంతగానో ఉపయో గడ పడుతుందని సిసిఐ( చాంబర్‌ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) ఇండియా డైరెక్టర్ జనరల్ మునీంద్రకుమార్ అన్నారు. ఆయన గురువారం ఆయన ఢిల్లీలో బిఎస్‌కెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశంలోని ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామీణ సమాజాల మధ్య అంతరాన్ని తగ్గిం చేందుకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ప్రాధాన్యత, సామర్థ్యం ఆధారంగా సాధికారత అనే పునాదిపై నిర్మించబడిన బిఎస్‌కె 2.5 లక్షల సర్పంచ్‌లు 6.5 లక్షల సారథులతో కూడిన బలమైన నెట్‌వర్క్‌తో కూడిన ప్రతిష్ఠాత్మకమైన సంస్థగా పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో వారు సేవ చేసేందుకు ప్రజల మధ్య అంతరాన్ని తగ్గించడంలో బిఎస్‌కె కీలక పాత్ర పోషిస్తారన్నారు. దృఢమైన దృష్టితో, ఆర్థిక సహాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, డిజిటల్ సాధికారత, ఉపాధి , వ్యవసాయ పురోగతి వంటి ముఖ్యమైన సేవలు దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాలకు కూడా చేరేలా బిఎస్‌కె ప్రణాళికలు వేస్తోంద న్నారు. దీంతో ఆర్థిక సహాయం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ పురోగతితో సహా, దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాలకు కూడా చేరుతుందన్నారు. బిఎస్‌కె వ్యూహాత్మక కార్య క్రమాలతో ఆర్థిక సామాజిక పరివర్తనను నడిపిం చడంలో సిసిఐ ఇండియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దీనికి గలనాలుగు ప్రధాన ఆదేశాలలో విధానపరమైన వాదన, సృష్టమైన వ్యాపార విస్తరణ. వ్యూహాత్మక సహకారాలు, ఎట్టుబడి, నిధుల మద్దతు ఉన్నాయన్నారు. బిఎస్‌కె కేవలం ఒక సేవా ప్రదాత మాత్రమే కాదు, మార్పుకు దోహదపడేదన్నారు. ఆర్థిక చేరిక నుండి నైపుణ్యం, డిజిటల్ అక్షరాస్యత వరకు ప్రతి అడ్డంకులను ఛేదించడానికి, స్వావలంబన అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు రూపొందించినట్లు చెప్పారు. మేము సేవలను అందించడం మాత్రమే కాదు, మేము ఆకాంక్షలను, ప్రతిభను పెంపొందిస్తు న్నామన్నారు. అంతే కాకుండా బలమైన, మరింత స్థితిస్థాపక భారతదేశానికి పునాది వేస్తున్నా మన్నారు. ప్రతి పౌరుడు వారి అభ్యున్నతి కోసం రూపొందించిన విధానాలు, పథకాల నుండి ప్రయోజనం పొందేలా చూసుకోవడంలో సిసిఐ కట్టుబడి ఉందన్నారు.తెలిపింది. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయడం ద్వారా, బిఎస్‌కె ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అధికారికంగా సమస్యలను తొలగిం చేందుకు ఒక సింగిల్ విండో ప్లాట్‌ఫామ్‌గా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# పునరుద్ధరించిన బతుకమ్మకుంటకు నేడు సిఎం రేవంత్ ప్రారంభం

### మాజీ పిసిసి అధ్యక్షుడు విహెచ్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** కెసిఆర్ అనుచరుడి కబ్జానుంచి విముక్తిచేసి పునరుద్ధరిం చబడిన బతుకమ్మకుంటను శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించను న్నారని మాజీ పిసిసి ప్రసిడెంట్ మాజీ ఎంపి వి. హనుమంతరావు తెలిపారు. గాంధీ భవన్‌మాజీ ఎంపీ హనుమంత రావు మాట్లాడుతూ బతుకమ్మ కుంటను కాపాడిని ఘనత సిఎం రేవంత్ రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు దక్కుతుందని అన్నారు.
రాజీవ్ గాంధీని ప్రధానిని చేయాలని ఆరోజు నేను కోరా ను. ఇప్పుడు రాహుల్‌గాంధీ కూడా ప్రధాని కావాలని కోరుకుంటున్నా, రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశ ప్రజలకు న్యాయం జరుగుతది అని ఆయన అన్నారు.
బతుకమ్మ కుంటను కాపాడాలని కెసిఆర్‌ను కలిసిన కానీ ఆయన అనుచరుడే కబ్జా చేశాడు కాబట్టిసప్పుడు చేయలేదని ఆరోపించారు. బతుకమ్మ కుంటను కాపాడడానికి పోరాటం చేసి సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మకుంటను కాపాడి పునరుద్ధరణ చేశాడు.
శుక్రవారం బతు కమ్మకుంటను సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్స వానికి మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలతో వచ్చి నీరాజనాలు పట్టాలని కోరారు.

# 30న అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ 26వ స్నాతకోత్సవం

### ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ప్రేమ్‌రావత్‌లకు గౌరవ డాక్టరేట్లు

### డిగ్రీలో 35, పిజిలో 51 బంగారు పతకాలు: విసి ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 30న నిర్వహించ నున్నారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఇగ్నో ఉపకులపతి ప్రొఫెసర్ ఉమా కాంజీలాల్ హాజరుకానున్నట్టు వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు.
స్నాతకోత్సవ వివరాలను ఆయన గురువారం యూనివర్సిటీ క్యాంపస్‌లో మీడియా సమావేశంలో వివరిం చారు. ప్రజా కవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ప్రముఖ విద్యావేత్త ప్రేమ్‌రావత్‌లకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నట్టు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. డిగ్రీలో 35, పీజీలో 51 బంగారు పతకాలు, ఇద్దరు ఖైదీలకు బంగారు పతకాలను ఇవ్వనున్నట్టు చెప్పారు.
గవర్నర్, విశ్వ విద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ స్నాత కోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. విద్యా ర్థులకు ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలను, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యా ర్థులకు బంగారు పతకాలు, బుక్ ప్రైజ్‌లను అందించనున్నట్లు వివరించారు. 26వ స్నాతకో త్స వంలో 60,288 మంది అభ్యర్థులు తమ డిగ్రీలు, డిప్లొమా సర్టిఫికెట్లు పొంద నున్నట్లు వెల్ల డించారు. 26వ స్నాతకోత్స వంలో భాగంగా అండర్ గ్రాడ్యు యేట్‌లో 35,346 మంది, పోస్ట్‌గ్రాడ్యు యేట్‌లో 24,942 మంది సర్టిఫికెట్స్ అందుకోనున్నారు. వివిధ జైళ్లలో విద్యభ్యసించిన 203 మంది ఖైదీ అభ్యర్థులు డిగ్రీలు పట్టాలు పొందనున్నారు.

# గ్రూప్ 1 నుంచి ఎక్సైజ్ శాఖకు 30 పోస్టులు కేటాయింపు

### ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలిస్తున్న అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు గ్రూప్-1 నుంచి 30 మంది ఎంపకయ్యారు. ఎక్సైజ్ శాఖకు ఎంపికైనా ఏఈఎస్‌లుగా ఎంపి కైన 30 ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన గురు వారం అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో జరిగింది. సర్టిఫికెట్లను రంగారెడ్డి ఏఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జీవన్ కిరణ్, హైదరాబాద్ డివి జన్ నుంచి గీతాంజలీలు పరిశీలించారు.

# పాలిథిన్ పైపులు, ఉత్పత్తుల పరిశ్రమపై బిఐఎస్ దాడులు

### ధ్రువీకరణ లేని రూ.3 లక్షల విలువైన ఉత్పత్తుల జప్తు : డైరెక్టర్ శ్రీకాంత్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** బిఐఎస్ ధ్రువీకరించిన ఐఎస్ఐ మార్కు లేని ఉత్పత్తులను చేశారన్న సమాచారంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖ అధికా రులు రాంపల్లి, మేడ్చల్ మల్కా జిగిరి పరిశ్రమపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బీఐఎస్ ధ్రువీకరణ పొందని పాలిథిలిన్ పైపులు గుర్తించి సీజ్ చేసినట్లు బిఐఎస్ డైరక్టర్ పివి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరా బాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ ఆదేశాలతో బీఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ సుజాత తమ్మడి, డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ యమ్. శివాజీ, వి సురేందర్, అటెండర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రాంపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి లో ఉన్న ఓ పరిశ్రమలో బుధవారం బీఐఎస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా దాదాపు రూ.3 లక్షల పైగా విలువైన 2485 మీటర్లు ఉత్పత్తులకు బీఐఎస్ ధ్రువీకరణ లేదని గుర్తించినట్లు తెలిపారు. ఐఎస్ఐ మార్క్ లేని, నకిలీ ఐఎస్ఐ ముద్ర ఉన్న ఉత్పత్తులను జప్తు చేసినట్లు వెల్ల డించారు. వీటిలో 32 ఎంఎం, 40 ఎంఎం, 75ఎంఎం పైపులు తదితర వస్తువులను జప్తు చేసి కేసు నమోదు చేయ నున్నట్లు వెల్లడిం చారు. బీఐఎస్ అనుమతి పొందకుండా వస్తు వులు తయారు చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని బీఐఎస్ హైదరాబాద్ శాఖాధి పతి పీవీ శ్రీకాంత్ వెల్లడించారు. భారతీయ ప్రమాణాలపై ప్రతీ ఒక్క వినియోగ దారుడూ అవగాహన కలిగి ఉండాలని, బీఐఎస్ కేర్ యాప్ ద్వారా వస్తువుల నాణ్యతా ప్రమా ణాలను గుర్తిం చాలని, ఉల్లంఘనలను గుర్తిస్తే అదే యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.



# 5 నుంచి ఎప్‌సెట్ బైపిసి కౌన్సెలింగ్

### 7 నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు ఎప్‌సెట్-2025 ద్వారా బి ఫార్మసీ, పార్మా-డి, బైయో టెక్నా లజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి కౌన్సె లింగ్‌ను అక్టోబర్ 5 నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబం ధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ప్రకటించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను తెలుపుతూ స్లాట్ బుక్ చేసుకోవడానికి అక్టోబర్ 5 నుంచి 8 వరకు అవకాశం కల్పించారు.
అక్టోబర్ 7 నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. అక్టోబర్ 8 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 13న మొదటి విడత సీట్ల కేటాయింపు చేశారు. సీటు పొందిన విద్యార్థులు అక్టోబర్ 13, 14 తేదిల్లో ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ అక్టోబర్ 16 నుంచి ప్రారంభం కానుంది. అక్టోబర్ 17న సర్టిఫికెట్‌వెరిఫికేషన్ ఉంటుంది. అక్టోబర్ 17, 18 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 21లోగా ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన విద్యార్థులు అక్టోబర్ 21, 22 తేదిల్లో ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 22, 23 తేదిల్లోగా సీట్లు పొందిన విద్యార్థులు నేరుగా కాలేజీల్లో చేరాలని కమిషనర్ సూచించారు. అక్టోబర్ 24న కాలేజీల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను ఆయా కాలేజీలు అప్‌డేట్ చేయాలని సూచించారు. అక్టోబర్ 23న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయనున్నట్టు కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో పేర్కొన్నారు.





న్యాయవాదుల దీక్షలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్

# న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

### ధర్నా చౌక్‌లో అడ్వొకేట్ల దీక్ష

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** న్యాయవాదుల న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్య క్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో న్యాయవాదుల న్యాయ దీక్ష నిర్వ హించారు.
ఈ దీక్షకు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్‌నేత వి.హను మంత రావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్‌లు మద్దతు తెలిపి ప్రసం గించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం అమలుచేయాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు 15వేల రూపా యలు స్టైపెండ్ ఇవ్వాలని అన్నారు. న్యాయవాదులు కూడా పేదలను దృష్టి లో పెట్టుకుని, వారికి ఎక్కడైనా అన్యాయం జరిగితే అండగా ఉండి, పేదల పక్షాన పోరాడాలని సూచించారు. అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ అర్హులైన న్యాయవాదులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# గొప్ప ఊహాజనిత వాక్యం లేకుండా ఆధునిక కవిత్వం రాదు

### రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** కవిత్వమంటే గొప్ప ఊహాజనితమైన వాక్య మెరుపు లేకుండా ఆధునిత కవిత్వం వచ్చే అవకాశమే లేదని, వచ్చినా ఏమాత్రం నిలవదని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాల కుడు, సాహితీవేత్త డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. కవిత్వం కలలను పండిస్తుంది.. మనసులోపొంగే భావజాలాన్ని ఉసిగొల్పుతుంది... వేలయేళ్ల చరిత్రలోని మూలాలను పెకిలి స్తుంది.. కలల్లోని అంతరంగాల్ని ఆవి ష్కరిస్తుంది. మరు గునపడిన కళలను మెరుగుపరుస్తుంది.. అని అత్యంత ఆశావహ దృక్పథంతో రాస్తూ ఉంటారని తెలిపారు. సృజన భారతి ఆధ్వర్యంలో నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో డా. టి.గౌరీశంకర్ సభాధ్యక్షతన జరిగిన గ్రంథావిష్కరణకు ముఖ్యఅతిథిగా నరసింహారెడ్డి విచ్చేశారు. విశిష్ట అతిథులు డా. ఎం.కె.రాము, రచయిత నార కృష్ణమూర్తి రాపర్తి సురేందర్ కుమార్, డా. శరత్‌జ్యోత్స్నారాణి, తాళ్ల నిరంజన్‌గౌడ్, జాలాది రత్నసుధీర్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కొమ్మూరి ప్రసాద్ తదితరులతో కలిసి చేజారిన జీవనగమ్యం కవితా సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. కృష్ణమూర్తి చేజారిన జీవనగమ్యంలో చైతన్యం నుండి వచ్చిన కవితలు న్నాయని, ముఖ్యంగా టైటిల్ పద్యం 17పేజీల దీర్ఘకవిత అద్భుతమన్నారు. జనాభా లెక్కల్లో నాపేరు తొలగించారు.. నేను బతికుండగానే నాభూమిని ఎవరో అమ్మేశారు... అధికారులనడిగితే నీవు కాగితాల్లో మరణిం చావన్నారు... సాక్ష్యం చెల్లదాయే, న్యాయం దొరకదాయె, శోకం ఆగదాయె, ఆకలి తీరదాయె, ఆలోకంలో ధర్మమెక్కడో తెలువనే తెల్వదాయె అనే ఇందులోని జనాభా లెక్కలు కవితను వినిపించి ఆహుతులను మైమరపించారు. చివరిగా ఒక ప్రభుత్వ బాధ్యతాయుత అధికారిగా ఉండి కవి కావడం చాలా కష్టమని, అయినా కవిగా నిలదొక్కుకున్న నార కృష్ణమూర్తిని హృదయపూర్వకంగా అభినందిస్తునని అన్నారు.




చేజారిన జీవనగమ్యం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి, గౌరీశంకర్, కృష్ణమూర్తి, రాము, ప్రసాద్ తదితరులు

# పోతిరెడ్డిపల్లిలో వ్యక్తి మృతి, తీవ్రఉద్రిక్తత

### భూమి రిజిస్ట్రేషన్ కోసం పెద్దఎత్తున ఆందోళన

### పది రోజుల్లో పరిష్కరిస్తామనడంతో సద్దుమణిగిన గొడవ

**చేర్యాల, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** అప్పు కింద భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి తన పేరిట చేయకపోవడంతో మనస్తాపానికి గురై గుండె పోటుతో వ్యక్తి మృతి చెందాడని అతడి కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్థులతో కలిసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి ఇంట్లో మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేయడంతో పోతిరెడ్డిపల్లిలో ఉద్రిక్త వాతవరణం నెలకొంది. కుటుంబసభ్యులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన పోలోజు చంద్రం (43) అదే గ్రామానికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి దగ్గర నాలుగేళ్ల క్రితం రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని, దాని కింద పడమటి కేశ్వాపూర్ శివారులోని ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే మూడేళ్ల తర్వాత భాస్కర్‌రెడ్డి అప్పు గురించి అడగడంతో రూ.3లక్షలతో పాటు కొంతమిత్తిని కలిపి ఇస్తానని తీర్మా నించినట్లు తెలిపారు.
అయితే చంద్రం అందుకోసం మరికొంత సమయం కావలనడంతో భాస్కర్‌రెడ్డి నిరాకరించాడు. దాంతో మనస్తాపానికి గురైన చంద్రంను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం గుండెపోటుతో మృతిచెందడంతో పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుం బసభ్యులకు అప్పగిం చారు. భాస్కర్‌రెడ్డి వేధింపులే చంద్రం మృతికి కార ణమని మృతదేహాన్ని భాస్కర్ రెడ్డి ఇంటి ముందు ఉంచగా విషయం తెలు సుకున్న పోలీసులు సంఘ టనస్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను, గ్రామ స్థులను సము దాయించి పదిరోజుల తరువాత మాటా డుకుని మృతుడి కుటుంబానికి తిరిగి భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఒప్పందం కుదర్చడంతో గొడవ సద్దుమణిగింది.



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్థులు

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా భూభారతి టెక్నికల్ సిబ్బంది

### సర్కారుకు ఉద్యోగ జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యో గుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి చాలా సందర్భాల్లో విన్నవించామని, తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ టెక్నికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించిందన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.అంతే కాకుండా వీరికి ప్రతినెల రూ.21,446 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ నిర్ణయం తో రాష్ట్రవ్యాప్తంగా 708 మందికి మేలు జరుగుతుందని,ఎన్నో యేండ్లుగా అపరిష్క ృతంగా ఉన్న ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సమస్యను దసరా పండుగకు ముందు పరిస్కరించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన సిఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకి, సీసీఎల్‌ఏ కమిషనర్‌కి, రెవెన్యూ సెక్రటరీకి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్‌గౌడ్ కన్నుమూత

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్‌గౌడ్ కన్నుమూశారు. గురువారం నల్లకుంట, తిలక్‌నగర్‌లో ఆయన నివాసం ఉంటున్న ఇంట్లో తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు, సన్నిహితులు హుటా హుటిన సమీప ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆ తర్వాత ఆయన మృత దేహాన్ని సన్నిహితులు గాంధీ ఆసుపత్రికి అప్పగించారు. 'వొడువని ముచ్చట', 'నీళ్ల ముచ్చట' 'సర్వాయి పాపన్న చరిత్ర' తదితర పుస్తకాలను ఆయన రాశారు. వెంకట్ గౌడ్ మృతిపట్ల మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, నిరంజన్‌రెడ్డి, పిసిసి టాడీటాపర్ విభాగం ఉపాధ్యక్షులు నాసగోని రాజయ్యగౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘాల నేతలు బాలగోని బాలరాజుగౌడ్, ఐలి వెంకన్న తదితరలు సంతాపం వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ చైతన్యం కోసం వెంకట్‌గౌడ్ కృషి చేశారని కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన మృతి తెలంగాణ సాహిత్య రంగానికి తీరని లోటు అని హరీశ్‌రావు నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ తత్వం, ఉద్యమ భావజాలాన్ని కలంలో నింపుకొన్న రచయిత వెంకట్‌గౌడ్ అని కొనియాడారు.



కొంపెల్లి వెంకట్‌గౌడ్

# భారత్‌కు విత్తన అక్షయపాత్రగా తెలంగాణ ఎదగాలి

## వ్యవసాయ ఎగుమతులు, రైతుల ఆదాయం పెంచేదిశగా విత్తనం ఉండాలి

### తెలంగాణ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లా విత్తన కంపెనీలు ఎదగాలి

### నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** భారత్‌కు విత్తన అక్షయపాత్రగా తెలంగాణ ఎదగడానికి విత్తకంపెనీలు పరిశోధనలను బలోపేతం చేయడంతోపాటు, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను విస్తరించేలా నాణ్యతాప్రమాణాలు పాటించాలని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లో సీడ్స్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిల్వర్‌జూబ్లీ సందర్భంగా నిర్వహించిన హైదరాబాద్ విత్తన సదస్సు 2025లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ, సీడ్ కంపెనీలు దేశ నిర్మాతలు" అని వారికి రాష్ట్ర ప్రభుత్వ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలో నాణ్యమైన ఉత్పాదకాలలో విత్తనం అత్యంత ముఖ్యమైనదని అదే దిగుబడిని నిర్ణయిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మిగితా ఉత్పాదకాలు, భూమి, ఎరువులు, నీటి పారుదల దిగుబడి పరోక్షంగా సామర్థ్యాన్ని పెంచుతాయని విత్తనం సరిగా నాణ్యతగా ఉంటే రైతు ఆదాయం పెరగడానికి ఉపయోగపడు తుందని ఆయన వివరించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన ప్రశంసిస్తూ.. రోజూ వ్యవసాయం చేసే రాజకీయ నాయకుడిగా ఆయన ప్రత్యేకమైన వ్యక్తి అని అభివర్ణించారు. రైతుల కష్టాలను ఆయన బాగా అర్థం చేసుకుంటారని అన్నారు, ఆయన నాయకత్వంలో డిసెంబర్ 2023 నుండి ప్రతి ఖరీఫ్, రబీ సీజన్‌లో తెలంగాణ రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించింది' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ దేశంలో నంబర్ వన్ వరి ఉత్పత్తి రాష్ట్రంగా అవతరించిందని కూడా అన్నారు. సీడ్ కంపెనీలు పరిశోధన, అభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని, ముఖ్యంగా అధిక దిగుబడి ఇచ్చే కొత్త వరి రకాలను అభివృద్ధి చేయాలని పిలుపు నిచ్చారు. అన్ని పంటలలోనూ ఆవిష్కరణలు జరగాలి. అదే రైతుల ఆదాయాన్ని పెంచే మార్గం,' అని అన్నారు. తెలంగాణ సీడ్ పరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో విస్తరిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్‌కు ఇప్పటికే విత్తనాలు, బియ్యం ఎగుమతి చేస్తున్నామని ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, బుర్కినా ఫాసో, ఇతర ఆఫ్రికన్ దేశాలకు కూడా ఎగుమతుల ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విత్తనాల ఎగుమతికి గొప్ప అవకాశాలు ఉన్నాయి. మన సాఫ్ట్‌వేర్ పరిశ్రమ తెలంగాణ పేరు ప్రపంచానికి చేర్చినట్లే, మన సీడ్ పరిశ్రమ కూడా సరిహద్దులు దాటి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిపెట్టగలదు," అని అన్నారు. సీడ్ తయారీ కంపెనీలు ఎదుర్కొం టున్న సమస్యలన్నింటినీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. గతంలో వ్యవసాయ విశ్వ విద్యాలయాలు మాత్రమే మెరుగైన రకాల విత్తనాలకు మూలమని గుర్తు చేశారు. డిమాండ్ పెరిగిన తరువాత ప్రైవేట్ సీడ్ కంపెనీలు స్థాపించబడి, పరిశోధన, హైబ్రిడ్ అభివృద్ధిలో పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టాయి. వీటి ప్రయోజనాలను ప్రతినిధ్యం వహిస్తూ, ప్రభుత్వంతో సమన్వయం కల్పించేందుకు 1995లో హైదరాబాద్‌లో సీడ్స్‌మెన్ అసోసియేషన్ నమోదు చేయబడింది. చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ సంఘం ప్రస్తుతం 505 మంది సభ్యులతో ఉంది.

ఇందులో సీడ్ కంపెనీలు, అసోసియేట్ సభ్యులు, గౌరవ సభ్యులు ఉన్నారు. రెండేళ్ల పదవీ కాలానికి ఎన్నికయ్యే ఎగ్జిక్యూటివ్ కమిటీ విధాన మార్గ దర్శకత్వం వహిస్తుంది, క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తుంది. సభ్య సంస్థలు ప్రతి సంవత్సరం రూ.90 లక్షల నుండి రూ.1 కోటి వరకు వ్యవసాయ విశ్వ విద్యాలయాలకు బ్రీడర్ సీడ్ సరఫరా కోసం చెల్లిస్తాయి. దీని ద్వారా పత్తి, మొక్కజొన్న, వరి, పొద్దు తిరుగుడు, కూర గాయలలో వాణిజ్య హైబ్రిడ్ల ఉత్పత్తి సాధ్యమవుతోంది. ఈ సంఘం నోడల్ ఏజెన్సీగా కూడా పనిచేస్తుంది. బ్రీడర్ సీడ్ సరఫరా, నియంత్రణ నిబంధనల అనుసరణ, క్రమానుగత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలు, విత్తన ధృవీకరణ సంస్థ, నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో సమన్వయం కల్పించడం వీటి భాగంగా జరుగుతాయని తెలిపారు. ఈ ప్రయత్నాలు తెలంగాణను విత్తన ఉత్పత్తి, సరఫరాలో అగ్రగామిగా నిలబెట్టాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సీడ్స్‌మెన్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఈ హైదరాబాద్ విత్తన సదస్సు 2025 నిర్వహించబడింది. సీడ్ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, రైతు ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎన్.వి. రామకృష్ణతో పాటు ఇతర నాయకులు కూడా హాజరయ్యారు. సంఘం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ఉత్తమ్ కుమార్ రెడ్డి కంపెనీలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో తమ పాత్రను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి అయినప్పటికీ నేను, తెలంగాణ పౌరుడిగా మిమ్మల్ని దేశ నిర్మాతలుగా చూస్తున్నాను. మీ కృషితో రైతులు అభివృద్ధి చెందుతారు, రాష్ట్రం పేరు మరింత ప్రకాశిస్తుంది," అని అన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కె. సత్యనారాయణ తదితరులు కూడా పాల్గొన్నారు

## మళ్లీ బిఆర్ఎస్ గూటికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** సిర్పూర్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ పార్టీ గూటికి చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కోనేరు కోనప్పతో పాటు ఆయన సోదరుడు కోనేరు కృష్ణారావు కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కోనేరు కోనప్ప బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత ఆయన ఆ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరారు. గత కొంతకాలంగా ఆయన కేసీఆర్ నాయకత్వానికి అనుకూలంగా ప్రకటనలు చేస్తుండటంతో తిరిగి పార్టీలో చేరతారనే ఊహాగానాలు వినిపించాయి. గురువారం ఎర్రవెల్లిలో కేటీఆర్, హరీశ్ రావుల సమక్షంలో ఆయన తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## ఇడి చేతికి సృష్టి ఆస్పత్రి కేసు

**హైదరాబాద్, సెప్టెంబరు25, ప్రభాతవార్త:** సరోగసి పేరుతో సృష్టి ఆసుపత్రి వేదికగా డాక్టర్ నమ్రత భారీగా నగదు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎంట్రీ ఇచ్చింది. అందులోభాగంగా ఆమెను మరికొద్ది రోజుల్లో ఈడి ప్రశ్నించనుంది. పిల్లలు లేని దంపతులనే లక్ష్యంగా చేసుకుని డాక్టర్ నమ్రత రూ. లక్షల్లో నగదు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అబార్షన్ కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు నగదు ఆశ చూపి ప్రసవం తర్వాత వారి పిల్లల్ని డాక్టర్ నమ్రత కొనుగోలు చేసేవారు. అనంతరం సరోగసి ద్వారా పుట్టిన బిడ్డగా పిల్లలు లేని దంపతులను నమ్మించి పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారు. ఇదే విషయాన్ని పోలీసులు తన నివేదికలో స్పష్టం చేశారు. ఏపిలోని విజయవాడలో డాక్టర్ నమ్రత జన్మించి విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, జేజేఎం మెడికల్ కాలేజీలో ఎండీ గైనకాలజీని ఆమె పూర్తి చేశారు. అనంతరం విజయవాడలో తన వైద్య వృత్తిని ప్రారంభించారు. అలా ఫెర్టిలిటీ సెంటర్‌ను స్థాపించారు. హైదరాబాద్‌కు మారిన ఆమె సికింద్రాబాద్‌తోపాటు విశాఖపట్నంలో సైతం కొత్త ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేశారు. అయితే డాక్టర్ నమత్ర తమ ఏజెంట్ల సాయంతో గర్భస్రావం చేయించుకోవాలని ఆసుపత్రులకు వచ్చే పేద మహిలను లక్ష్యంగా చేసుకుని దందా కొనసాగించారు. ఈ క్రమంలో మహిళలకు నగదు ఆశ చూపించి వారి గర్భాలను కొనసాగించేలా ఒప్పందాలు సైతం చేసుకు న్నారు. దీంతో సంతానం లేని దంపతులకు ఆ మహిళల గర్భాన్ని సరోగసీగా చెప్పి వారి నుంచి రూ. 20 నుంచి 30 లక్షల వరకు వసూల్ చేశారు. ఇలా కోట్లాది రూపాయిలు సంపాదించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ఈడి మరిన్ని విషయాలు లోతుగా విచారించేందుకు కేసును ఆధీనం లోకి తీసుకుంది. ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగులోకి రావడంతో మరిన్ని సంచలన విషయాలు బహిర్గతం

## 3 దేశాల పర్యటనకు బయల్దేరిన కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మూడు దేశాల పర్యటనకు శ్రీకారం చు ట్టారు. బతుకమ్మ పండు గను పురస్కరిం చుకుని ఖతార్, మాల్టా, లండన్ లలో జరగ నున్న వేడుకల్లో ఆమె పాల్గొన నున్నారు. ఈ పర్యట నలో భాగంగా ఆమె గురువారం ఉదయం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. తొలుత హర్యానాలో జరిగే మాజీ ఉపప్రధాని దేవిలాల్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం ఢిల్లీ నుంచి ఖతార్‌కు పయనం కానున్నారు. కవిత విదేశీ పర్యటనకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు ఇటీవలే అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 26న ఖతార్‌లో తెలంగాణ జాగృతి స్థానిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబురాల్లో కవిత పాల్గొంటారు. 27న మాల్టాలో, 28న లండన్ లో జాగృతి శాఖలు ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమాల ద్వారా తెలం గాణ సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జా తీయ వేదికపై ప్రచారం చేస్తారు. కవిత 29న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్రం అడ్డుకోవడం లేదు

### మెట్రో నష్టాలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 25:** హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్ర ప్రభుత్వం ఆపడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కిషన్‌రెడ్డి కలిశారు. తెలంగాణలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల అభివృద్ధి గురించి చర్చించారు. రాష్ట్రంలో రోడ్డు మార్గాల కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రాజెక్టుల విస్తరణపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అత్యంత వేగవంతంగా సమర్థవంతంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2015 వరకు రాష్ట్రంలో 2500 కిలో మీటర్ల జాతీయ రహదారులు ఉండేవని, ఈ పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం డబుల్ అయిందని చెప్పారు. సుమారు 5 వేల కిలోమీటర్లకు పైగా ఇప్పటికే పూర్తి అయిందని అన్నారు. హైదరాబాద్ శ్రీశైలం మార్గంలో నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పర్యావరణానికి, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా హైవేల నిర్మాణం చేపడతామన్నారు. శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం ముందుకొచ్చిందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి గడ్కరీ చెప్పారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ఇప్పటికే నష్టాల్లో నడుస్తోందని, అయితే మెట్రో నష్టాలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారమైనందున వారే తేల్చుకోవాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రోకు అన్ని రకాలుగా కేంద్ర సహకారం ఉంటుందని అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ విషయంలో ప్రోయాక్టివ్ వ్యవహరించామని చెప్పారు. మెట్రో విస్తరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి సమంజసంగా లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. భూసేకరణ త్వరగా పూర్తిచేస్తే, ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా అవుతుందని తెలిపారు.

రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని కోరుకునే వ్యక్తుల్లో ముందుంటామని చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ ప్రతిపాదనలు అందాయని, ఆ అంశం పరిశీలనలో ఉందని స్పష్టం చేశారు.. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్), కాంగ్రెస్ పార్టీలకు బిజెపి భయం పట్టుకుందని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌తోనో బిజెపి కలిసే ప్రసక్తే లేదని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

## ఇంటర్ బోర్డులో నిధుల దుర్వినియోగం

### విచారణ జరిపించాలని సిఎంఒలో టిజిఒ కేంద్ర సంఘ ఉపాధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డులో ప్రభుత్వ, బోర్డు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని టిజివో కేంద్ర సంఘ ఉపాధ్యక్షులు మాచర్ల రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డులో ప్రభుత్వ ఉత్తర్వులు జీవోఎంఎస్ నంబర్ 18కి విరుద్ధంగా ప్రభుత్వ బ్యాంకులలో ఉన్న డిపాజిట్‌లు, ఫండ్స్‌లను ప్రవేట్ బ్యాంకులు (హెచ్‌డిఎఫ్‌సి అండ్ కోటక్)లలోకి డిపాజిట్‌లు మార్చారని తెలిపారు.

## మధ్యప్రదేశ్‌లో ఐజి పోలీస్ అధికారి ఫోన్లు లాక్కెళ్లిన దుండగులు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** పోలీస్ ఉన్నతాధికారి ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) చేతిలో ఉన్న రెండు మొబైల్ ఫోన్లను బైక్‌పై వచ్చిన దొంగలు లాక్కెళ్లారు. సున్నితమైన సమాచారం ఉన్న ఆ మొబైల్ ఫోన్లు హై సెక్యూరిటీ ఏరియాలో చోరీ కావడం పోలీస్ శాఖలో కలకలం రేపింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ ఘటన జరిగింది. ఇంటెలిజెన్స్, ఏటీఎస్ ఐజీ ఆశిష్ మంగళవారం రాత్రి10 గంటల సమయంలో భోజనం తర్వాత తన భార్యతో కలిసి వాకింగ్ చేస్తున్నారు. అత్యంత భద్రత ఉండే చార్ ఇమ్లి జోన్ ప్రాంతంలోకి బైక్‌పై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన చేతిలో ఉన్న రెండు మొబైల్ ఫోన్లు లాక్కొని పారిపోయారు. ఐజీ ఆశిష్ నుంచి చోరీ అయిన ఆ మొబైల్ ఫోన్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సున్నితమైన సమాచారం ఉన్నది. దీంతో ఈ విషయం తెలిసి పోలీస్ ఉన్నతాధికారులు షాక్ అయ్యారు. అయితే ఒక మొబైల్ ఫోన్‌లో అడ్వాన్స్ సెక్యూరిటీ ఫీచర్లు ఉన్నట్లు తెలుసుకున్నదొంగలు కొన్ని నిమిషాల్లోనే ఒకచోట దానిని పడేశారు. దీంతో ట్రాకింగ్ ద్వారా ఆ మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఇంటెలిజెన్స్ సమాచారం ఉన్నట్లు భావిస్తున్న రెండో మొబైల్ ఫోన్‌ను పోలీసులు ఇంకా గుర్తించలేదు. పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దీని కోసం వెతుకుతున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఇద్దరు అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## న్యాక్ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ స్నేహాలతకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభినందనలు

## నల్గొండకు త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ను అత్యుత్తమ స్కిల్ డెవల్మపెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, నల్లగొండకు త్వరలో సిల్క్ డెవల్మపెంట్ సెంటర్ మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవల్మపెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. సెప్టెంబర్ 5న టీచర్స్ డే పురస్కరించుకొని ఢిల్లీలో రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్న న్యాక్ సీనియర్ ఇన్ స్ట్రక్టర్ స్నేహాలత మంత్రిని గురువారం మంత్రుల నివాస సముదాయంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న ఆమెను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. శాలువాతో సత్కరించి, ఆమె పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన అందించిన సేవలను మెచ్చుకున్నారు. న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని మంత్రి కొనియాడారు. దేశ వ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహాలతకు అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం అన్నారు.

## రెడ్లను బిసిలు ఎన్నడూ వ్యతిరేకం చేయలేదు

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్నజాజుల శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, శేఖర్‌సగర తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** బిసిల విద్య ఉద్యోగ రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ చేసే ప్రయత్నాలను ఆదిలోనే అడ్డుకోవాలని కొంతమంది కుట్ర పన్నుతున్నారని, అందులో భాగంగానే బిసి రిజర్వేషన్లు పెంచక ముందే రాష్ట్ర హైకోర్టులో రెడ్డి జాగృతి సంఘానికి సంబంధించిన వాళ్లు హైకోర్టులో పిటిషన్ వేసి అడ్డుకోవాలని చూడడం చాలా అత్యంత బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు బీసీ రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు చేసి ఢిల్లీకి పంపిస్తే అక్కడ రాష్ట్రపతి భవన్ బిల్లుకు ఆమోదం చేయకుండా అడ్డుకున్నారని, బీసీ రిజర్వేషన్లకు చట్టం చేసి ఇక్కడ రాష్ట్ర గవర్నర్ కు పంపిస్తే రాజ్ భవన్ ద్వారా అడ్డుకున్నారని రాష్ట్రపతి భవన్‌ను, రాజ్ భవన్ ను ప్రభావితం చేసి అడ్డుకున్న వారే నేడు రాష్ట్ర హైకోర్టును అడ్డం పెట్టుకొని బీసీ రిజర్వేషన్లను పెంచకుండా కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రెడ్డి జాగృతి అధ్యక్షుడు అయినా మాధవరెడ్డి, అలాగే మల్లవ్వ రెడ్డిలు హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల పెంపు చెల్లదని పిటిషన్ వేశారని రిజర్వేషన్లు పెంచకుండానే పిటిషన్ వేస్తే రాష్ట్ర హైకోర్టు ఈ పిటిషన్ ను తిరస్కరిస్తూ 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత అప్పుడు కోర్టుకు రావచ్చని పేర్కొన్నదని ఆయన గుర్తు చేశారు.

## ఆరోగ్యకర సమాజం నిర్మాణమే ఫార్మసిస్టుల లక్ష్యం

### పిసిసి డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డా. రాజీవ్

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** 'మందులు ఇవ్వడం కాదు – ఆరోగ్యాన్ని అందించడం' అనే నైతిక విలువలతో ఫార్మసి రంగంలోని నిపుణులు జీవించాలని టిపిసిసి డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డా. రాజీవ్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగింది. ఈ కార్యక్రమంలో అదే విధంగా ఫార్మసీ రంగానికి చెందిన నిపుణులు, ఫార్మసిస్టులు హాజరయ్యారు. టిపిసిసి డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ రాష్ట్ర చైర్మన్ డా. రాజీవ్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు కేవలం మందులు ఇచ్చే వారు మాత్రమే కాదు, ఆరోగ్యరంగంలో కీలక పాత్ర పోషించే వారని అన్నారు. ప్రజలకు సరైన మందులు సరైన సమయంలో అందించడంలో దృష్టిసారించాలని కోరారు. మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, దుష్ప్రభావాలపై హెచ్చరించడం వంటి బాధ్యతలు ఫార్మసిస్టుల బాధ్యత అని తెలిపారు. వైద్య శాస్త్రం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అంతే స్థాయిలో ఫార్మసీ రంగం కూడా విస్తరిస్తోందని ఆయన వివరించారు. ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే బారి ఎత్తున కేవలం వైద్య రంగం లోనే 8000 వేల పైగా పోస్టులు భర్తీ చేయడం జరిగిందని చెప్పారు ఇదే వైద్య రంగం పైన ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు . కొత్త ఔషధాల పరిశోధన, ప్రజలకు అందుబాటులోకి తేవడంలో ఫార్మసిస్టుల పాత్ర అపారమైనదని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమం చివరగా, పాల్గొన్న ఫార్మసిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా ఫార్మసీ విద్యార్థులు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన అసిస్టెంట్ ఇంజినీర్



**జనగామ బ్యూరో, ప్రభాతవార్త :** కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ అసిస్టెంట్ ఇంజినీర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏఈ రమేష్ హనుమకొండ జిల్లా విద్యా శాఖ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. కాగా, గురువారం హనుమకొండ అదాలత్‌లోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఇంజనీర్ విభాగం ఆఫీసులో కొడకండ్లలోని స్కూల్ బిల్డింగ్ కాంట్రాక్టర్ నుంచి రూ.8 లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణ పనుల బిల్లుల కోసం కాంట్రాక్టర్‌ను ఏఈ రూ.18 వేలు డిమాండ్ చేయగా రూ10 వేలు ఇచ్చాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.




## ఫైనల్‌కు పాక్.. 28న భారత్‌తో ఢీ

### బంగ్లాదేశ్‌పై 11 పరుగుల తేడాతో విజయం

**దుబాయ్, సెప్టెంబరు 25:** ఆసియా కప్ టోర్నీలో ఎట్టకేలకు పాకిస్తాన్ ఫైనల్‌కు చేరింది. ఈ నెల 28న ఆదివారం భారత్ – పాకిస్తాన్ మధ్య దుబాయ్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఇక గురువారంనాడు బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్తాన్ – బంగ్లాదేశ్ మధ్య మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్‌ను కట్టడి చేయడంలో బంగ్లాదేశ్ బౌలర్లు సఫలీకృతులయ్యారు. దీంతో పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు మాత్రమే చేసింది. పాక్ బ్యాటర్లలో ఏ ఒక్కరూ హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయారు. వికెట్ కీపర్ మొహమ్మద్ హారీస్ 23 బంతులెదుర్కొని 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31 పరుగులు చేశాడు. మొహమ్మద్ నవాజ్ 25, సల్మాన్ అఘా 19, ఫహీమ్ అష్రాఫ్ 14, ఫఖర్ జమాన్ 13 పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్ 3, రిషాద్ హుసేన్ 2, మహిది హసన్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 136 పరుగుల లక్ష్యఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఆదిలోనే ఓపెనర్ వికెట్ కోల్పోయినప్పటికీ దూకుడుగా కొనసాగించారు. సిక్స్, ఫోర్లు బాదారు. 12 ఓవర్ల వరకు బంగ్లా బ్యాటర్లు బాగా ఆడినప్పటికీ, వరుసగా వికెట్లు జారవిడుచుకుంది. ఇక ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో బంగ్లాదేశ్ 9 వికెట్లు కోల్పోయి 124 పరుగులే చేయగా 11 పరుగుల తేడాలో ఓడింది.

## బాధితులకు బాసటగా ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్

### పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్, మరొకరిపై విచారణ

### ఇందిరమ్మ కమిటీ సభ్యునిపై క్రిమినల్ కేసు నమోదు

### ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపే చర్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25, ప్రభాతవార్త:** నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం విషయంలో ఎటువంటి అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న గట్టి చర్యలు ప్రజలను చైతన్యపరుస్తున్నాయి. అందుకే ఏ చిన్న సమస్య వచ్చినా లబ్దిదారులు ఏమాత్రం సంకోచించ కుండా ఇందిరమ్మ ఇండ్ల కాల్ సెంటర్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ కాల్ సెంటర్ బాధితులకు బాసటగా నిలుస్తోంది. కాల్ సెంటర్ నెంబర్ 1800 599 5991కు ఫిర్యాదు వచ్చిన గంటల్లోనే సదరు ఫిర్యాదులు, సమస్యలపై అధికారులే నేరుగా రంగంలోకి దిగి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిరోజు తన కార్యాలయానికి తెప్పించుకొని పరిశీలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో లంచాలు అడుగు తున్న అధికారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన 24 గంటల్లోనే బాధితులకు న్యాయం చేసి సంబంధిత అధికారులపై చర్యలు చేపడుతున్నారు. డబ్బుల కోసం పేదలను వేధిస్తే ఫిర్యాదు చేసిన 24 గంటల్లో విచారణ జరిపి క్రిమినల్ కేసుల నమోదు చేస్తామని అధికారులు, ఇందిరమ్మ కమిటీలను హెచ్చరించారు. మంత్రిగారు ఇచ్చిన హామీని నిలబెట్టు కుంటూ కాల్‌సెంటర్ లో నమోదయ్యే ఫిర్యాదులపై విచారణ జరుగుతోంది. ఇప్పటికే పలువురు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శులపై వేటు పడింది. తాజాగా కొంతమంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఫిర్యాదులను గమనిస్తే.. వారికి కాల్ సెంటర్‌పై ఎంత నమ్మకం ఏర్పడిందో అర్థమవుతుంది. అంతేగాక ఓ లబ్దిదారు ఏకంగా పోలీసు స్టేషన్‌లోనే ఇందిరమ్మ కమిటీ సభ్యునిపై ఫిర్యాదు చేయడం కూడా వారిలో పెరిగిన ఆత్మస్థైర్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి... సంగారెడ్డి జిల్లా నిజాంపేట, ఏదుల తండాకు చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారు అంగోత్ తులసీభాయి నేరుగా హౌసింగ్ కార్పొరేషన్‌లోని కాల్ సెంటర్ కు ఫోన్ చేసి తన ఇల్లు నిర్మాణం పునాదుల వరకు పూర్తయిందని అయితే అంతవరకు ఫోటో తీసి పంపడానికి గాను పంచాయితీ కార్యదర్శి పి. మహబూబ్ అలీ 10 వేల రూపాయిలు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. విచారణలో ఫోన్ పే ద్వారా అతనికి డబ్బులు చెల్లించినట్లు అధికారుల విచారణలో తేలింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం మాజిద్‌పూర్ కు చెందిన కల్లె సత్యాలు అనే ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారు నేరుగా కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తమ పంచాయితీ కార్యదర్శి రాఘవేంద్ర పలు రకాలుగా సమస్యలు సృష్టించి వేధిస్తున్నారని, 20 వేల రూపాయిలు లంచంగా ఇవ్వమని డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఇల్లు బేస్‌మెంట్ వరకు పూర్తయిందని, ఇప్పుడు గ్రామ పైప్‌లైన్‌కు అడ్డంగా ఉందని చెప్పి ఇంటి ఫోటో కూడా తీయకుండా వేధిస్తున్నారని ఆమె కాల్‌సెంటర్‌కు తెలిపారు. దీనిపై అధికారులు లోతైన విచారణ జరుగుతున్నారు. నాగర్ కర్నూలు జిల్లా తాండూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన ఏదుల భీమమ్మ అనే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారు చేపట్టిన ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతూ, ఆమెను బెదిరించి డబ్బు వసూలు చేసినట్లు అందిన ఫిర్యాదుపై స్థానిక పోలీసుల కేసు నమోదు చేశారు. ఆమె ఫిర్యాదులోని వివరాల ప్రకారం భీమమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరుకాగా ఆమె బావ ఏదుల నారాయణ తన భార్య పిల్లలతో కలిసి ఇంటి నిర్మాణాన్ని అడ్డుపడ్డారు. నారాయణకు అండగా నిలిచిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చిక్కొండ్ర మల్లేష్ జోక్యం చేసుకొని రూ. 25వేలను డిమాండ్ చేశాడు. భీమమ్మ రూ.10 వేలను మల్లేష్‌కు ఇచ్చారు. అయినప్పటికీ ఏదుల నారాయణకు మల్లేష్ మద్దతుగా నిలిచి తనను మోసం చేశారని, వీరందరిపై తగుచర్యలు తీసుకోవాలని భీమమ్మ తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



# రికార్డుల ఊచకోత!

## ఓజీ ప్రీమియర్ షోల ద్వారా రూ.22.63 కోట్ల వసూళ్లు



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురుచూసిన క్షణం రానే వచ్చేసింది. గత కొన్ని రోజులు క్రితం వరకూ ఎక్కడికి వెళ్ళినా ఓజీ.. ఓజీ.. ఓజీ ఈ పేరు వినిపించేది.. ప్రేక్షకుల వేయింట్ ఫలించి ఓజీ మూవీ బుధవారం రాత్రినుంచే ప్రీమియర్ షోలతో బాక్సాఫీస్ వద్ద కాసుల వేట మొదలు పెట్టగా గురువారం థియేటర్స్‌లో విడుదలైంది. గ్యాంగ్ స్టార్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాపై పవన్ అభిమానుల్లో అంచనాలకు తగ్గట్లే సినిమా సూపర్ హిట్ రెస్పాన్స్‌తో దుమ్ముదులుపుతోంది. దీంతో ఫ్యాన్స్ మొదలు సెలబ్రిటీల వరకూ అందరూ పవన్ కళ్యాణ్ సినిమాని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. టాక్ ఎలా ఉందనేది పక్కన పెడితే.. బాక్సాఫీస్ దగ్గర ఓజీ ఊచకోత కనిపిస్తోంది.
సినిమా స్టోరీనే అయినప్పటికీ.. అదిరిపోయే స్క్రీన్ ప్లే, బీజీఎం, కావాల్సినన్నీ హై మూమెంట్స్‌తో పవన్ అభిమానులను కేరింతలు కొట్టించాడు డైరెక్టర్ సుజీత్. దీంతో ఓజీ థియేటర్స్ వద్ద పండగ వాతావరణం నెలకొంది. సుజిత్ స్క్రీన్ ప్లే, తమన్ బీజీఎం, పవర్ స్టార్ స్క్రీన్ ప్రజెన్స్ ఫ్యాన్స్‌కు ఫుల్ కిక్కిస్తున్నాయి. సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక హై ఇస్తూ అరుపులు పెట్టించాడు డైరెక్టర్. పవన్ ఎంట్రీ సీన్లకు, డైలాగులకు థియేటర్లు విజిల్స్, అరుపులు, కేకలతో దద్దరిల్లిపోతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓజీ క్రేజ్ ఊపేస్తోంది. అభిమానుల నుంచి సెలబ్రెటీల వరకు పవన్ ఓజీ వైబ్స్ ఎంజాయ్ చేస్తున్నారు. చాలా కాలం తర్వాత పవన్ ఫ్యాన్స్‌కు కావాల్సిన సరైన సినిమా వచ్చిందంటూ సంబరాలు చేసుకుంటున్నారు.

ఈ చిత్రం ప్రీమియర్ షోలతో రికార్డులు బద్దలు కొట్టింది. నైజాంలో అత్యధికంగా 366 ప్రీమియర్ షోలు ప్రదర్శితమయ్యాయి. కేవలం ప్రీమియర్ షోల ద్వారానే భారతదేశంలో రూ.22.63 కోట్ల గ్రాస్ వసూలు చేసి, సరికొత్త రికార్డు నెలకొల్పింది. హరి హర వీరమల్లు రికార్డును కూడా ఓజీ అధిగమించడం విశేషం. మొత్తమ్మీద తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకి పైగా కలెక్షన్లు రాబట్టడం ఖాయంగా కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఏ తెలుగు సినిమాకు రానంత హైప్**

అయితే... ఓజీ సినిమా ఫ్యాన్స్ అండ్ యాక్షన్ మూవీస్‌ను ఇష్టపడే వారికి మాత్రమే నచ్చుతుందని, ఫ్యామిలీ ఆడియెన్స్ కోరుకునే కథ, వినోదం ఇందులో లేకపోవడం మైనెస్ అని కొందరంటున్నారు. అంతే కాకుండా పండగ సీజన్ లో వచ్చిన ఈ సినిమాకు ఎ సర్టిఫికెట్ ఇవ్వడం కూడా కొంత మేర నష్టాన్ని కలిగిస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే... ఈ మధ్య కాలంలో ఏ తెలుగు సినిమాకు రానంత హైప్ ఓజీకి వచ్చింది. దానికి తోడు తెలుగు సినిమా రంగం మొత్తం ఓజీ సినిమాను ఓన్ చేసుకుని, ప్రమోట్ చేయడం బాగా కలిసి వచ్చింది. ఓజీలోని పవన్ కళ్యాణ్ ఎలివేషన్ షాట్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తుంటే... ఈ యేడాది ద్వితీయార్థంలో ఓజీ మూవీ రావడం ఆనందాన్ని కలిగిస్తోందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి.

**సీక్వెల్ ఖాయం**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన వచ్చిన మొదటి సినిమా హరిహర వీరమల్లు. ఈ సినిమాను ఒక పార్ట్‌లో తీయలేమని గ్రహించిన నిర్మాత ఎ. ఎం. రత్నం విడుదలకు ముందే ఈ కథను రెండు భాగాలుగా తీస్తున్నామని, ప్రస్తుతం వస్తోంది కేవలం మొదటి భాగమే అని చెప్పేశారు. అయితే హరిహర వీరమల్లు కమర్షియల్‌గా ఆశించిన స్థాయిలో ఆడలేదు. దాంతో ఇప్పుడు పవన్ కళ్యాణ్ దానికి సీక్వెల్ చేస్తాడా? లేదా? అనే సందేహం నెలకొంది. చిత్రం ఏమంటే... హరిహర వీరమల్లు నిర్మాత ఎ. ఎం. రత్నం తమ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని ముందే ప్రకటించగా, ఓజీ నిర్మాత డీవీవీ దానయ్య మాత్రం సైలెంట్ కిల్లర్ మాదిరి ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా ఓజీ 2కి సంబంధించిన ప్రకటన చేశారు. ఓజీ సినిమా ఎండ్ టైటిల్‌లో ఓజీ 2 అంటూ టైటిల్ కార్డ్ వేయడంతో పాటు దర్శకుడు సుజీత్ ఓజీ సీక్వెల్‌కు లీడ్ ఇచ్చాడు. ఓజస్ గంభీరను ఒంటరిగా ఎదుర్కోలేనని గ్రహించిన జపాన్ అండర్ వరల్డ్ డాన్... దుబాయ్ లోనే కోబ్రాతో చేతులు కలిపి... ఓజీని అంతం చేయడానికి ప్రతిన బూనడంతో ఈ సినిమాకు ఎండ్ కార్డ్ పడింది . హరిహర వీరమల్లు సీక్వెల్‌ను ఒక వేళ పవన్ కళ్యాన్ పక్కన పెట్టినా... ఓజీ సీక్వెల్ ను విస్మరించడానికి వీలులేని పరిస్థితి ఏర్పడిందని సినీ విశ్లేషకులు అంటున్నారు. మరి ఇప్పటికే అంగీకరించిన సినిమాలను పూర్తి చేసి... ఓజీ సీక్వెల్‌ను పవన్ ఎప్పుడు పట్టాలెక్కిస్తాడో చూడాలి.

**పవన్‌ని అలా చూస్తుంటే మచ్చటేస్తోంది : చిరు**

ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ట్వీట్ చేస్తూ.. కళ్యాణ్ బాబును అందరూ ది ఓజీగా చూడటం ఆనందంగా ఉంది. సుజీత్, దానయ్య, థమన్, మొత్తం టీమ్‌కు అభినందనలు అన్నారు. ఓజీకి చిరంజీవి అభినందనలు తెలియజేయడంతో మెగా ఫ్యాన్స్ ఖుషీ అయిపోతున్నారు. మెగా బ్రదర్స్ మధ్య బాండింగ్ అద్భుతమని కొనియాడుతున్నారు.

**రూ. 92 కోట్లు ఓటీటీ డీల్**

థియేటర్స్‌లో విడుదలై ఒక్కరోజు కూడా కాకముందే.. అప్పుడే ఓజీ ఓటీటీ డీల్ వివరాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఓజీ డిజిటల్ రైట్స్ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫార్మ్ నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 92 కోట్లు ఓజీ రైట్స్ అమ్ముడైనట్లు సినీ వర్గాల్లో టాక్. పవన్ కళ్యాణ్ కెరీర్ లోనే ఇది అతి పెద్ద ఓటీటీ డీల్ అని తెలుస్తోంది. సాధారణంగా.. థియేటర్లలో విడుదలైన తర్వాత 4 నుంచి 8 వారాల మధ్య ఓటీటీలోకి వస్తుంది. లేదా అంతకంటే ముందే దీపావళి కానుకగా ఓటీటీలోకి వచ్చే ఛాన్స్ కూడా ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. స్ట్రీమింగ్ తేదీ ఎప్పుడనే దానిపై ఇంకా అధి కారిక ప్రకటన లేదు.

### థియేటర్లలో సెలబ్రిటీల హంగామా

పవన్ ఫ్యాన్స్‌తో పాటు సెలబ్రిటీలు సైతం ఓజీ సినిమాను వెండి తెరపై చూసేందుకు క్యూలు కట్టారు. ముఖ్యంగా సలార్, కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, సాయి ధరమ్ తేజ్, వరుణ్ తేజ్, విష్ణు తేజ్, కిరణ్ అబ్బవరం, రవితేజ వారసులు నిర్మాత ఎస్కేఎన్, మాస్ మహారాజ్ రవితేజ వారసులు, డైరెక్టర్ హరీశ్ శంకర్ ఇంకా చాలామంది వర్ధమాన హీరో హీరోయిన్లు అంతా ఓజీ ప్రదర్శితమవతున్న థియేటర్లలోనే సందడి చేశారు. పవన్ ఎంట్రీ సీన్లకు విజిల్స్, అరుపులు, కేకలతో హంగామా చేశారు. మరోవైపు హీరో వరుణ్ తేజ్ కూడా థియేటర్లు పేపర్లు విసిరేస్తూ ఫ్యాన్ బాయ్ మూమెంట్స్ ఎంజాయ్ చేశారు.

ఇంకా స్పెషల్ అట్రాక్షన్‌గా అకీరా నందన్, ఆద్యలు సైతం బుధవారం రాత్రి బాలానగర్ విమల్ థియేటర్. మూసాపేట్ శ్రీరాములు థియేటర్లలో సినిమాను తిలకించారు. సెలబ్రిటీలు ఒకరి తర్వాత ఒకరు సినిమా చూడడానికి రావడంతో ఫ్యాన్స్‌లో ఉత్సాహం మరింత రెట్టింపు అయింది. వారితో ఫొటోలు దిగడానికి, చూడడానికి ఎగబడ్డారు. ఆపై అభిమానులతో కలిసి సెలబ్రిటీలు సైతం డ్యాన్సులు వేస్తూ.. పేపర్లు ఎగరేస్తూ, విజిల్స్ వేస్తూ సరికొత్త జోష్ తీసుకు వచ్చారు.

## మా నమ్మకాన్ని నిజం చేశారు




ప్రెస్ మీట్‌లో ఓజీ టీం

పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రజెన్స్, సుజీత్ దర్శకత్వ ప్రతిభ, తమన్ అద్భుతమైన నేపథ్య సంగీతం, రవి కె చంద్రన్, మనోజ్ పరమహంసల కట్టిపడేసే కెమెరా పనితనం కలిసి.. ఓజీని హాలీవుడ్ స్థాయి చిత్రంగా మలిచాయి. అభిమానులు, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తున్న నేపథ్యంలో తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం, తమ సంతోషాన్ని పంచుకుంది. దర్శకుడు సుజీత్ మాట్లాడుతూ.. దాదాపు మూడేళ్ళ ప్రయాణం. ఓజీ కథకి ఇంతటి భారీతనం రావడానికి కారణమైన పవన్ కళ్యాణ్ గారికి థాంక్స్. నేను ఆయనకు వీరాభిమానిని. జానీ సినిమా సమయం నుంచి పవన్‌ని కలిస్తే చాలు అనుకునేది. అలాంటిది ఇప్పుడు ఆయనతో సినిమా చేయడం, దానికి బ్లాక్ బస్టర్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. విడుదలకు ముందు సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. మా నమ్మకం నిజమై.. విజయం సాధించిన తర్వాత.. భయం, బాధ్యత పెరిగాయి. ఈ విజయంతో భవిష్యత్ లో మరింత బాధ్యతగా పని చేస్తాం అన్నారు. నిర్మాత డీవీవీ దానయ్య మాట్లాడుతూ.. "ఆనందంలో మాటలు కూడా రావడంలేదు. నేను మొట్ట మొదటిగా థాంక్స్ చెప్పాల్సింది త్రివిక్రమ్ శ్రీనివాస్ గారికి. ఆయన లేకపోతే ఈ ప్రాజెక్ట్ లేదు. పవన్ కళ్యాణ్ గారితో సినిమా చేద్దాం అనుకున్నప్పుడు.. దర్శకుడు సుజీత్ పేరు త్రివిక్రమ్ గారే సూచించారు అన్నారు. కథానాయిక ప్రియాంక మోహన్ మాట్లాడుతూ..ఇంతకు మించి ప్రేక్షకుల నుంచి మేము ఏం కోరుకుంటాం. మా సినిమాని ఇంతలా ఆదరిస్తున్నందుకు పవన్ కళ్యాణ్ అభిమానులకు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు అన్నారు. ప్రముఖ నిర్మాత నాగవంశీ, నిర్మాత కళ్యాణ్ దాసరి, ఎడిటర్ నవీన్ నూలి తదితరులు పాల్గొని సినిమాకి వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

**వంద కోట్ల డైరెక్టర్స్ సరసన..**


ఓ సినిమా వంద కోట్లు పోగేసిందంటేనే ఓ విశేషం! అలాంటిది ఓపెనింగ్స్‌లోనే హండ్రెడ్ క్రోర్ చూడడం మరింత స్పెషల్!. అలా వరుసగా రెండు సినిమాలతో ఓపెనింగ్స్‌లోనే నూరు కోట్లు కొల్లగొట్టేశారు కొందరు డైరెక్టర్స్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా సుజీత్ డైరెక్షన్‌లో రూపొందిన ఓజీ సినిమా మొదటి రోజునే వంద కోట్లు ఓపెనింగ్ చేసిందని సమాచారం. దాంతో వరుసగా రెండు సినిమాలతో నూరు కోట్ల రూపాయల ఓపెనింగ్ చూసిన నాలుగో డైరెక్టర్‌గా సుజీత్ నిలచి పోయారు. ఇంతకు ముందు రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సుజీత్ రూపొందించిన సాహో సినిమా కూడా మొదటి రోజున హండ్రెడ్ క్రోర్స్‌కు పైనే పోగేసింది. అసలు ఈ ఫీట్‌ను సాధించిన మొదటి డైరెక్టర్ మన దర్శకధీర రాజమోళి అనే చెప్పాలి. రాజమోళి రూపొందించిన బాహుబలి2, ట్రిపుల్ ఆర్.. రెండు చిత్రాలు మొదటి రోజునే వంద కోట్ల రూపాయలకు పైగా ఓపెనింగ్స్ చూశాయి.
వరుసగా రెండు చిత్రాలతో వంద కోట్ల ఓపెనింగ్స్ చూసిన డైరెక్టర్స్‌లో ప్రశాంత్ నీల్, తమిళ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కూడా ఉన్నారు. ప్రశాంత్ నీల్ తన కేజీఎఫ్2తోనూ, తరువాత ప్రభాస్ సలార్‌తోనూ వరుసగా వంద కోట్ల ఓపెనింగ్ చూశారు. అలాగే లోకేశ్ కనగరాజ్ లియో, కూలీ మూవీస్‌తో ఈ తీరున మురిపించారు. ఈ నలుగురు దర్శకుల్లో ముగ్గురు తెలుగువారే ఉండడం విశేషం.

## మట్టి రేసింగ్ నేపథ్యం

పీకే7 స్టూడియోస్ సమర్పణలో డాక్టర్ ప్రగభల్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం జాకీ. ప్రతిభావంతుడైన డైరెక్టర్ డా. ప్రగభల్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం మడ్డీ. భారతీయ సినిమాలో తొలిసారిగా మట్టి రేసింగ్ నేపథ్యంలో రూపొందిన మడ్డీ చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. అదే విజయోత్సాహంతో మరింత ఆసక్తికరమైన కథాంశంతో, ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచడానికి డా. ప్రగభల్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం జాకీ. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల అయింది. వినుత్నమైన కథతో తెరకెక్కుతున్న



ఈ చిత్రంలో గోట్స్ ఫైట్ ఆసక్తికరంగా ఉండబోతుందని అర్థం అవుతుంది. ముఖ్యంగా మదురైలో సాంప్రదాయంగా కొనసాగుతున్న ఈ గోట్ ఫైట్ చుట్టు అల్లుకున్న కథ అని తెలుస్తుంది. కేవలం ఫైట్స్ మాత్రమే కాదు అద్భుతమైన భావోద్వేగాలతో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ఫస్ట్ లుక్ చూస్తుంటే అర్థం అవుతుంది. ఈ చిత్రం కోసం డైరెక్టర్ ప్రగభల్ ఎంతో శ్రమించినట్లు తెలుస్తుంది. రియల్ లోకేషన్స్‌లో చిత్రీకరించడమే కాకుండా 2022 నుంచి అక్కడి సాంస్కృతి సాంప్రదాయాలను అర్థం చేసుకోవడానికి అదే ప్రాంతంలో ఉన్నట్లు డైరెక్టర్ తెలిపారు. సహజసిద్ధంగా చిత్రీకరించేందుకు అక్కడి ప్రజలతో మమేకమై, ప్రతీది తెలుసుకొని జాగ్రత్తగా షూట్ చేసినట్లు మేకర్స్ తెలిపారు. అంతేకాదు సినిమా కావాల్సిన ప్రతీ అంశాన్ని జోడించి ఎంతో గ్రిప్పింగ్‌గా స్క్రీన్ ప్లేను సెట్ చేసినట్లు పేర్కొన్నారు. అందుకోసం నటీనటులు గోట్స్ సంరక్షకులతో కొద్దిరోజులు సవాసం చేసి, వారితో, గోట్స్‌తో అనుబంధం పెంచుకున్నట్లు మేకర్స్ తెలిపారు. నటీనటులు అద్భుతమైన ప్రదర్శనతో ఆద్యాంతం కట్టిపడేస్తారని, ఫైట్ సన్నివేశాలకోసం శారీరంగా, మానసికంగా రెడీ అయ్యారని అందుకే ప్రతీ సన్నివేశం అద్భుతంగా వచ్చిందని మేకర్స్ తెలిపారు. ముఖ్యంగా గోట్ సంరక్షకుల భావోద్వేగాలు కట్టిపడేస్తాయని, అలాగే మదురైలో ఉన్న ఈ సంస్కృతి ప్రేక్షకులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సంబంధంచి మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.



## నా ఫొటో వాడద్దు

ప్రముఖ తెలుగు సినీ నటుడు అక్కినేని నాగార్జున తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా తన ఫోటో మరియు పేరును వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నాగార్జున తన పిటిషన్‌లో, సోషల్ మీడియాలో మరియు వివిధ వస్తువులు, దుస్తులపై తన చిత్రాన్ని అనధికారికంగా ఉపయోగించడం ద్వారా తన వ్యక్తిత్వ హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని పేర్కొన్నారు.
ఈ విషయంపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు, నాగార్జున వ్యక్తిత్వ హక్కులను కాపాడుతామని తెలిపింది. ఇటీవల ఐశ్వర్యారాయ్ కేసులో కూడా హైకోర్టు సానుకూల తీర్పునిచ్చిందని గమనించాలి.

## మానవ సంకల్పానికి-విధికి మధ్య జరిగే పోరాటం

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా జటాధర నుంచి ఫస్ట్ ట్రాక్ సోల్ ఆఫ్ జటాధర రిలీజ్ నవంబర్ 7న సినిమా రిలీజ్. నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్ ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. ఈ విజువల్ స్పెక్టకిల్ జటాధర నవంబర్ 7, 2025న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. మేకర్స్ తాజాగా మేకర్స్ ఫస్ట్ ట్రాక్ సోల్ ఆఫ్ జటాధారను రిలీజ్ చేశారు. సోల్ ఆఫ్ జటాధర్థ సినిమా ప్రిమైజ్ ని అద్భుతంగా సెట్ చేసింది. సాంప్రదాయ సంగీతం, డివైన్ టచ్ కలిపిన ఈ స్వరాలు మనల్ని జటాధర ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. బీట్‌లు చాలా ఇంటెన్స్‌గా ఉండి, సినిమా టోన్‌తో పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాయి. ఓం నమఃశివాయ జపం గూస్ బంప్స్ తెప్పించింది. సోల్ ఆఫ్ జటాధరతో ప్రమోషన్స్‌కి ఇప్పుడు కంప్లీట్ జోష్ కంపొచ్చింది. రాజీవ్ రాజ్ కంపోజ్ చేసి, స్వయంగా పాడిన ఈ ఆడియో గ్లింప్స్ అందరిని ఆకట్టుకుంది. డివోషనల్ డెప్త్, రా ఎనర్జీతో కూడినన ఈ పాట సినిమా ఎసెన్స్‌ని ప్రజెంట్ చేస్తోంది. జటాధరలో సుధీర్ బాబు,



సోనాక్షి సిన్హా, దివ్య ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్‌తో పాటు ప్రముఖ కనిపించనున్నారు. మంచికి-చెడుకి, వెలుగుకి-చీకటికి, మానవ సంకల్పానికి- విధికి మధ్య జరిగే అద్భుతమైన పోరాటాన్ని ఈ చిత్రం చూపించబోతోంది. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరించారు. డివ్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, భావిని గోస్వామి సూపర్వైజింగ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. సినిమాకి పవర్ ఫుల్ సౌండ్‌స్కేప్‌ను జీ మ్యూజిక్ కో అందిస్తోంది. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## ఫన్ కోసం ఆడే ఆట నిజ జీవితంలో జరిగితే!

నిజానికి ఫన్ కోసం ఆటలు ఆడాలి కానీ అదే ఆట ఆడుతుంటే నిజ జీవితంలో కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటే ఎలా ఉంటుంది? ఇప్పుడు సరికొత్త తమిళ థ్రిల్లర్ సిరీస్ ట్రైలర్ చూస్తుంటే కూడా అలాంటి ఫీలింగే కలుగుతుంది. వర్చువల్ గేమ్ ఆడుతున్నప్పుడు నిజ జీవితంలో దానివల్ల సంఘటన చోటు చేసుకున్నట్టుగా ఈ థ్రిల్లర్ ట్రైలర్ కనిపిస్తోంది. అక్టోబర్ రెండో తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సిరీస్ ట్రైలర్ చూస్తుంటే ఎన్నో సీక్రెట్స్ మరెన్నో మాస్కులు ఆవిష్కృతం కాబోతున్నట్టు కనిపిస్తోంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ తమిళ థ్రిల్లర్‌ను రాజేష్ ఎం. సెల్వా దర్శకత్వం వహించారు, దీప్తి గోవిందరాజన్ రచన చేశారు, సెల్వా, కార్తిక్ బాలా సహ రచన చేశారు. టెక్నాలజీ కంట్రోల్లో లేకుండా పోతున్నప్పుడు, కుటుంబ విభేదాల తీవ్రతతో, రిలేషన్స్ బలహీనమవుతున్నప్పుడు, నిజమైన మరియు వర్చువల్ ప్రపంచాల మధ్య గీత కనుమరుగవుతున్నప్పుడు ఎవరిని నమ్మాలనే ప్రశ్న ఈ సిరీస్ లేవనెత్తేలా కనిపిస్తోంది. ఈ సిరీస్‌తో శ్రద్ధా శ్రీనాథ్ తన ఓటిటీ డెబ్యూ చేస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు, వారితో పాటు సంతోష్ ప్రతాప్, చాందిని, శ్యామ హరిణి, బాల హాసన్, సుబాష్ సెల్వం, వివియా సంత్, ధీరజ్, మరియు హేమ నటిస్తున్నారు. దర్శకుడు రాజేష్ ఎం. సెల్వా ఈ సిరీస్ గురించి మాట్లాడుతూ, అది గేమ్‌తో, మేము సృష్టించే ప్రపంచాలు, మనం జీవించే జీవితాల మధ్య సున్నితమైన గీతను అన్వేషించాలనుకున్నాను. సిరీస్ ఫ్యామిలీ డ్రామా, కాంప్లికేటెడ్ రిలేషన్స్ తో కూడిన ఓ థ్రిల్లర్. హైపర్‌కనెక్టెడ్ యుగంలో, ఏదీ కేవలం వర్చువల్‌గా మిగలదు. తెరపై జరిగే విషయం వాస్తవంలోకి చొచ్చుకొస్తుంది, నియంత్రించలేని పరిణామాలతో ప్రతి మాస్క్ వెనుక ఒక సత్యం దాగి ఉంటుంది. నెట్‌ఫ్లిక్స్‌తో నా మొదటి తమిళ ఒరిజినల్‌గా నా విజన్ జీవం పోసుకోవడం అత్యంత ఆనందకరమైన అనుభవం." అన్నారు. శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ, స్వతంత్ర మహిళగా, అదే సమయంలో గేమింగ్ డెవలపర్‌గా ఉన్న పాత్రలోకి అడుగుపెట్టడం థ్రిల్లింగ్‌గా, సవాలుగా అనిపించింది. నా పాత్ర సృష్టించిన ప్రపంచమే ఆమెకు వ్యతిరేకంగా మారి, ఆమె తప్పించుకోలేని భయంకరమైన వాస్తవంగా మారిన థ్రిల్లర్ జోన్‌లోకి ప్రవేశించడం సవాలుగా అనిపించింది. రాజేష్‌తో కలిసి పనిచేయడం ఈ ప్రయాణాన్ని మరపురానిదిగా చేసింది. నెట్‌ఫ్లిక్స్‌తో, ఈ కథకు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు అనుసంధానం కావాలని కోరుకున్నాము. అని అన్నారు.

### రాజాసాబ్ మాస్టర్ ప్లాన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ది రాజాసాబ్ గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమా ఫస్ట్ ట్రైలర్‌కు సంబంధించిన రన్ టైం లాక్ అయినట్లు సమాచారం. ట్రైలర్ నిడివి దాదాపు 3 నిమిషాల 30 సెకన్లు ఉండనుందని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ ట్రైలర్‌ను అక్టోబర్ 2న విడుదలవుతున్న కాంతారా చాప్టర్ 1 సినిమాతో పాటు థియేటర్లలో ప్రదర్శించనున్నారని సమాచారం. అంటే, కాంతారా సినిమా థియేటర్‌కి వెళ్ళిన ప్రేక్షకులకు ప్రభాస్ రాజాసాబ్ సినిమా ట్రైలర్ బోనస్ ఉండనుంది. ప్రభాస్ ఈసారి హారర్ ఫాంటసీ, రొమాంటిక్ ఎంటర్టైనర్ చిత్రంలో కనిపించనున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రభాస్ నుంచి చాలా రోజుల తర్వాత ఒక రొమాంటిక్ కంటెంట్ ఉన్న సినిమా వస్తుండటం వల్ల ఫ్యాన్స్ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. మూవీ టీం ఇప్పటికే షూటింగ్‌ను చాలావరకు పూర్తిచేసి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుతోంది.



సంక్రాంతి కానుకగా 2025 మొదట్లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ ట్రైలర్ విషయంలో ఇప్పటికే మేకర్స్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారికంగా విడుదల తేదీపై ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అక్టోబర్ 2న థియేటర్లలో ట్రైలర్ రావడం ఖాయంగా అనిపిస్తోంది. ఇక ఈ ట్రైలర్‌లో ప్రభాస్ పాత్ర ఎలా ఉండబోతుందో, సినిమా టోన్ ఏ విధంగా ఉంటుందో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## గోదారి గట్టుపైన



మేమ్ ఫేమస్‌తో స్ట్రాంగ్ డెబ్యు చేసిన న్యూ ఏజ్ యాక్టర్ సుమంత్ ప్రభాస్ గోదారి గట్టుపైన సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ కు ఫస్ట్ వెంచర్. ఎంఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. గురువారం మేకర్స్ గోదారి గట్టుపైన ఫస్ట్ బ్రీజ్‌ని రిలీజ్ చేశారు. లైట్ హౌస్ పైకి తన ప్రేమికురాలిని తీసుకెళ్లిన హీరో, గోదావరి సముద్రంలో కలిసిపోయే అద్భుత దృశ్యం చూపించే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. ఇదే సంగమం.. ఇక్కడే గోదారి సముద్రంలో కలుస్తుంది. ప్రకృతి ఎంత విచిత్రమైందో కదా. మంచినీరు ఉప్పునీరు వేరువేరు తత్వాలు అయినప్పటికీ రెండు ఒకటిగా కలిసిపోతున్నాయి. మనుషులు కూడా ఇలా బేధాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా అని సుమంత్ ప్రభాస్ చెప్పిన డైలాగ్ అందరినీ ఆకట్టుకుంది. గ్లింప్స్ చాలా ఫ్రెష్ అండ్ సోల్ ఫుల్ గా వుంది. రచన, దర్శకత్వంలో సుబాష్ చంద్ర ఆకట్టుకున్నారు. సుమంత్ ప్రభాస్ తన పాత్రలో ఇమిడిపోయారు, నిధి ప్రజెన్స్ కట్టిపడేసింది. జగపతి బాబు పాత్రకి ఇచ్చిన పరిచయం ఆసక్తి కలిగించేలా ఉంది. సాయి సంతోష్ చిత్రీకరించిన నేచురల్ విజువల్స్ కథలోని భావోద్వేగాలను మరింత అందంగా మలిచాయి. నాగ వంశీ కృష్ణ అందించిన సంగీతం అలరించింది. ప్రావల్య ప్రొడక్షన్ డిజైనర్‌గా, అనిల్ కుమార్ పి ఎడిటర్‌గా, నాగార్జున సౌండ్ డిజైనర్‌గా తమ వంతు నైపుణ్యం చూపారు. హృదయాన్ని హత్తుకునే కథా నేపథ్యం, సహజమైన నటన, క్రియేటివ్ టచ్ తో "గోదారి గట్టుపైన" ప్రేక్షకులకు మర్చిపోలేని అనుభూతి అందించబోతోంది. తారాగణం: సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ.

# భయాన్ని తరిమివేయండి

**చీకటి అంటే భయం.జంతువులను చూస్తే భయం,గట్టిగా మాట్లాడితే భయం ఈ భయం అనే పదం మనం ప్రతి రోజు ఎవరి నోటనో వింటూ ఉంటాం.అసలు భయం అంటే ఏమిటి? దీనిని ఎలా అధిగమించాలి?**

భయం అనేది మనిషిలో చిన్నప్పటి నుండి కొన్ని విషయాలలో గూడుకట్టుకుని ఉండేదే తప్ప బయట నుంచి పనిచేసే శక్తి కాదు .భయం వలన మనిషి ఎన్నో అవకాశాలను కోల్పోతాడు. ప్రతి చిన్న విషయానికి భయపడే వ్యక్తి ఏ పని చేయాలన్నా అందుకు అనువైన వంకలు వెతుక్కుని ఆ పని చేయకుండా ఉంటాడే తప్ప తాను ఏమి నష్ట పోయాడో గ్రహించడానికి ప్రయత్నించడు.కొందరికి లిఫ్ట్ ఎక్కాలంటే భయం. నేటి ఆధునిక కాలంలో దాదాపు ప్రతి



అపర్ట్మెంట్లో లిఫ్ట్ ఉంటుంది. మరి భయం ఉందని ప్రతి సారి ఎవరు తోడు వస్తారు. దాని నుంచి బయట పడటానికి ప్రయత్నించాలి. ఎప్పుడైతే ప్రయత్నం మొదలు పెడతాడో క్రమంగా ఆ భయం అనేది పోతుంది. ఫలానా పని చేయాలని మనిషి మనసులో ఎప్పుడైతే దృఢంగా అనుకుంటాడో, అందుకు ప్రయత్నిస్తాడో అప్పుడతనికి అతనిలోని సపోర్ట్ సిస్టం సహాయపడుతుంది. కొందరు తమలోని భయాలు పోగొట్టుకోవడానికి ప్రయత్నం చేయరు. తమకు దీనివల్ల భయమో, ఎందుకు భయపడుతున్నామో తెలిసినప్పటికి వాటిని వదలలేని ఆసక్తత. తమ భయాలను వీడకుండా వాటిని సంతృప్తి పరుచుకుంటూ వుంటారు. నిరంతరం ఏదో ఒక భయంతో ఉండే వ్యక్తులు దేనిమీద ఆసక్తి లేకుండా నీరసంగా ఉంటారు. ఎవరినీ కలవకుండా పొడిపొడిగా మాట్లాడుతూ నిరాశావాదిగా ఉంటారు. మనిషిలో నెలకొనే అర్థం లేని భయాలు సాధారణంగా చిన్నతనంలోనే తల్లిదండ్రుల ద్వారా సంక్రమిస్తాయి. వయసు పెరిగేకొద్దీ,చదువు ,స్నేహితుల వల్ల కొందరిలో భయాలు పటాపంచలు అవుతాయి. సమాజంలో ఉండే మూఢనమ్మకాలు తోడై భయాలు పెరుగుతాయి తప్ప సమసిపోవు. భయాలతో వణికిపోయే వారు ప్రధానంగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. అదేమిటంటే మనిషిలో అంతర్గతంగా శక్తి ఉంటుంది. దానిని పరీక్షించుకోనిదే ఆ శక్తి బయటపడదు. మనిషి తనకు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి సిద్ధపడితేనె తన శక్తి సామర్థ్యాలు వెలికి వస్తాయి. మనిషి పూర్తిగా నిర్వీర్యం చేసే భయాల్ని పారదోలితే జీవితంలో కొత్త వెలుగులు కనిపిస్తాయి. కొత్త శక్తి వస్తుంది. ముఖ్యంగా మనిషిలో ఉండే సపోర్టింగ్ సిస్టం సంపూర్ణంగా సహకరిస్తుంది. అందుకే భయం మిమ్మల్ని జయించకముందే, మీరే భయాన్ని జయించండి. మనలోని భయాన్ని పారదోలి హుషారుగా ఈ పాట పాడుకుందాం...జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ము లేదురాజంకు బొంకు లేక ముందు సాగిపొమ్మురా సాగిపొమ్మురా..

**- పాలపర్తి సంధ్యారాణి**

# స్ఫూర్తి నింపిన లెఫ్టినెంట్లు ..



ధైర్యం, శౌర్యం, సాహసం.. ఈ లక్షణాలన్నీ కనిపించేది సైనికుల్లోనే అవి తమలోనూ ఉన్నాయని నమ్మడమే కాదు, నిరూపించారీ మహిళలు. కుటుంబ స్ఫూర్తి అందుకుని ఒకరు, గుండెనిండా బాధని దిగమింగుకొని మరొకరు. చెన్నైలోని ఆపీసర్స్ ట్రైనింగ్ అకాడెమీ (ఓటిఎ)లో శిక్షణ పూర్తిచేసుకున్నారు. 155 మందిలో 25మంది మహిళలున్నారు. వాళ్లలో ఇద్దరు లెఫ్ట్‌నెంట్ల స్ఫూర్తి ప్రయాణమిది !

**అయిదో తరం:**


నాకు స్ఫూర్తి మా కుటుంబమే. మా ముత్తాతల నుంచి అందరూ దేశసేవకే అంకితమయ్యారు. ప్రస్తుతం నాన్న కేఎస్ ధద్వాల్ మేజర్ జనరల్‌గా, అన్నయ్య ధనంజయ్ కెప్టెన్ హోదాలో కొనసాగుతున్నారు. రెండూ '20 సిఖ్‌లు' పనిచేస్తున్నాయి. వారి సమక్షంలో గోల్డ్ మెడల్ తీసుకోవడం, నా తండ్రి నుంచి సెల్యూట్ అందుకోవడం మరిచిపోలేను. ఆర్మీ అధికారిగా దేశానికి ఉత్తమ సేవలందించడం ఒక్కటే నా ముందున్న లక్ష్యం.

కుటుంబం నుంచి వచ్చిన తరం ఆర్మీ అధికారిగా ఆమె చరిత్రకెక్కారు. ఇలాంటిది ఆర్మీలో చాలా అరుదంటూ అధికారులూ ప్రకటించారు. ఆ కుటుంబం నుంచి వచ్చిన తొలి మహిళా అధికారి కూడా పారుల్నే. చదువు తర్వాత పలు కెరియర్లవైపు ఆలోచనలు వెళ్లినా... ఏవీ ఆమెకు సంతృప్తిని ఇవ్వలేదు. వంశపారంపర్యంగా వస్తున్న దేశ సంరక్షణ సేవే ప్రధానమని ఆమెకు అనిపించింది. షార్ట్ సెలక్షన్ కమీషన్ ద్వారా ఆర్మీకి ఎంపికయ్యారు. శిక్షణలో తన బ్యాచ్ 155మందిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సిడెంట్స్ గోల్డ్‌మెడల్ సాధించారు.

**. వీరనారి' కోటాలో....** 'వీర నారి' కోటాలో ఆర్మీ శిక్షణకు ఎంపికై చెన్నై ఓటీఏకు వచ్చాను. ధ్యాన సాధనతో ఆ జ్ఞాపకాలు, కుంగుబాటు నుంచి బయటికి రాగలిగాను. ఇప్పుడు లెఫ్ట్‌నెంట్ హోదాలో ఆర్మీలోకి వెళ్తున్న విషయం.. ఎంతో ఆనందం కలిగిస్తోంది. ఇది ఆషామాషీగా రాలేదు. నా బిడ్డను మా అత్తదగ్గర వదిలి శిక్షణ పూర్తిచేశా. శిక్షణ సమయంలో తెలుసుకున్న విషయమేంటంటే.. విధిని నిందించకూడదు, ఎందుకంటే అది మన చేతుల్లో ఉండదు. దాన్ని అంగీకరించాల్సిందే, లేకపోతే భవిష్యత్తు ఉండదు. ముందుకెళ్తేనే విజయం సాధ్యం.

పారుల్ ధద్వాల్.. పంజాబ్ హోషియార్పూర్ జిల్లా జనౌరి గ్రామం. ఈ ఊరుకో ప్రత్యేకత ఉంది. దేశానికి సేవ చేసే సైనికులను అందించడంలో ముందుంటూ వస్తోంది. అక్కడి యువతకు ధద్వాల్ కుటుంబీకులే స్ఫూర్తి. ఎందుకంటే ఈ కుటుంబం నుంచే ఎంతోమంది సైన్యంలోకి వచ్చారు. మరో అరుదైన విషయమేంటంటే తన

ప్రియాం "మహారాష్ట్ర కొల్హాపూర్ జిల్లాలోని ఓ చిన్న గ్రామం నుంచి చెన్నై ఓటిఎకు ఎంపికై లెఫ్ట్‌నెంట్ అయ్యారు.. ప్రియాంక నీలేష్ ఖోట్. ఈమె గాథ ఆర్మీ అశికారుల్ని సైతం కదిలిస్తోంది. కదిలిస్తోంది. భర్త నాయక్ నీలేష్ ఖోట్. ఆర్మీ హెడ్క్వార్ట్స్‌లో సిగ్నల్స్ కార్ప్స్‌గా 13ఏళ్లపాటు ప్రయాణించారు. 2022లో గుండెపోటుతో మరణించారు. వారి జీవితం మీద కారుమబ్బులు ఉన్నాయి.అత్త సాయంతో స్థానిక పాఠశాలలో చేరారు ప్రియాంక. పిల్లలతో



మమేకమై తన బాధను మర్చిపోవాలని అనుకున్నారు. భరనత చనిపోకముందు తను సివిల్స్ రాయాలని అనుకున్నారు. ఆ ప్రయత్నంలో ఉండగా విధి అడ్డుకుది. టీచర్‌గా చేస్తున్నా, ఆలోచనలు ఆర్మీ చుట్టూనే తిరిగేవి. భర్తతో కలుసున్న మూడేళ్లలో సైన్యానికి సంబంధించి చాలా విషయాలు తెలుసుకున్న ప్రియాంక.. సైన్యంలో చేరితేనే తన జీవితానికీ ఓ అర్థం అనుకున్నారు.

**నేటి అలంకరణ**

# శ్రీ మహాలక్ష్మి దేవి



"లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం
శ్రీమన్మంద కటాక్ష లబ్ద విభవద్బ్రహ్మేంద్ర గంగాధరాం త్వాం త్రైలోక్య
కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం"

శ్రీ మహాలక్ష్మీ దేవి సర్వమంగళకారిణి. ఐశ్వర్యప్రదాయిని. అష్టలక్ష్ముల సమిష్టి రూపమే మహాలక్ష్మి. ఈ తల్లి క్షీరాబ్ధి పుత్రిక, చంద్రుని సహోదరి, శ్రీహరి పట్టపురాణి, డోలాసురుడనే రాక్షసుడ్ని సంహరించిన దేవత. శక్తిత్రయంలో ఈమె మధ్య శక్తి. ఈ దేవిని ఉపాసిస్తే ఫలితాలు శీఘ్రంగా కలుగుతాయని పురాణాలు చెపుతున్నాయి. 'యాదేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ స ంస్థితా' అంటే అన్ని జీవులలోను ఉండే లక్ష్మీ స్వరూపమే దుర్గాదేవి అని చండీసప్తశతి చెబుతోంది. కాబట్టి శరన్నవరాత్రులలో మహాలక్ష్మీదేవిని పూజిస్తే సర్వమంగళ మాంగల్యాలు కలుగుతాయి.

**అలంకార వస్త్రము :** గులాబి రంగు చీర

**పుష్పములు :** ఎరుపు రంగు పూలు

**నివేదన:** పూర్ణాలు, తామర పేలాల పాయసం, శొంఠి అన్నం

**మంత్రం:** "ఓం శ్రీం హ్రీం క్లీం మహాలక్ష్మి స్వాహా" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.

**- నట్టిప్రోలు నటరాజకుమార్**

# నేడు ముద్దపప్ప బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో మూడవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను మూడు ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు.

**ఈ రోజు నైవేద్యం :** శనగపప్పు, బెల్లం, పాలు

# దుర్గామాత మెచ్చే నైవేద్యాలు



**చిట్టిగారెలు :** తొమ్మిది రోజులు దుర్గమ్మ మహిషాసురుడితో యుద్ధం చేస్తుంది. అలసట రాకుండా 'మాష చక్రములు' అంటే చిట్టి గారెల్ని పెడతారు. అమ్మ వారికి ఇష్టమైన మినుములతో వీటిని చేస్తారు.



**కట్టెపొంగలి:** పెసరపప్పు బియ్యం, జీలకర్ర, అల్లం, పచ్చి వేసి తయారు చేసే కట్టె పొంగలిని భవానీ మాత, ఎంతో ఇష్టంగా ఆరగిస్తుందాట.



పులిహోర కూడా ఒకటి. పోపు సామగ్రి వేసి రుచికరంగా చేసే దీన్ని అమ్మ వారు ఇష్టంగా ఆరగిస్తారనేది నమ్మకం.

**గుడాన్నం :** లలితా సహస్రనామాల్లో 'గూడాన్నః ప్రీత మానస' అంటూ చదువుకుంటాం ఇది అమ్మవారికి ఎంతో ఇష్టమైన ప్రసాదం. పెసరపప్పు, బియ్యం ఉడకబెట్టి బెల్లం, సుగంధ ద్రవ్యాల పొడి, నెయ్యి, ఎండు ఫలాలను వేసి తయారు చేస్తారు. సకల శుభాలూ అందించమని కోరుతారు.



**నువ్వులన్నం :** నువ్వులు, కొబ్బరి ఉప్పు, కారం వేసి ఈ అన్నాన్ని వండుతారు. అసురులతో పోరాడే కాళికకు నువ్వుల్లో ఉండే విష్ణుశక్తి తోడవ్వాలని కోరుకుంటూ ప్రసాదంగా నివేదిస్తారు.



**దద్యోజనం :** శాంతి రూపాన్ని కోరుకుంటూ, అందరికీ చల్లని దీవెనలు అందించమంటూ అన్నపూర్ణాదేవికి పెరుగుతో చేసిన దద్యోజనం ప్రసాదంగా నివేదిస్తారు.



**అప్పాలు :** అమ్మవారి క్షేత్రపాలకుడు ద్రవ్యాల పొడి వాడి వీటిని చేస్తారు.



**చిత్రాన్నం :** దుర్గమ్మ మెచ్చే ప్రసాదాల్లో నిమ్మకాయ



**శాకాన్నం :** తొమ్మిది రకాల కూరగాయలు, తొమ్మిది రకాల సుగంధ ద్రవ్యాలపొడి వేసి నవశక్తికి నైవేద్యంగా అమ్మకు పెడతారు.

**కదంబర ప్రసాదం :** దశమిరోజున పదకొండు రకాల కూరగాయలు, పప్పు, బియ్యంతో చేసిన కదంబాన్ని అమ్మవారికి నైవేద్యంగా నివేదిస్తారు. ❑



# థైరాయిడ్‌ను తగ్గించే బ్రెజిల్ నట్స్

బాదం, పిస్తా, జీడిపప్పుల్లా బ్రెజిల్ నట్స్ కూడా మంచి పోషకాహారం. రోజుకు ఒకటి లేదా రెండు గింజలు నానబెట్టి తినడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో చూడండి.



✦ బ్రెజిల్ నట్స్ తినటం వల్ల శరీరానికి ప్రొటీన్లు, పీచు, సెలీనియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, భాస్వరం, పొటాషియం, క్యాల్షియం, జింక్, ఐరన్ బి1, బి6 ఇ విటమిన్లు అందుతాయి. ✦ రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ✦ వీటిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు విస్తారంగా ఉన్నాయి. ✦ థైరాయిడ్‌ను తగ్గించటంలో సాయపడతాయి. ✦ కొలెస్ట్రాల్ స్థాయిని అదుపులో ఉంచుతాయి. ✦ మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఉద్దేగాలను నియంత్రించటంలో తోడ్పడతాయి. ✦ క్రమం తప్పకుండా తింటుంటే ఎముకలు, దంతాలు దృఢంగా ఉంటాయి. మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. అలర్జీ సమస్య ఉనననవారికి ఇవి సరిపడవు అలాంటివారు వీటికి దూరంగా ఉండాలి. అలాగే వీటిని మోతాదుకు మించి తింటే పేగుల్లో సమస్య, మగత, విసుగు, మూత్రపిండాలు దెబ్బతినటం, గుండెజబ్బులు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కనుక వైద్యుని సలహాతో తినటం శ్రేయస్కరం. ❑

# అవెన్ పేలాలు

పాప్ కార్న్ ఇష్టపడని వాళ్లుంటారా? ఇవి కొని తినడమే గానీ ఇంట్లో చేసుకోవడం కష్టం కదూ! కానీ ఇప్పుడా బాధ లేదు. అవెన్ పాప్‌కార్న్ పాపర్ వచ్చేసింది. ఎండిన మొక్కజొన్న గింజలను ఈ జార్‌లో వేస్తే మూడు నిమిషాల్లో పేపేలాలైపోతాయి. నూనె లేదా నెయ్యి జోడించ నవసం లేదు కనుక ఆరోగ్యానికి మంచిది. బోరోసిలికేట్ గ్లాస్‌తో రూపొందిన ఈ పరికరం ప్రమాదాలకు తావీయదు, ఎక్కువకాలం మన్నుతుంది. కబోర్డ్‌లో పెద్దగా స్థలం కూడా ఆక్రమించదు. దీన్ని డిషవాషర్‌తోనూ శుభ్రం చేయొచ్చు. ❑

# గునుగులో ఔషధాలు

**ప్రకృతి పచ్చగా కళకళలాడుతున్నప్పుడు** వచ్చే పూల పండుగే బతుకమ్మ. దసరా నాటికి పడ్డ వర్షాలతో బీడుభూముల్లో పూల తివాచీలా పరచుకుంటాయి గునుగు పూల మొక్కలు. ఇవి పేరుకి గడ్డి జాతి పువ్వులే కానీ బతుకమ్మ అలంకరణలో శోభంతా వీటిదే. గాలికి ఊగుతూ తెలుపు, గులాబీ రంగులతో మెరిపోతూ కనిపిందు చేస్తాయివి. గునుగు పూలను ప్రపంచవ్యాప్తంగా అలంకరణకోసం ఉపయోగిస్తారు. ఈ పూల మొక్కకు ఔషధ గుణాలు ఎక్కువే. ముఖ్యంగా యాంటీ బ్యాక్టీరియల్,యాంటీ డయాబెటిక్,యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు దీనిలో పుష్కలంగా ఉంటాయి. వీటి ఆకులు చర్మంపై గాయాలు, పండ్లను తగ్గించగలవట. అధిక రక్తపోటుని నియంనరతించగలవట. యూరినరీ ఇన్ఫెక్షన్లు, మలబద్ధకం నివారణ లోనూ ఈ మొక్క ఉపయోగపడుతుందని చెబుతోంది ఆయుర్వేదం. ❑



# లావొక్కటే కారణం కాదు !

**అమ్మాయిల రజస్వల వయసు అంటే టీనేజీ ప్రారంభం. కానీ కొన్నేళ్లుగా ఈ వయసు తగ్గుతోంది. పదేళ్లలోపు చిన్నారుల్లోనూ నెలసరి మొదలవుతున్న పరిస్థితి. అయితే ప్రాచుర్యంలో ఉన్నట్టు దీనికి అధిక బరువుఒక్కటే కారణం కాదనీ, అంతకు మించి ఉన్నా యంటున్నారు పరిశోధకులు.**

స్థూలకాయం, అధిక బరువు కారణంగా అమ్మాయిల్లో రజస్వల వయసు తగ్గుతోందని నమ్ముతూ వస్తున్నారు పరిశోధకులు. అది వాస్తవమేనని చెబుతూనే..దీని వెనక మరెన్నో కారణాలు ఉన్నాయంటున్నాయి. తాజా పరిశోధనలు. హార్మోన్లపైన నేరుగ ప్రభావం చూపే రసాయనాలు వాతావరణంలో పెరగడం, చక్కెర నిల్వలు ఎక్కువగా ఉండే పానీయాలు తీసుకోవడం, బాల్యంలో ప్రతికూల అనుభవాలు ఎదురవ్వడం, ఒత్తిడి..ఇవన్నీ కారణాలు కావొచ్చని



తాజా లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో తెలిపారు హార్వర్డ్- ఎన్విరాన్మెంటల్ హెల్త్ విభాగం పరిశోధకులు. ఈ కోణాల్లో పరిశోధిస్తే రజస్వల ప్రక్రియను ఆలస్యం చేయొచ్చు లేదంటే నెమ్మది కావచొచ్చంటున్నారు. ఒత్తిడి, గ్రంథుల వ్యవస్థను ధ్వంసం చేసే రసాయానలతో పాటు మరికొన్ని గణించలేని అధ్యయనం చేయని అంశాలూ ఉన్నాయని కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. ఆహారపుటలవాట్లలో మార్పులు, శారీరక శ్రమని తగ్గించే పరిసరాలు, ఒత్తిడిని పెంచే సోషల్ మీడియా, రంగుని దృష్టిలో పెట్టుకుని వచ్చే క్రీముల్లో ఉండే హానికర రసాయనాలు.. ఇవన్నీ అందుకు కారణాలుగా నిలుస్తున్నాయనేది వీరు చెప్పే మాట. ❑

# ఫేస్‌ప్యాక్‌లో పసుపు

ముఖ సౌందర్యాన్ని ఇనుమడింపజేయడంలో పసుపుది కీలక పాత్ర. అందుకే ఫేస్‌ప్యాక్, స్క్రబ్.. వంటివి తయారుచేసే క్రమంలో దీన్ని విరివిగా వాడుతుంటాం. ఇందులోని సుగుణాలు, ఔషధ గుణాలు పలు చర్మ సంబంధిత సమస్యల్ని దూరం చేసి మోముకు మెరుపును అందిస్తాయి. అయితే దీన్ని వాడే క్రమంలో మనం చేసేకొన్ని పొరపాట్లు చర్మ అందాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు. మరి, ఇంతకీ అవేంటో తెలుసుకొని సరిదిద్దుకుందాంరండి.

**20 నిమిషాలకు మించి వద్దు .......**

పసుపు రోజ్‌వాటర్, పాలు, నీళ్లు.. వంటి పదార్థాల్లో కలుపుకొని ముఖానికి పూతలు వేసుకోవడం మనకు అలవాటే? అయితే ఈ క్రమంలో కొంతమంది ఎక్కువ మెరుపు రావాలన్న ఉద్దేశంతో నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు ఆ ప్యాక్ తొలగించకుండా అలానే ఉండిపోతారు. నిజానికి పసుపు కలిపిన ఫేస్‌ప్యాకన/ స్క్రబ్ ఏదైనా సరే. 20 నిమిషాలకు మించి ఉంచుకోవద్దని చెబుతున్నారు నిపుణులు. ఒకవేళ అంతకంటే ఎక్కువ సమయం పాటు శుభ్రం చేసుకోకుండా ఉండిపోతే.. ముఖంపై పసుపు రంగు మాదిరి మచ్చలు ఏర్పడడంతో పాటు మొటిమలు కూడా వచ్చే ప్రమాదం ఉందట.

**సబ్బు వాడద్దు ! ....** సాధారణంగా ముఖం కడుక్కోవాలనుకున్నప్పుడు సబ్బు ఉపయోగించడం మనకు అలవాటే! ఫేస్‌ప్యాక్/స్క్రబ్ వేసుకున్నా. తొలగించుకునే క్రమంలో సబ్బుతో రుద్దుకొని మరీ శుభ్రం చేసుకుంటాం. అయితే పసుపుతో వేసుకున్న ఫేస్‌ప్యాక్/స్క్రబ్.. వంటివి తొలగించుకునే క్రమంలో సబ్బు వాడద్దంటున్నారు నిపుణులు. అయితే మూడు నాలుగ్గంటల తర్వాత మాత్రం గాఢత తక్కువగా ఉండే ఫేస్‌వాష్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకోమంటున్నారు. ఈ విషయంలో మీకేమైనా సందేహాలుంటే నిపుణుల సలహాలు తీసుకోవచ్చు. అలాగే ముఖం కడుక్కున్నాక మాయిశ్చరైజర్ రాసుకోవడం మర్చిపోకండి.

**ఈ విషయంలో జాగ్రత్త!...** కళ్ల కింద నల్లటి వలయాలు,క్యారీ బ్యాగుల్ని దూరం చేసుకోవడానికి..కంటి అలసటను తగ్గించడానికి కొంతమంది కొన్ని ఐ ప్యాక్స్ వేసుకుంటారు. అయితే ఇలాంటి వాటిలో పసుపు వాడకపోవడమే మంచిదం టున్నారు నిపుణులు. వీటితో పాటు పసుపు ఉపయోగించి తయారు చేసి ఫేస్‌ప్యాక్స్ ముఖంపై సమానంగా పరచుకునేలా వేసుకోవడం, పూర్తి తొలగి పోయేలా శుభ్రం చేసు కోవడమూ ముఖ్యమే! అలాగే ఈ క్రమంలో వేడినీటి కంటే చల్లటి/గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న నీటినే వాడమంటు న్నారు నిపుణులు. ❑

ఆట

## ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్: హార్విందర్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** పారాలింపిక్ ఛాంపియన్ హార్విందర్ సింగ్ ప్రపంచ ఆర్చరీ పారా ఛాంపియన్‌షిప్‌ల నుంచి వైదొలిగాడు. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో గురువారం జరిగిన 2025 ప్రపంచ ఆర్చరీ పారా ఛాంపియన్‌షిప్‌లో అనారోగ్యం కారణంగా పారాలింపిక్ ఛాంపియన్ హార్విందర్ సింగ్ వ్యక్తిగత ఎలిమినేషన్ రౌండ్ నుండి నిష్క్రమించాడు. రెండుసార్లు పారాలింపిక్ పతక విజేత రికర్వ్ ఆర్చర్ తన తొలి వ్యక్తిగత ప్రపంచ పతకాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తు, అతను పోటీ నుండి వైదొలగాల్సి వచ్చింది. అలాగే పురుషుల మరియు మహిళల వ్యక్తిగత విభాగాలలో ఆదిల్ మొహమ్మద్ అన్సారీ, శ్రియ జోషి ఇద్దరూ తమ ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో ఓడిపోవడంతో డబ్ల్యూ1 విభాగంలో భారత్ మరో ఎదురుదెబ్బను ఎదుర్కొంది. గ్వాంగ్జులో అంతర్జాతీయ అరంగేట్రం చేస్తున్న శ్రియ, చ్చియాకు చెందిన రెండవ సీడ్ సరికా ముసిలోవా చేతిలో ఓడిపోగా, ఆదిల్ చైనాకు చెందిన టాప్ సీడ్ టియాక్సిన్ జాన్ చేతిలో ఓడిపోయింది. శీతల్ దేవి మరియు రాకేష్ కుమార్‌తో సహా అగ్రశ్రేణి భారత కాంపౌండ్ ఆర్చర్లు, అలాగే మహిళల రికర్వ్‌లో పూజా జత్యన్ కూడా రోజు తర్వాత తమ వ్యక్తిగత ఎలిమినేషన్ రౌండ్లను ప్రారంభిస్తారు.

## ఫుట్‌బాల్ ఆసియా కప్‌లో భారత్ విజయం

### 1-4 తేడాతో మంగోలియా ఓటమి



**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి ఫుట్‌బాల్ ఆసియా కప్ 2026 క్వాలిఫయర్స్‌లో మంగోలియాను ఓడించి భారత్ తొలి ఫుట్సల్ విజయం సాధించింది. కువైట్‌లో జరుగుతున్న ఫుట్‌బాల్ ఆసియా కప్ 2026 క్వాలిఫయర్స్ భారత్‌కు అగ్ని పరీక్ష లాంటిది. ఆతిథ్య కువైట్ చేతిలో 1-4 తేడాతో ఓడిన తర్వాత, ఆస్ట్రేలియా చేతిలో 1-10 తేడాతో పరాజయం పాలైంది. కానీ నేడు జరిగిన చివరి గ్రూప్ ఎ మ్యాచ్‌లో ఫుట్‌బాల్ టైగర్స్ మంగోలియాను 3-0 తేడాతో ఓడించి పట్టికలను తిప్పికొట్టింది, ఇది భారత్ యొక్క అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మొట్టమొదటి విజయంగా నమోదైంది. మంగోలియాపై, ఫుట్‌బాల్ టైగర్స్ తన పూర్తి శక్తియుక్తిలను ఉపయోగించి ఆట 17వ నిమిషంలో సియోన్ డిసౌజా గోల్ ఖాతా తెరిచాడు. తదుపరి 33వ నిమిషంలో మరో గోల్ చేశాడు. రెండు నిమిషాల తర్వాత, అన్మోల్ అధికారి మంగోలియన్ గోల్ చేసి మ్యాచ్‌ను ముగించాడు. ఈ మొట్టమొదటి ఫుట్‌బాల్ విజయం అయినప్పటికీ, 14 సంవత్సరాలకు పైగా అంతర్జాతీయ ఫుట్‌బాల్ అనుభవంతో 110వ స్థానంలో ఉన్న మంగోలియన్ జట్టుపై ఈ విజయం భారత్‌కు కీలకంగామారింది.



## జూనియర్ వరల్డ్ కప్‌లో.. భారత్‌కు తొలి రోజు 5 పతకాలు

**న్యూఢిల్లీ:** భారత్ తమ ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. తొలి రోజు గురువారం ఐదు పతకాలతో, స్వదేశంలో భారత్ తన ఆధిపత్యాన్ని నొక్కి చెప్పింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ పోడియంను భారత్ కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో రజత, కాంస్య పతకాలను గెలుచుకుంది. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో మహిళా షూటర్లు మూడు పోడియం స్థానాలను కైవసం చేసుకున్నారు. డాక్టర్ కర్ణి సింగ్ రేంజ్స్‌లో జరిగిన ఈవెంట్ ప్రారంభ రోజున పురుషులు రజతం మరియు కాంస్య పతకాలను జోడించారు. యువ అనుష్క థోకూర్ 621.6 స్కోరుతో మహిళల టైటిల్‌ను గెలుచుకుంది. 18 ఏళ్ల ఈ థోకూర్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో జూనియర్ స్వర్ణం సాధించింది. ఆమె తర్వాతి స్థానంలో 18 ఏళ్ల అన్నిక 619.2 పాయింట్లతో రజతం గెలుచుకుంది. 20 ఏళ్ల ఆధ్యా అగర్వాల్ 615.9 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. ఆతిథ్య జట్టు క్లీన్ స్వీప్ చేసింది. పురుషుల ఈవెంట్ కూడా భారతదేశానికి విజయాన్ని తెచ్చిపెట్టింది, దీపేంద్ర సింగ్ షెకావత్ మరియు రోహిత్ కన్యన్ తమ తొలి అంతర్జాతీయ పతకాలను సాధించారు. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో పోటీ పడిన దీపేంద్ర, 10 షాట్‌ల ఆరు సిరీస్‌లలో 617.9 పాయింట్లు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. రోహిత్ 616.3 పాయింట్లతో కాంస్యం సాధించాడు. 11 షూటర్ ఫీల్డ్‌లో 618.9 పాయింట్లు సాధించిన ఇండివిజువల్ న్యూట్రల్ అథ్లెట్ షూటర్ కమిల్ నురియాఖ్మెటోవ్‌కు బంగారు పతకం దక్కింది. ఇతర భారతీయులలో, కజకిస్తాన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతక విజేత నితిన్ వాగ్మారే (615.6) ఐదవ స్థానంలో నిలిచారు, కుషాగ్రా సింగ్ (611.6), కునాల్ శర్మ (590.9) వరుసగా ఎనిమిదవ మరియు పదకొండవ స్థానంలో నిలిచారు.

## ఆసియా కప్: నేడు భారత్, శ్రీలంక డే





### సూపర్ ఫోర్‌లో 6వ మ్యాచ్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025, సూపర్ ఫోర్‌లో భాగంగా ఇండియా శ్రీలంక మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ నెల 26వ తేదీ, శుక్రవారం దుబాయ్‌లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఆసియా కప్ సూపర్ ఫోర్స్ దశలోని ఆరవ మ్యాచ్‌లో భారత్ లంకేయులతో తలపడనుంది. అయితే టీమిండియా ఇప్పటికే ఫైనల్‌కు చేరుకోగా, శ్రీలంక పోటీ నుండి నిష్క్రమించింది. బంగ్లాదేశ్‌పై 41 పరుగుల తేడాతో సునాయాసంగా విజయం సాధించిన భారత్, సూపర్ ఫోర్స్‌లో రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు నమోదు చేసి, అగ్రస్థానంలో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. అభిషేక్ శర్మ 37 బంతుల్లో 75 పరుగులు, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ బౌలింగ్ తో జట్టు అజేయంగా నిలిచింది. నాలుగు పాయింట్లు, మంచి నెట్ రన్ రేట్ తో సూర్యకుమార్ యాదవ్ సేన శ్రీలంక మ్యాచ్‌లో తమ కాంబినేషన్లను మెరుగుపరుచుకునే అవకాశంగా ఉంది. భారత్ జట్టులో అభిషేక్ శర్మ ఇప్పటివరకు అత్యుత్తమ బ్యాట్స్‌మన్. అతను ఆడిన ఐదు ఆటలలో, శర్మ 49.60 సగటు మరియు 206.66 స్ట్రైక్ రేట్‌తో 248 పరుగులు చేయగలిగాడు.

భారత జట్టు ఫైనల్ పోరుకు వెళ్లే ముందు తదుపరి ఆటలో మరో అద్భుతమైన ఆటతీరును కనబరిచే అవకాశం ఉంది. అలాగే శ్రీలంక మ్యాచ్‌లో భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ జాగ్రత్తగా ఆడాల్సిన బౌలర్ కావచ్చు. ఐదు ఇన్నింగ్స్‌లలో యాదవ్ 8.08 సగటుతో 12 వికెట్లు పడగొట్టి 5.65 ఎకానమీ రేటును కలిగి ఉన్నాడు. రాబోయే మ్యాచ్‌లో కూడా ఈ చైనామన్ ఆటగాడు ఇదే జోరును కొనసాగించనున్నాడు. మరోవైపు శ్రీలంక జట్టు నిరాశతో ఉంది. లంకేయులు ఆడిన బంగ్లాదేశ్, పాకిస్తాన్ రెండింటితోనూ జరిగిన మ్యాచ్‌ల్లో ఓటమిపాలయింది. రెండు మ్యాచ్‌లలో సున్నా పాయింట్లతో, శ్రీలంక అధికారికంగా పోటీ నుండి నిష్క్రమించింది. ఈ నిరుత్సాహంతో ఉన్న లంక టీమిండియాతో ఏ మేరకు విజయం సాధించుతుందనేది అనుమానమే. ఇక పిచ్ గూర్చి చూస్తే దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఇటీవల జరుగుతున్న కాంటినెంటల్ పోటీలలో బ్యాట్స్‌మెన్‌కు అనుకూలమైన వేదికగా మారింది. మిడిల్ ఓవర్లలో గోల్ చేయడం సవాలుతో కూడుకున్నప్పటికీ, పవర్‌ప్లే మరియు డెత్ ఓవర్లలో బ్యాట్స్‌మెన్ స్వేచ్ఛగా ఆడటం సులభంగా ఉంటుంది. ఇక్కడ ఛేజింగ్ చేసే జట్లకు పిచ్ మరింత సహాయకారిగా ఉంటుందని భావిస్తున్నారు.

## కొరియా ఓపెన్‌లో ప్రణయ్ నిష్క్రమణ

### అనుపమ, ఆయుష్, కిరణ్ ఓటమి



**న్యూఢిల్లీ:** కొరియా ఓపెన్ 2025లో హెచ్ఎస్ ప్రణయ్ మధ్యలోనే టోర్నీ నుండి నిష్క్రమించడంతో భారత్ ప్రచారం మొదటి రౌండ్‌లోనే ముగిసింది. దక్షిణ కొరియాలో జరిగిన కొరియా ఓపెన్‌లో ప్రణయ్‌తో సహా అందరు షట్లర్లు ముందుకు సాగకపోవడంతో భారత నిరాశపరిచింది. ప్రణయ్ ఆటమధ్యలో వైదొలగగా, మిగిలిన ఆయుష్ శెట్టి, కిరణ్ జార్జ్, అనుపమ ఉపాధ్యాయ వంటి ఇతర భారతీయులు కూడా ప్రారంభంలోనే నిష్క్రమించారు. ఇక పురుషుల సింగిల్స్ ప్రారంభ మ్యాచ్ ప్రారంభమైన 12 నిమిషాలకే, ఇండోనేషియాకు చెందిన చికో ఆరాద్వి వార్డోయోతో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ గాయం కారణంగా టోర్నీ నుండి వైదొలగాడు. ప్రణయ్ 8-16తో వెనుకబడిన సమయంలో క్రాస్ కోర్ట్ స్మాష్ భారత ఆటగాడు ఆఫ్ గార్డ్‌కు క్యాచ్ ఇవ్వడంతో అతను మ్యాచ్‌ను మధ్యలో వదిలివేయాల్సి వచ్చింది. పురుషుల సింగిల్స్‌లో, శెట్టి 18-21, 18-21 తేడాతో సు లి యాంగ్ చేతిలో ఓడిపోగా, కిరణ్ జార్జ్ సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూ చేతిలో 55 నిమిషాల్లో 14-21, 22-20, 14-21 తేడాతో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అనుపమ ఉపాధ్యాయ ఇండోనేషియాకు చెందిన నాల్గవ సీడ్ పుత్రి కుసుమ వార్దానీ చేతిలో 16-21, 15-21 తేడాతో వరుస సెట్లలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్ జగ్లాన్ మరియు లక్షిత జగ్లాన్ జంట కూడా మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. భారత జంట యుచి షిమోగామి మరియు సయాకా హోబారా జంట చేతిలో 7-21, 14-21 తేడాతో వరుస సెట్లలో ఓడిపోయింది.



వాణిజ్యం

## రూ.13 వేల కోట్ల నిధుల సమీకరణకు ఐపిఒ రూటులో 15 కంపెనీలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** భారత్‌లోని ఫార్మారంగం హెల్త్‌కేర్ ఫరిశ్రమలు ఐపిఒలకు సిద్ధం అవుతున్నాయి. సుమారు 12 వేల కోట్లనుంచి రూ.13 వేల కోట్లవరకూ ఐపిఒలు జారీచేసి నిధులు సమీకరించుకోవాలని నిర్ణయించాయి. రానున్న ఆరునుంచి తొమ్మిదినెలల్లోనే మొత్తం 15 కంపెనీలు ప్రైమరీ మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఈ కంపెనీలన్నీ కూడా సెబీ వద్ద డ్రాఫ్టరెడ్ హెర్రింగ్‌ప్రాస్పెక్టస్‌లను దాఖలుచేసాయి. ఇందిరా ఐవిఎఫ్ గత జులైలోనే రూ.3500 కోట్లమేర సేకరించాలని నిర్ణయిస్తే సహజానంద్‌మెడికల్ టెక్నాలజీస్ రూ.1500 కోట్ల ఇష్యూతో వస్తోంది. ఇతర ఫైలింగ్స్ చూస్తే నెఫ్రోప్లస్ సుమారు రు.2వేల కోట్లు, మాల్‌బయో డయాగ్నస్టిక్స్ రూ.200 కోట్లు, కోటెక్ హెల్‌నతకేర్ రూ.500 కోట్లతో వస్తుండగా సుదీప్ ఫార్మా రూ.95 కోట్లకు సెబీవద్ద దరఖాస్తులుచేసాయి. ఇక గాడియమ్ ఐవిఎఫ్, వుమన్ హెల్త్ కూడా రూ.500 కోట్లతో ఐపిఒలకు వస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే సెబీనుంచి అనుమతులు సాధించాయి. రుబికాన్ రీసెర్చ్ 1085 కోట్లు, కరోనా రెమిడీస్ రూ.800 కోట్లు, ఇతర ఆమోదం పొందిన సంస్థల్లో పరమేవుబయోటెక్ రూ.600 కోట్లు, ఆల్‌కెమ్ లైఫ్‌సైన్సెస్ రూ.190 కోట్లు, పరాస్ హెల్త్‌కేర్ రూ.900 కోట్లు, వీడా క్లినికల్ రీసెర్చి రూ.500 కోట్లు, గుజరాత్ కిడ్నీ, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి రూ.128 కోట్లకు ఐపిఒలు జారీచేసేందుకు ఇప్పటికే అనుమతులు సాధించాయి. శామ్‌కో సెక్యూరిటీస్ రీసెర్చి అనలిస్టు సౌరవ్ చౌబే మాట్లాడుతూ పునరుత్పత్తి విభాగంలో వ్యూహాత్మక మార్పులు వస్తున్నాయని ఇన్వెస్టర్‌ల ఆసక్తికూడా ఈ రంగంపై పెరుగుతోందని అన్నారు. దీనికితోడు నపుంసకత్వం కేసులు రోజురోజుకూ పెరుగుతుండటంతో ఎఆర్‌టి వైద్యవ్యవస్థకు ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. ఈ రంగం సమిష్టిగా 15 శాతంమేర వృద్ధికి అవకాశం ఉందన్నారు. ఇందిరా ఐవిఎఫ్, గాడియమ్ ఐవిఎఫ్‌లు రహస్యరూటులో ఐపిఒలకు వస్తున్నాయి. కొవిడ్‌కాలంనుంచే ఎక్కువగా భారత్, ఇండియాలు ఈ రెండురంగాల్లో పెట్టుబడులనుప్రోత్సహిస్తున్నట్లు ఆనంద్‌రాఠి సలహాసంస్థ సిఇఒ సమీర్ బెహల్ అన్నారు.

## 95% సంపద దాతృత్వానికే!

### ప్రపంచ దిగ్గజ బిలియనీర్ ఎల్లిసన్



**ముంబయి, సెప్టెంబరు 25:** ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, టెక్ దిగ్గజం ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సంచలన నిర్ణయం ప్రకటించారు. తన మొత్తం సంపదలో 95 శాతాన్ని దానం చేయాలని నిర్ణయించుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీలోచూస్తే లారీ ఎల్లిసన్ సంపద ప్రస్తుతం 393 బిలియన్ డాలర్లు (రూ. 34.6 లక్షల కోట్లు). ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వచ్చిన అనూహ్యమైన వృద్ధి కారణంగా 2025లో ఒరాకిల్ షేర్ల విలువ భారీగా పెరిగింది. కంపెనీలో ఇప్పటికీ 41 శాతం వాటా ఉన్న ఎల్లిసన్ సంపద ఒక్క రోజులోనే అమాంతం పెరిగింది. దీనికి తోడు టెస్లాలో కూడా ఆయనకు గణనీయమైన వాటాలు ఉన్నాయి. ఇక తన సంపదను దాతృత్వానికి వినియోగిస్తానని 2010లోనే ఎల్లిసన్ 'గివింగ్ ప్లెడ్జ్' తీసుకున్నారు. ఇందులో భాగంగా తన సంపదలో 95 శాతం విరాళంగా ఇస్తానని ప్రతిజ్ఞ చేశారు. అయితే, ఆయన ఇతర బిలియనీర్లలా సంప్రదాయ స్వచ్ఛంద సంస్థల వైపు మొగ్గు చూపడం లేదు. దానికి బదులుగా తన సొంత సంస్థల ద్వారానే ఈ బృహత్కార్యాన్ని చేపట్టాలని ఎల్లిసన్ భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎల్లిసన్ తన దాతృత్వ కార్యక్రమాల్ని ప్రధానంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన లాభాపేక్ష లేని సంస్థ ఎల్లిసన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ద్వారా కొనసాగిస్తున్నారు. ఇది ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, వాతావరణ మార్పులు, తి। పరిశోధన.. ఈ నాలుగు కీలకమైన ప్రపంచ సవాళ్లపై దృష్టి సారిస్తోంది.



## ఒక్కరోజులో రూ.3 లక్షలకోట్లు ఆవిరి!

**ముంబయి, సెప్టెంబరు 25:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజు నష్టపోయాయి. మెటల్ సూచీలు మినహా మిగతా రంగాల్లో అమ్మకాలతో మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ట్రంప్ హెచ్1బీ పాలసీ నేపథ్యంలో మరోసారి ఐటీ స్టాక్స్ భారీగా పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,574.31 పాయింట్ల నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,092.89 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్ 81,840.73 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది. చివరగా 555.95 పాయింట్లు పతనమై.. 81,159.68 వద్ద స్థిరపడింది. ఒక్కరోజులోనే బిఎస్ఇ మూడు లక్షలకోట్ల మేర టర్నోవర్ లాస్ అయినట్లు తేలింది. ఎన్ఎస్ఇ నిఫ్టీకూడా 166.05 పాయింట్లు తగ్గి 24,890.85 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు దాదాపు 1,405 షేర్లు లాభపడగా.. 2,586 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా మోటార్స్, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, టీసీఎస్, పవర్ గ్రిడ్ నష్టాలను చవిచూశాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిండాల్కో, యాక్సిస్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, హీరో మోటోకార్ప్ లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే మెటల్ 0.22 శాతం లాభపడగా.. మిగతా అన్ని సూచీలు కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, పవర్, రియాల్టీ ఒక్కొక్కటి ఒకశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.7శాతం తగ్గాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ సర్కారు ఇటీవల హెచ్1బీ వీసాపై చేసిన ప్రకటన ఐటీ కంపెనీల షేర్లు నష్టాలను పెంచింది. ఇప్పటివరకు వరుసగా ఐదు సెషన్లలో నష్టాలను నమోదు చేయడంలో ఈ ఇండెక్స్ ఇప్పుడు 6శాతానికిపైగా పడిపోయింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (గిదిళీ) షేర్లు ఇండెక్స్‌లో అత్యధికంగా నష్టపోయాయి. 2.5 శాతానికి పైగా పడిపోయి 52 వారాల కనిష్ట స్థాయి రూ.2,956.90కి చేరుకున్నాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు దాదాపు 2శాతం తగ్గాయి.

## రూ.40వేలకోట్లతో ఫుడ్‌ప్రాసెస్ ఇండస్ట్రీస్

### ఒకటి కర్నూలు, 2 మహారాష్ట్రలో.. కేంద్ర ఆహార మంత్రిత్వశాఖతో రిలయన్స్ ఒప్పందం

**ముంబయి, సెప్టెంబరు 25:** రియలన్స్ కన్స్యూమర్ ఉత్పత్తులవిభాగం కేంద్ర ఆహారమంత్రిత్వశాఖతో ఒప్పందం చేసుకుంది. రూ.40 వేల కోట్లతో ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఒడంబడికపై ఢిల్లీలో జరిగిన వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో సంతకాలు జరిగాయి. గత ఆగస్టులోనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇందుకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించింది. ఆసియాలోనే అతిపెద్ద సమీకృత ఫుడ్ పార్కులు ఎఐ ఆధారిత యాంత్రీయకరణ, రోబోటిక్స్, అధునాతన టెక్నాలజీతో వీటిని నిర్మిస్తామని ప్రకటించింది. రిలయన్స్ కన్స్యూమర్ విభాగం రిలయన్స్ రిటైల్‌నుంచి వచ్చిందే. రిలయన్స్‌గ్రూప్‌తో నేరుగా అనుబంధ సంస్థగా నిలుస్తోంది. స్థాపించిన మూడేళ్లలోనే రూ.11వేలకోట్ల రాబడులుసాధించింది. ఎంఒయుప్రకారం రిలయన్స్ కన్స్యూమర్ విభాగం రూ.1500 కోట్లకుపైగా నిధులతో ఇంటిగ్రేటెడ్ వనరులున్న ఫుడ్ పార్కులు ఏర్పాటుచేస్తుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్, కాటోల్ వద్ద ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులోను ఈ పార్కులు ఏర్పాటుచేస్తుంది. రిలయన్స్ డైరెక్టర్ ఇషా అంబాని మాట్లాడుతూ గ్రూప్ గ్రోత్ ఇఇజిన్‌లలో ఈ ఆర్సీపిఎల్ ఒకటని ఐదేళ్లలో లక్షకోట్ల రాబడులు సాధించే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించారు.

## వచ్చే ఏప్రిల్ నుంచే డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో చెల్లింపులకు రెండంచెల ధృవీకరణ వ్యవస్థ!

### తప్పనిసరిచేస్తూ ఆర్బీఐ మార్గదర్శకాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** డిజిటల్ లావాదేవీలు మరింత సురక్షితంగా కొనసాగించేందుకువీలుగా ఆర్బీఐ రెండంచెల ధృవీకరణను తప్పనిసరిచేస్తోంది. కొత్త వ్యవస్థను వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి అమలుచేయాలనినిర్ణయించింది. అన్ని చెల్లింపుల వ్యవస్థ కంపెనీలు పేమెంట్ వ్యవస్థల కల్పన సంస్థలు ఈ రెండంచెల ధృవీకరణ వ్యవస్థను విధిగా అమలుచేయాలని ఆర్బీఐ ఆదేశాలు జారీచేసింది. బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్‌కంపెనీలు కూడా వీటిని అమలుచేయాల్సి ఉంటుంది. అన్ని లావాదేవీల్లోను ఎస్ఎంఎస్ ఆధారిత ఒటిపిని రెండంచెల ధృవీకరణలో అమలుచేస్తాయి. ఈ మార్గదర్శకాలు అన్ని దేశీయ డిజిటల్ చెల్లింపులతోపాటు కార్డ్‌నాట్‌ప్రెజెంట్, క్రాస్ బోర్డర్ అంటే అంతర్జాతీయ లావాదేవీలకు సైతం వర్తిస్తాయి. అంతర్జాతీయ లావాదేవీలకు కార్డు కస్టమర్లు ఈ చెల్లింపుల వ్యవస్తను 2026 అక్టోబరు ఒకటినుంచి అమలుచేయాలి. కార్డు సిద్ధంగాలేనిపక్షంలో ఈ లావాదేవీల్లో ఒటిపిలు తప్పనిసరి అవుతాయి. చెల్లింపులు విఫలం అయితే అందుకు కస్టమర్లకు చెల్లింపు వ్యవస్థల కంపెనీలే బాధ్యత వహించాలి. ఈ మార్గదర్శకాలు డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం 2023 ప్రకారం కూడా అమలుచేస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది.

## రూ. 62,370 కోట్ల వ్యయంతో 97 తేజాస్ యుద్ధ విమానాలు

### రక్షణ మంత్రిత్వశాఖతో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ ఒప్పందం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** రక్షణమంత్రిత్వశాఖ 62,370 కోట్ల రూపాయల వ్యయంకాగల 97 తేజాస్ మార్క్ 1ఎ యుద్ధవిమానాలను తయారుచేసి ఇచ్చేందుకు ఒప్పందంచేసుకుంది. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ ఈ విమానాలను తయారుచేసి రక్షణ మంత్రిత్వశాఖకు సరఫరాచేస్తుంది. ఎయిర్‌క్రాఫ్ట్ తయారీలో మొట్టమొదటి భారీస్థాయి స్వదేశీ డీల్‌గా ఈ ఒప్పందంరికార్డయింది. రక్షణరంగ వ్యవహారాల కేబినెట్‌కమిటీ గత ఆగస్టులోనే ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఐఎఫ్‌వద్ద ఉన్న మిగ్ 21 స్క్వాడ్రన్ విమానాలకు వీడ్కోలు చెప్పడం వాటిస్థానంలో 87 తేజాస్ యుద్ధవిమానాలను కొనుగోలుచేయాలని ఆనాడే నిర్ణఇంచారు. ఈ కొత్త విమానాలకు గగనతల రక్షణ వ్యవస్థతోపాటు మారిటైమ్ సామర్థ్యంతోపాటు శతృవిమానాలను తుదముట్టించే సామర్థ్యం కూడా ఉంటుంది. మొత్తం 68 సింగిల్ సీట్ యుద్ధవిమానాలు 29 రెండు సీట్ల శిక్షణ యుద్ధవిమానాలు తయారవుతాయి. 2027-28నుంచి వీటి డెలివరీలు ప్రారంభం అయి ఆరేళ్లలో మొత్తం తేజాస్ విమానాలను రక్షణ వ్యవస్థకు అప్పగిస్తారు. పన్నులు మినహాయించి ఈ ఒప్పందం 62,370 కోట్ల విలువైనదిగా ఉంది. కొత్త ఒప్పందం గతంలో చేసుకున్న 83 తేజాస్ ఎంకె 1ఎ యుద్ధవిమానాలు 48 వేల కోట్లతో నిర్మించి ఇవ్వాలన్నది కూడా ఉంది. అయితే ఈ ఒప్పందం అమలులో జాప్యం జరిగింది. తాజా కొనుగోళ్లతో భారత్ విదేశీ రక్షణ వ్యవస్థలపై ఆధారపడటం కూడా తగ్గించుకోగలుగుతుంది. తేజాస్ విమానం తయారీ 105 భారత సరఫరాదారులనుంచి అందుతుంది. దీనివల్ల 11,750 ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించినట్లవుతుంది. స్వయంరక్షాకవచ్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థను కూడా ఈ తేజాస్‌లో అమరుస్తున్నారు. ఉత్తమ్ ఏసా రాడార్ వ్యవస్థలు కూడా ఉంటాయి. తయారీ మొత్తం దేశీయ విడిభాగాలతోనే ఉంటుంది. కొత్తగా 67 స్వదేశీ పరికరాలు కూడా వీటిలో అమరుస్తున్నారు. వీటితో ఇప్పటివరకూ ఉన్న మిగ్21 విమానాలు క్రమేపీ తొలగిస్తుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.